

ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక
8-5-'57
25 నయాపైసలు
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



2 వ వారము
ఆడవారి కన్నీటిని కాల్వలు కట్టించు కరుణరసమయ చిత్రము.....!
సారథి వారి
పెద్దరికాలు
దర్శకత్వం తాపీ చాణక్య

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక
Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 36
8-5-57

హేవిళంబి వైశాఖ శుద్ధ నవమి బుధవారం

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం: మోడరన్ థియేటర్స్‌వారి "వీరకంకణం"లో జమున.

అమెరికా అధ్యక్షుని ఎన్నిక పద్ధతి—	3
నా నయాగ్రాపైనా అనుభవం—	5
చిత్రనళినీయం—యద్దనపూడి సులోచనారాణి	7
తప్పెవరిది—విభావరి	11
మారినలోకం—సింహగురు	13
పీడకల—డి. హనుమంతరావు	18
న్యాయపరిశీలనం—పి. గణపతిశాస్త్రి	20
శారదా వాచకము—కె. వి. సూర్యనారాయణరావు	25
పంచతంత్రము—బొమ్మలకథ	28
చక్కిలి గింతలు—వల్లూరి కృష్ణారావు	30
వనితాలోకం—పవని నిర్మలప్రభావతి	35
పంజాబీ వంటకాలు—	36
స్వయమర్థచోరిణీం— పి. హెచ్. వెంకటేశ్వర్లు	37
వాడవాడకీ సేవచేసే నర్సులు—'ఎనిడ్ జీట్లిన్'.	38
చల్లని చూపు, చల్లని మాట—ఎ. పార్వతి	39
ఆస్పత్రిలో అవస్థలు—	40
నేటికథకులు—వేటూరి వినత	42
కాలిబాట—'సదానంద'	43
భైరవుడు—వి. రత్నావళి	44
జోస్యం నిజమైంది—పాలంకి వెంకటరామచంద్రమూర్తి	45
సినిమా—	50

అమెరికా అధ్యక్షుని ఎన్నిక పద్ధతి

ఈ నెల 6 వ తేదీన భారత రాష్ట్రపతి ఎన్నిక జరుగుతున్నది. పోటీలో ముగ్గురే అభ్యర్థులు పాల్గొంటున్నారు. డా॥ రాజేంద్ర ప్రసాద్ తిరిగిపోటీచేశారు. మిగతా ఇద్దరు అభ్యర్థులూ పంజాబ్ అడ్వొకేట్ శ్రీ హరిరామ్, అస్సాముకు చెందిన శ్రీ నాగేంద్రనారాయణదాస్. ఉపరాష్ట్రపతిగా డా॥ రాధాకృష్ణన్ పోటీలేకుండా మళ్లీ ఎన్నికయ్యారు.

రాష్ట్రపతిని లోక్ సభ, రాజ్యసభ సభ్యులు, రాష్ట్రశాసన సభల సభ్యులు ఎన్నుకుంటారు. అందుచేత మనరాష్ట్రపతి ఎన్నిక "ప్రత్యక్ష ఎన్నిక" (ప్రజలే సరాసరి ఎన్నుకోవడం) కాదు; పరోక్ష ఎన్నిక అవుతుంది. ఈ కారణంచేతనే మనరాష్ట్రపతికి ప్రభుత్వనిర్వహణలో పరిమితాధికారాలే ఉన్నాయి. అమెరికా అధ్యక్షునితో పోలిస్తే మనరాష్ట్రపతి అధికారాలు అతి స్వల్పం. అట్లా అని ఆయన పదవి కేవలం నామమాత్రం కాదు. ఫ్రెంచి అధ్యక్షునితో పోలిస్తే ఆయన అధికారాలు చాలా ఎక్కువే.

రాజ్యాంగరీత్యా భారతదేశానికి రాష్ట్రపతే అధిపతి. ఆయన భారతదేశపు ప్రథమ పౌరుడు; భారతరక్షణ సైన్యాలకు సర్వాధిపతి. పార్లమెంటును ఆయన సమావేశం చేస్తారు; రద్దుచేస్తారు. ప్రతి సమావేశ ప్రారంభంలోనూ ఆయన ప్రసంగిస్తారు; ఒక్కొక్కసారి సందేశాలు పంపిస్తారు. పార్లమెంటు ఆమోదించిన ఏ బిల్లు అయినా ఆయన అనుమతిలేనిదే శాసనం కాజాలదు. దేశంలోగాని, ఏదైనా ఒకరాష్ట్రంలోగాని అసాధారణ పరిస్థితి యేర్పడినప్పుడు, ప్రభుత్వం సరిగా కొనసాగనప్పుడు పార్లమెంటును గాని, శాసనసభను గాని రద్దు చేసి తానే స్వయంగా ప్రభుత్వం నిర్వహించగలరు.

ఈవిధంగా మన రాష్ట్రపతి పదవి రాజ్యాంగరీత్యా అతి ప్రధానమైనది. అయినప్పటికి ఈ పదవి ఎన్నికలలో, కాంగ్రెసు పార్టీతప్ప ఇతర పార్టీలేవీ శ్రద్ధవహించడం లేదు. కొన్నిపార్టీలు వోటింగ్‌లో పాల్గొనడమేలేదు. ఇది అంత గర్వించదగిన స్థితి కాదు.

ఇతర దేశాలలో, ముఖ్యంగా అమెరికాలో జరిగే అధ్యక్షపదవి ఎన్నికల సంరంభాన్ని చూస్తే, ఈ తారతమ్యం బాగా బోధపడుతుంది.



రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్.

అమెరికా అధ్యక్షుడు

అమెరికన్ అధ్యక్షుడు అమెరికన్ ప్రజలకు, ప్రభుత్వానికి, తన రాజకీయ పక్షానికీ ఏకైక నాయకుడు. కాంగ్రెసు (ఎగువ, దిగువ శాసనసభలు)కు తన ప్రభుత్వ విధానాన్ని, బడ్జెట్‌ను నివేదించి ఆమోదింపచేస్తాడు గనుక కాంగ్రెసుకు కూడా ఆయనే నాయకుడు. విదేశ వ్యాపారాలను ఆయనే నిర్ణయిస్తాడు. రక్షణసైన్యాలకు ఆయనే సర్వసేనాని. ఈవిధంగా ఆయన అమెరికన్ ప్రజల ఐకమత్యానికి ఏకైక చిహ్నంగా వర్తిస్తాడు. అమెరికన్ రాజ్యాంగ నిర్మాతలు, అధ్యక్షపదవికి అనేకమైన అధికారాలిచ్చారు. బలమైన కేంద్రప్రభుత్వం ఉంటేతప్ప దేశసుస్థిరతకు, అభివృద్ధికి అవకాశం ఉండదని అట్లా చేశారు. అన్ని అధికారాలున్నప్పటికీ అమెరికన్ అధ్యక్షుడు నిరంకుశుడు, నియంత కాదు. ప్రజలకు బాధ్యుడే. తప్పుదారిన నడిచిన అధ్యక్షుణ్ని శిక్షించే అధికారం, అవకాశం కూడా రాజ్యాంగరీత్యా ప్రజలకు ఉన్నది.

అమెరికాలో ప్రతిబాలుడూ పెద్దయ్యాక అధ్యక్షుడు కావాలనే కలలు కంటాడట. అధ్యక్ష పదవిపై ఆ దేశంలో మోజు.

ఈ అధ్యక్షుణ్ణి ప్రజలు సరాసరి ఎన్నుకోరు. ప్రజాప్రతినిధుల సభ, సెనేట్ సభల మొత్తం సభ్యుల సంఖ్యకు సమానమైన వోట్లుగల ఒక ప్రత్యేక "ఎలెక్టర్ల సంఘం" (ఎలెక్టరల్ కాలేజ్) అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటుంది. ప్రజలు ఈ "ఎలెక్టర్ల"ను ఎన్నుకుంటారు. ఎలెక్టర్లు అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటారు. అయితే ఈ ఎలెక్టర్లు తాము ఏ అభ్యర్థికి వోటుచేయ దలచారో ఆ అభ్యర్థి పేరుమీదుగానే ఎన్నికలలో పోటీచేస్తారు గనుక, ఈ ఎలెక్టర్ల ద్వారా ప్రజలే సరాసరిఅధ్యక్షుణ్ణి ఎన్నుకున్నట్లవుతుంది. అందుచేత ఒకవిధంగా ఇది ప్రత్యక్ష ఎన్నిక అనే అనవచ్చును.

ఎన్నికలు ప్రతి లీపుసంవత్సరంలోనూ నవంబరులో జరుగుతాయి. ఆనవంబరుకు ముందు అయిదారు నెలలపాటు అమెరికా దేశం అంతా ఎన్నికల సంరంభంతో ఉడికిపోతుంది.

1860 నుంచీ అధ్యక్షపదవికి అభ్యర్థులను రెండేపార్టీలు నిలబెడుతున్నాయి. ఒకటి రిపబ్లికన్ పార్టీ, మరొకటి డెమొక్రాటిక్ పార్టీ.

నాలుగేళ్ళకొకసారి మాత్రమే ఎన్నికలు

ఏలించే పనీ పాలించే పనీ

పూర్వపు ఫ్రెంచి రాజులు రాజ్యం చేయడమే కాక, పరిపాలన కూడా చేసేవారు.

బ్రిటిష్ రాజులు రాజ్యం చేస్తారు కాని పరిపాలించరు.

అమెరికా అధ్యక్షుడు పరిపాలిస్తాడు కాని రాజ్యం చెయ్యడు.

ఫ్రాన్సు అధ్యక్షుడు రాజ్యమూ చెయ్యడు, పరిపాలనా చెయ్యడు.

—సర్ హెన్రీ మెయిన్.

అమెరికాఅధ్యక్షుని ఎన్నికపద్ధతి

జరిగినా, దేశం ఎప్పుడుచూసినా ఎన్నికల వాతావరణంలో ఉన్నట్లే ఉంటుంది. ఎన్నికలైపోయినవెంటనే మళ్ళీ రాబోయే ఎన్నికలలో ఎవరిని అభ్యర్థులుగా నిలబెడదామా అనేచర్చలు, వివాదాలు ప్రారంభమవుతాయి. అందులో అభ్యర్థుల నియామకం తేదీ దగ్గరపడుతున్నకొద్దీ ఈ చర్చలు ముమ్మరమవుతాయి. అభ్యర్థులనియామకం అయిపోయి, ఎన్నికలతేదీ దగ్గరకొస్తున్నకొద్దీ, రెండుపార్టీల ప్రచారమూ పతాక స్థాయిలోకి పోతుంది.

అధ్యక్షపదవికి పోటీ చెయ్యాలనుకునే అభ్యర్థిఅమెరికాలో పుట్టినవాడై, 35 ఏళ్ళకు పైబడినవాడై ఉండాలి. సాధారణంగా ప్రొటెస్టెంటు మతస్థుడు, కుటుంబీకుడు మాత్రమే అభ్యర్థిగా ఉండడానికి అర్హుడు. 1928 లో డెమొక్రాటిక్ పార్టీ నిలబెట్టిన అల్‌ఫ్రెడ్ ఇ. స్మిత్ ఒక్కడే కాథలిక్ అభ్యర్థి. ఆడవాళ్లు అభ్యర్థులుగా ఉండవచ్చునుగాని ఇప్పటి దాకా ఎవరూ పోటీచెయ్యలేదు.

అభ్యర్థి సామాన్య కుటుంబంలో పుట్టి స్వయం కృషివల్ల వచ్చినవాడైతే మరీ మంచిది. సాధారణంగా అటువంటి వాళ్ళనే పార్టీలు తమ అభ్యర్థులుగా నిలబెడతాయి. ఎందుకంటే, దీనివల్ల అమెరికాలో ప్రతివాడూ స్వయం కృషివల్ల పైకిరావడానికి వీలుందనే ఆశాభావం ప్రజలకు కలిగి, అటువంటివాణ్ణే ఎన్నుకుంటారు. న్యూయార్క్, ఓహియో, ఇలినాయ్, కాలిఫోర్నియా మొదలైన పెద్ద ముఖ్యమైన రాష్ట్రాల గవర్నర్లకు కూడా అభ్యర్థులుగా నామినేట్ అయ్యేఅవకాశాలెక్కువ. ఎందుకంటే అధ్యక్షుడు కాబోయే వాడికి పరిపాలనానుభవం ఉండడం అవసరం. పెద రాష్ట్రాల గవర్నర్లకు అటువంటి అనుభవం తప్పకుండా వుంటుంది. 1900 నుంచి 1952 వరకూ 28 మంది పార్టీ అభ్యర్థులను చూస్తే అందులో 18మంది న్యూయార్క్, ఓహియో రాష్ట్రాల గవర్నర్లే.

సాధారణంగా ఒకసారి అధ్యక్షుడయిన వాడే రెండోసారి కూడా తనపార్టీ తరఫున పోటీచేస్తాడు. ఎందుకంటే అధ్యక్షుడు పార్టీ నాయకుడు గనుక పార్టీమీద అతనికి విశేషమయిన పలుకుబడి ఉంటుంది. అందుచేత కొందరి కిష్టం లేకపోయినా అతడే మళ్ళీ అభ్యర్థిగా నిలబడతాడు. అదీగాక అతను నిలబడకూడదని పార్టీ పట్టుబడితే, అతడి పరిపాలన, తద్వారా తన పరిపాలన బాగా లేదని పార్టీ ఒప్పుకున్నట్లే.

సాధారణంగా ఒకవ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడు కాగూడదు. నాలుగు సార్లు అధ్యక్షుడుగా ఎన్నికయిన వ్యక్తి ఫ్రాంక్లిన్ రూజ్వెల్టు ఒక్కడే. 1951 లో జరిగిన సవరణ ప్రకారం ఏ వ్యక్తి రెండు సార్లకు మించి అధ్యక్షుడు కాకూడదని నియమం ఏర్పరచారు.

అధ్యక్షపదవికి పోటీ చేయదగినంత రాజకీయ ప్రాధాన్యం, పలుకుబడి వ్యక్తులకెలా లభిస్తుంది? ముందు పార్టీ నాయకులను ఆకట్టుకోవాలి. పార్టీనాయకుల బలముంటే ప్రజలబలం కూర్చుకోవడం కష్టంకాదు. ఆ అభ్యర్థికి బ్రహ్మాండంగా ప్రచారం చేసి పెట్టే బాధ్యత పార్టీయే పుచ్చుకుంటుంది. ఇటీవల, ఫలానావాణ్ణి అభ్యర్థిగా నిలబెట్టాలని పెద్దపెద్ద ప్రజాసంస్థలే ఒత్తిడి చేసి పార్టీలచేత ఒప్పించడం కూడా జరిగింది. 1940 లో విండెల్ విల్కీ, 1952 లో ఐసెన్‌హోవర్ ల అభ్యర్థిత్వానికి ఇలాగే ముందు ప్రజాబలం, తర్వాత పార్టీబలం లభించాయి. అదీగాక ఉన్నవి రెండే పార్టీలు గనక, గెలిచేవాణ్ణి, అంటే ప్రజాబలం ఉన్నవాణ్నే అభ్యర్థిగా నిలబెట్టాలని పార్టీలు ప్రయత్నిస్తాయి.

అభ్యర్థుల నియామకానికి కూడా అధ్యక్ష ఎన్నికలకు జరిగినంత సంరంభం జరుగుతుంది. ఈ నియామకం పార్టీ జాతీయ మహాసభలో జరుగుతుంది. ప్రతిరాష్ట్రం లోనూ రాష్ట్రపార్టీ సభలు జరిగి కొందరు ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఈ ప్రతినిధులు జాతీయ మహాసభకు హాజరవుతారు. సాధారణంగా రిపబ్లికన్‌పార్టీ జాతీయ మహాసభ ముందూ, డెమొక్రాటిక్‌పార్టీ జాతీయమహాసభ ఓవారం తరువాతా జరుగుతాయి. జూన్, జూలై నెలల్లో ఈ సభలు జరుగుతాయి. క్రిందటిసారి మాత్రం డెమొక్రాటిక్ జాతీయమహాసభే ముందుగా(చికాగో, 1956 ఆగస్టు 13) జరిగింది. రిపబ్లికన్ సభ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఆగస్టు 20న జరిగింది.

దూర దూర రాష్ట్రాల నుండి వచ్చే ప్రతినిధులు స్పెషల్ రైళ్లలో వస్తారు. ప్రతి ప్రతినిధివర్గమూ ఒక నాయకుణ్ణీ, ఉపనాయకుణ్ణీ, కార్యదర్శినీ ఎన్నుకొనే వస్తుంది. లేకపోతే సమావేశమయ్యే నగరానికి వచ్చాకనైనా ఎన్నుకుంటుంది.

జాతీయ మహాసభ చాలా ఉద్రేక, ఉత్సాహవాతావరణంలో జరుగుతుంది. ఈ సభలో పార్టీ కార్యవిధానంమీద హోరాహోరీ చర్చలు జరుగుతాయి. కాని అసలు సమస్య ఏమిటంటే, అభ్యర్థినియామకం. బోలెడుమందిని అభ్యర్థులుగా ప్రతిపాదిస్తారు. ఒక్కొక్కర్ని ఒక్కొక్కళ్లు సమర్థిస్తూ, ప్రసంగిస్తారు. ప్రతివాడూ తన అభ్యర్థే ఎన్నికలలో గెలుస్తాడనీ, ఆ అభ్యర్థిని నిలబెట్టకపోతే పార్టీకీ, దేశానికీ ముక్తిలేదనీ వాదిస్తాడు. ఒక్కొక్కడి ఉపన్యాసం ముగి

(56-వ పేజీ చూడండి)



అమెరికా అధ్యక్షుడుగా రెండవసారి ఎన్నికఅయిన ఐసెన్‌హోవర్ చేత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎర్ల్‌వారెన్ ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం.

నా నయాపైసా అనుభవం

లాభసాటి బేరం

నయాపైసల మూలకంగా లాభసాటి బేరం గురించి మీ పత్రికలో ఎవరూ వ్రాయలేదు. దాని గురించి నాకు తెలిసిన కొన్ని విషయాలను అందరికి తెలియజేయాలని వ్రాస్తున్నాను.

మా నాన్నగారు కవరు కొందామని పోస్టాఫీసుకు వెళ్ళేరు. ఆయన బేడా అర్ధణా యిచ్చి ఒక కవరు ఇమ్మన్నారు. ఉద్యోగి ఒక కవరు రెండు నయా పైసలు తిరిగి యిచ్చేరు. ఈయన ఇంకొ ఒక పైసా వస్తుంది, యివ్వమన్నారు. "ఎలా వస్తుంది, బేడంటే 12 నయా పైసలు, అర్ధణాకు మూడు. కవరు ఖరీదు 13 నయా పైసలు పోగా, రెండు నయా పైసలు యిచ్చేను. ఇంకొక నయా పైస యెలా వస్తుంది" అని అడిగేరు. మా నాన్నగారు ఊరుకోకుండా "కానికి రెండు, అర్ధణాకు నాలుగు కాకుండా మూడంటా వేమిటి" అన్నారు. ఈ తనికేమీ తెలియదని హేళనగా నవ్వుతు "ఈ టేబిలు చూస్తే తెలుస్తుం"దని అన్నాడు. అందులో బేడ అర్ధణాకు యెంతవుందో చూడమన్నారు. చూస్తే పదహేరు నయా పైసలని వుంది. ఇంతలో పోషు మేష్టరుగారు వచ్చి "యేవండీ, ఈ గొడవంతా యేమిటి? నాకు పని తోచకుండా. పోనీ ఆయనకి ఒక నయాపైసా యెక్కువయిచ్చి పంపించండి" అని చెప్పి వెళ్ళిపోయారు. ఎలాగైతేనేమి మా నాన్నగారికి మూడు నయా పైసలు తిరిగి ముట్టినవి.

ఇదంతా యెందుకు చెప్పేనంటే చూడండి బేడా అర్ధణాకు 16 నయా పైసలు. కవరు ఖరీదు 13 నయా పైసలు, మనకు తిరిగి మూడు నయా పైసలిచ్చేరంటే అర్ధణా యిచ్చినట్లే. అంటె కవరు బేడకే వచ్చినట్లు. చూసేరా ఈరకంగా మార్చడంలో లాభం. ఈలాగే 11 నయా పైసలు ఒక కానియిస్తే మనకు ఒక కవరుయిస్తారు. ఇప్పుడుకూడా కవరు ఖరీదు బేడేఅయింది. ఎందుచేతంటే 11 నయా పైసలంటే 7 కానులేకదా.

ఇక కొగ్గులు కొనడంగురించి తలుచుకుంటే పులి, నాలుగు ఆవులు కథ జ్ఞాపకం వస్తున్నది. ఒక్క కొగ్గు కావాలంటే 3 కానులుయిస్తే వస్తుంది. ఇలాగ నాలుగు సార్లు కొంటే మూడణాలు అనగా 19 నయా పైసలకు 4 కొగ్గులు వస్తాయి. నాలుగు కొగ్గులు ఒకేసారి కొంటే 20 నయాపైసలివ్వాలి. చూశారా వాటిసంఘీభావ బలం!

మీరు కాని యిస్తే రెండునయా పైసల స్టాంపుయిస్తారు. మూడుసార్లు విడివిడిగా కొన్నారంటే మీబుక్ పోస్టుకి సరిపోయే స్టాంపులు మూడు కానులకే వస్తాయి. చూశారా? ఒకకానీ లాభం అన్నమాట. మీరు మూడు రెండునయా పైసల బిళ్ళలను కొంటే ఒకఅణా కావాలంటారు.

ఇదిచూస్తే నాకొక అనుమానం కలుగుతున్నది. రోజుకు ఈస్టాంపులమ్మేగుమాస్తా యేమాత్రం లాభంగడిస్తాడని? ఎందుచేతంటే వాడు విడివిడిగా అమ్మినానని చెప్పి (మొత్తంగా అమ్మినప్పటికి) అతేడా జేబులో వేసుకోవచ్చుకదా? ఈలాటివి లేకుండా పోస్టలుఅధికారులు ఆలోచించి తగినయేర్పాట్లు చేస్తారని నావిశ్వాసం.

ఇప్పుడేజరిగిన ఈఒక్క సంఘటన వ్రాసి ముగిస్తాను. వీధిలో ఐస్‌ఫ్రూటుకేక వినగానే పిల్లలంతా కావాలని తయారయారు. ఒక్కొటి అర్ధణా చొప్పున మొత్తం రెకొన్నాం. వాడికి డబ్బులు నేనిస్తానని నాన్నగారి పర్సు తీసుకొని వాడికి అణాన్నర అరునయా పైసాలు యిచ్చేను. వాడు బేడఅర్ధణాకి సరిపోయిందని వెళ్ళిపోయాడు. నాన్నగారుకూడా సరిగానే యిచ్చేవన్నారు. కాని ఇందులో కొంచెం లాభసాటి బేరంవుంది తెలుసా? వాడికి బేడఅర్ధణా అంటే 16 నయాపైసా లివ్వాలి. నేనిచ్చింది అణాన్నర అంటే 9 నయాపైసాలు + 6 నయాపైసాలు, మొత్తం 15 నయాపైసాలే యిచ్చేను. అందుచే నాకు 1 నయా పైస లాభంవచ్చింది అన్నాను. నాన్నగారు నవ్వి నీలాంటి వాళ్ళుంటే వాడు దివాలాతీయవలసిందేఅన్నారు. ఫరవాలేదు వాళ్ళలాభాలు కొంచెం తగ్గుతాయి కాని దివాలా తీయరు అన్నా.

పంతుల పాప.

* * *

అవి నయాపైసాలు క్రొత్తగా వచ్చిన రోజులు. ప్రజలకింకా వాటిపైన మోజు తగ్గలేదు. నాకు బ్యాంకిలో ఏదోపనుండి అక్కడికి పోయాను. అక్కడే నామిత్రుడొకడు డబ్బు తీసికుంటూ కనపడ్డాడు. అతడు డబ్బు పూర్తిగా తీసికొన్నతరువాత క్యాషియర్ మిగతాది చిల్లరఇచ్చాడు. ఆ చిల్లర 44 నయాపైసలు అంటే మాములు డబ్బు 7 అణాలు అన్నమాట. మావాడి చేతిలో నయాపైసాలుండటం చూచి ఒక ఆసామి "మీకు ఆనయాపైసాలకు మామూలు డబ్బు ఇస్తాను నాకు ఆ నయాపైసాలు ఇవ్వగలరా" అన్నాడు. మావాడు కొంచెం ఆలోచించి "సరే! దానికేంభాగ్యం అయితే నేచెప్పినట్లు మీరునాకు మాములు డబ్బు ఇవ్వాలన్నాడు." అతను దానికి ఒప్పుకొన్నాడు.

"మీదగ్గర పావలాకాసు ఉందా!" అని అడిగాడు.

"ఉంది!" అని అతను అది తీసిఇస్తే పట్టి చూపించి అతనికి 25 నయా పైసాలు ఇచ్చాడు. తరువాత అతనిదగ్గర 0-2-0 కాసు తర్వాత అణాకాసు తీసికొని, అతనికి మొదట 12 నయాపైసలు. తరువాత ఆరు నయాపైసలు విడివిడిగా ఇచ్చాడు. అతను

★ నా నయాపైసా అనుభవం ★

మొత్తం జేబులో వేసుకొని సంతోషంగా ఇంటికి పోయాడు. మావాడు నావైపు తిరిగి "చూశావురా ఎలా లాభం కొట్టేశానో, అతనికి న్యాయంగారావాల్సింది ఇచ్చేశాను. అంటే 48 నయాపైసలన్నమాట. అయితే నేను బ్యాంకినుండి 7 అణాలకి 44 తీసికొన్నాను. చూశావా మారకంపట్టీలు ఎలా ఉన్నాయో" అన్నాడు.

శ్రీనివాస్, (గుంటూరు)

* * *

ఆవేళ జీతాలిచ్చేరోజు. అంచేత ఎందుకైనా మంచిదని నయాపైసా మారకంపట్టీ కూడా జేబులో పెట్టుకొని ఆఫీసుకు బయలుదేరేను. జాగ్రత్తగా కన్వర్షను టేబులులో చూసి జీతం పుచ్చుకొన్నాను. మనం చదువుకొన్నాం, అంచేత యీ నయాపైసాలలో నష్టపోకుండా లాభం పొందాలని నిశ్చయించుకొన్నాను.

సామానులు కొంటానికి దుకాణానికి వెళ్ళేను. శెట్టిగారు తీరుబడిగా కూర్చున్నాడు. "పంతులుగారూ మీ దగ్గర నయాపైసాలుంటే యివ్వండి" అని 6 బేడకాసులు యిచ్చేడు. సరే యిక్కడే మన తెలివితేటలుపయోగించి టోపీ వెయ్యాలని నిశ్చయించుకొన్నాను.

"అవుతే శెట్టిగారు! అణాకన్ని నయాపైసాలు" అని అడిగేను. శెట్టి ఆరు నయాపైసాలు అన్నాడు. అవుతే మీకు ఎన్ని నయాపైసాలు యివ్వాలని అడిగేను. డబ్బై రెండు నయాపైసాలు యివ్వాలన్నాడు. శెట్టిగారి అమాయకత్వమునకు నవ్వుకొని 72 నయ్యాపైసాలు యిచ్చి ముప్పావలా జేబులో వేసుకున్నాను.

అవుతే నాకు 3 నయాపైసాలు లాభమన్నమాట. టేబులు ప్రకారము పావలాకి 25 నయాపైసాలు చొప్పున 3 పావలాలకు 75 నయాపైసాలు యివ్వాలన్నమాట. కాని నేను అణాకి 6 చొప్పున 12 అణాలకి 72 నయాపైసాలు యిచ్చేను.

ఇలా నా మొదటి నయాపైసా అనుభవం లాభంతో ప్రారంభ మయింది.

కె. యస్. ఇందిరమూర్తి,
యలమంచిలి.

* * *

పోస్టాఫీసులో నయా పైసాల విప్లవము

పై శీర్షికతో 24-4-57 వారపత్రికలో ఒకరు తమ నయాపైసాల అనుభవాలను వ్యక్తపరిచారు. ప్రజలందరూ పోస్టాఫీసు విషయంలో తాము బాగా నష్టపోతున్నామనీ, ప్రభుత్వం ప్రకటించిన 'మారకపు పట్టీ'ని ప్రభుత్వమే అమలుపరచడం లేదని ప్రభుత్వంపై నేరారోపణ చేశారు. కాని వారు ప్రభుత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకొనలేకపోయారు. క్రిందివిషయాలనుబట్టి ప్రభుత్వాన్ని పోస్టాఫీసువిషయములో సమర్థించవచ్చు.

ఇన్‌లాండ్ కవరు :–ఇవి ఒక కట్టలో 32 ఉంటాయి. పూర్వపు నాణెముల ప్రకారము ఒక కట్ట అమ్మగా రూ. 3 రావాలి. అంటే 300 నయాపైసాలన్నమాట. కాని పట్టీప్రకారం చూస్తే 0–1–6=9 నయాపైసలు అనగా ఒక కట్ట అమ్మితే 32 × 9= 288 నయాపైసాలు మాత్రమే వస్తాయి. ఇందువల్ల ప్రభుత్వము లేక పోస్టాఫీసు ప్రతీ 32 ఇన్‌లాండ్ కవర్ల" పై 12 నయాపైసాలు నష్టపోవలసి వస్తుంది. ఈ విధంగా రోజుకి ఎన్ని కట్టలు అమ్ముడు పోతాయో అన్ని × 12 నయాపైసాలు ప్రభుత్వం నష్టపోవలసి వస్తుంది. ఈ నష్టం భరించరానిది. కాబట్టి 'ఇన్‌లాండ్ కవరు వెల ఒక అర్థ నయాపైసా హెచ్చిస్తే సరిపోతుంది. కాని అర్థ నయాపైసాలు లేనందున ఒక నయాపైసా హెచ్చించవలసి వచ్చింది. ఇందువల్ల ఇన్‌లాండ్ కవరు 10 నయాపైసాలు అయింది. నయాపైసాలు రావడంవలన దీని వెల హెచ్చిందేకాని ప్రభుత్వం వారు 0–1–6కి 10 నయాపైసాలు తీసుకోవడం లేదు. ఇప్పుడు 0–1–6 ఇచ్చినందున ఇన్‌లాండ్ కవరు రాదు. మరియొక నయాపైసా కూడ యివ్వాలి. మార్కెట్టులో వస్తువు వెల పెరిగినట్లే ఇన్‌లాండ్ కవరు వెల కూడ పెరిగింది కాని 0–1–6కి 10 నయాపైసాలు పుచ్చుకొనడం లేదని ప్రజలు గమనించాలి. ఇంతేగాక చాలమంది ప్రజలు పోస్టాఫీసు క్లర్కులపై 'బ్లాక్ మార్కెట్' ఆరోపణ చేస్తున్నారు. ఇటువంటి ఆరోపణ ప్రభుత్వంపై చేయడం చాల శోచనీయం. ఇటువంటి దురభిప్రాయాలను ప్రజలు త్యజిస్తారని ఆశిస్తున్నాను.

కవరు:—పైవిధంగానే కవరు విషయంలో కూడ చాలమందిదురభిప్రాయపడుతున్నారు. పాతనాణెముల ప్రకారం కవరువెల రెండణాలు. కాని ఒక కట్టలో 16 కవర్లు ఉంటాయి. అంచేత పూర్వపు నాణెములు ప్రకారం ఒక కట్ట అమ్మితే 16 × 2=32 అణాలు అనగా 2 రూ॥లకు వచ్చేవి. కాని నయాపైసా పట్టీప్రకారం చూస్తే రెండణాలకి 12 నయాపైసాలు. ఒక కట్ట అమ్మితే 16 × 12=192 నయాపైసలు మాత్రమే వస్తాయి. కాని రెండు రూపాయలకి 200 నయాపైసాలు. అందుచేత ప్రతి 16 కవర్ల మీద 8 నయాపైసలు నష్టపోవలసి వస్తుంది. నష్టం రాకుండుటకును, అర్థనయాపైసా లేనందున, ప్రతి కవరుమీద ఒకనయాపైసా హెచ్చించబడింది. ఇందువల్ల కవరువెల 13 నయాపైసాలైంది. కాని రెండణాలకి 13 నయాపైసాలు కావు. ఇప్పుడు రెండణాలిచ్చినంతమాత్రాన కవరురాదు. ఒకనయాపైసా కలిపి యివ్వాలి. ఈవిధంగా కవరువెల హెచ్చిందిగాని బేడ విలువ తగ్గలేదు. ఈ విషయాన్ని తెలుసుకోక ప్రజలు, ప్రభుత్వం ఒక బేడకి 13 నయాపైసాలు పుచ్చుకుంటున్నదని, తాను ప్రచురించినపట్టిక తానే అనుసరించడం లేదని అపోహ పడుతున్నారు.

పై రెండింటిలోను ప్రభుత్వం ఒక నయాపైసా హెచ్చించడంవల్ల, పొందబోయే నష్టాన్ని కప్పటేగాక కొంతలాభాన్ని కూడ పొందుతూంది. కాని రెవెన్యూస్టాంపులు 1 రు అమ్మడంవల్ల 4 నయాపైసాలు నష్టపోతుంది. ఈ నష్టాన్ని ఆ లాభంలో సరిపుచ్చుతారు.

మరొక విషయం :

కాఫీ హోటళ్లలో అన్యాయం జరుగుతోందని కూడా ప్రజలనుకుంటున్నారు. అక్కడ జరిగే అన్యాయానికి పోస్టాఫీసుకి సంబంధంలేదు. పోస్టాఫీసువారు బేడకి 13 నయాపైసాలు పుచ్చుకుంటున్నారనే అభిప్రాయంతో కాఫీహోటళ్ళవాళ్లు బేడకి 13 నయాపైసాలు ప్రజలవద్దనుంచి పుచ్చుకోవడం చాల అన్యాయం. ఆ విధంగా వారు 13 నయాపైసాలు కోరినప్పుడు ప్రజలు 13 నయాపైసాలు చెల్లిస్తే అందుకు ప్రభుత్వానిది బాధ్యతకాదు. బేడకి 12 నయాపైసలు పుచ్చుకోక 13 నయాపైసాలను కోరేవారిపై తగినచర్య తీసుకోవాలి. ఇటువంటి సంఘటనలు కలుగకుండుటకే ప్రభుత్వం పట్టిక ఏర్పరిచింది. దేశమంతా దానిప్రకారం నడచుకోవాలి. కాఫీహోటళ్ళు ప్రభుత్వం యిచ్చిన పట్టీప్రకారంగాక తమ యిష్టం వచ్చినరీతిగా నాణెముల విలువలను మార్చడానికి ఎట్టిహక్కుగాని అధికారముగాని లేదని గుర్తించాలి.

మంగు వెంకటకృష్ణారావు,
బరంపురం.

★



చిత్ర నళినీయం

యద్దనపూడి సులోచనారాణి

[గతసంచిక తరువాయి]

చిత్రా,

నువ్వెంతపని చేశావో చూసావా? నేను తలపెట్టిన కార్యం అలా మధ్యలోనే ముగిసిపోవటానికి కారణం తెలియక యిన్నాళ్లూ రాత్రింబవళ్లు తల పగలకొట్టుకుంటున్నా అర్థంగా లేదు. ఇప్పుడు మా బామ్మ పుణ్యమా అని తెలిసింది. దానికి నీ వుత్తరాలే కారణం. కాని చిత్రా, యే వుత్తరాలయితే యీపని చెయ్యటానికి వుపయోగించాయో ఆ వుత్తరాలే ఆ పని మధ్యలో నిల్చిపోవటానికి కారణమైతే చిత్రంగదూ! ఈ వార్త వింటుంటే అందరిలో నిలబడి అసలా వుత్తరాలే యీ పని మొదలుపెట్టటానికి కారణమని గొంతు చించుకుని అరవాలనిపిస్తోంది. ఇంతగ్రంథం జరుగుతున్నా చివరికి నువ్వు మగపిల్లవాడివో ఆడపిల్లవో నాకీ క్షణం వరకూ నిజంగా తెలియనే తెలియదు. నాకింక పెళ్ళిగాదని మా బామ్మ దిగులుపెట్టుకుంది. మా నాన్నగారు నువ్వు ఆడపిల్లవనే అనుకుంటున్నారు. ఆడపిల్లవైతే ఒకసారి తప్పకుండా యిక్కడికిరా! మరి మగపిల్లాడివైతే—యేమో చెప్పలేను. నాకప్పుడు యేం చెయ్యాలో తెలియదు. వెంటనే వుత్తరం వ్రాయి. నీ మూలంగా యిక్కడ నేను అపఖ్యాతిపాలవుతున్నా. ఇందులో సగం నువ్వుగూడా పంచుకోవాలి. బాధ్యత గుర్తిస్తే వెంటనే బయలుదేరిరా. ఇంతకంటే నేను యిప్పుడు వ్రాయలేను. నీలో విశాల భావాలూ, నాకిందు వున్న ఆత్మీయతా చూపించటానికిదే సమయం.

నీకోసం యెదురుచూస్తున్న,

నీ, నళిని.

దానికి వెంటనే జవాబువచ్చింది. నళిని గుండె గుబగుబలాడింది. అనుకోకుండానే యెందుకో బుగ్గలు గులాబిమొగ్గలయాయి. ఉత్తరం తీసుకుని గదిలోకి పరుగెత్తి మంచం మీద వాలి చదువుకోవటం మొదలుపెట్టింది.

నా నళినీ,

ప్రతిసారీ 'ప్రియమైన నళినీ' అనే చిత్ర యీసారి నా నళిని అంటోందే అనుకుంటున్నావా? దానికి కారణం నీదగ్గరకు వచ్చినప్పుడు చెబ్తాను. జ్ఞాపకముంచుకుని అడుగు. నీతో నేను స్నేహం మొదలుపెట్టే రోజున మన స్నేహం యిలా నీమీద విరుచుకుపడ్తుందని దాంతో నీ భవిష్యత్ నాశన మవుతుందని మీ బామ్మ తారస్థాయిలో శోకాలుతీస్తుందని కలలో గూడా అనుకోలేదు. కాని అంతా విధి విలాసం. నీలో కార్యశూరతవుంది. కాని దాన్ని నీకు నువ్వే మేల్కొలుపుకోలేవు. ఈ శెలవుల్లో మీవూరు తప్పకుండా వస్తాను. కాని మీ బామ్మ రానిస్తుందా? అయినా నన్ను చూసిన తర్వాత మీ బామ్మ తప్పకుండా దేముడికి కనీసం ఒకడజను కొబ్బరికాయలన్నా కొడ్తుందని నా నమ్మకం. మరి నువ్వెలావుంటావో? ప్రత్యక్షంగా చూడాలని వుంది. మీ బామ్మ ముందు రానిచ్చి తర్వాత కొబ్బరికాయలు కొట్టినా ఫర్వాలేదు. అంతగా అయితే తర్వాత మనిద్దరం కలిసి అంతకు రెట్టింపు కొట్టవచ్చు. అసలు నేనెలాగూ యీ శెలవుల్లో మీవూరు రావాలనుకుంటున్నాను. కాని యింకా అనుకోవటంలోనే వున్నాను. నీ వుత్తరం దానికి ఒక స్థిరరూపాన్ని యిచ్చింది. పరీక్షలు అయిపోతున్నాయి. ముందు మావూరు వెళ్లాలి. అక్కడినుంచి మీవూరు. సరే మిగతా విషయాలు ముఖాముఖిని మాట్లాడుకుందాం. పరీక్షలకు నీ ఆజ్ఞానుసారం బాగానే చదువుతున్నాను.

ఇంతే,

ఇక చదువుకోవద్దు మరి?

మరా: నేను వచ్చినప్పుడు రంభలాగా డాన్సుచేసి (మీ బామ్మ చూడకుండా.) సరస్వతిలాగా వీణవాయించాలి (దీనిని మీ బామ్మ చూస్తేగానే). అలాగని ముందర మాటయిస్తేనే వస్తాను.

చిత్ర.

నళిని వుత్తరాన్ని రెండు మూడుసార్లు చదివి తన్లో తను తర్కించుకుంది. కాని కొన్ని విషయాలు మగపిల్లవాడని నిరూపిస్తే మరికొన్ని ఆడపిల్లని ఖండితంగా చెబుతున్నాయి.

నళిని దానికి జవాబిలా వ్రాసింది.

చిత్రా,

నిన్ను చూడగానే మా బామ్మ తప్పకుండా కొబ్బరికాయలు కొడ్తుంది అంటున్నావు గాబట్టి నువ్వు బహుశా ఆడపిల్లవనే నమ్ముతున్నాను. మగవాళ్ళకింత ఆటపాటలయందు ఆసక్తి వుండదు. నీకోసం యెల్లవేళలా మా తలుపులు తెరిచేవుంటాయి. శెలవులివ్వగానే మీ వూరుగూడా వద్దు, సరాసరి మా వూరు వచ్చెసెయ్. మరీ మరీ అడుగుతున్నాను. వచ్చేముందు ఒక చిన్న ఫోటో పంపవూ? తప్పకుండా పంపిస్తావని ఆశిస్తున్నాను.

నీకోసం యెదురుచూసే

నీ

నళిని.

మూడోరోజు టపాలో వుత్తరం, ఫోటో రెండూ వచ్చాయి. కాని ఫోటో కవర్ చేసి దానిపైన 'వుత్తరం చదివి ఫోటో చూడు' అని యింగ్లీషులో వుంది. నళిని గబగబా వుత్తరం తీసింది.

నళినీ,

అసాధ్యమైన కోరికలు కోరుతున్నావు. సరే. ఫోటో పంపుతున్నాను. నీ వుత్తరాల పోకడ చూస్తుంటే యేవో చాలా ఆశలు పెట్టుకున్నట్లుగా తోస్తోంది. నీ కోరిక చూస్తుంటే మీరరానిదిగా వుంది. నన్నన్ని విధాలా బంధించుతున్నావు. ఇది నాకున్న ఒక్క ఫోటో. ఈసారి నుంచిదిపంపుతాను. ఒకసారి మల్లెపూలజడ వేసుకుంటె వెనకనుంచిమామయ్య తీసాడు.

నీ

చిత్ర.

★ చిత్రనళినీయం ★

ఫోటో చూడక్కర్లేదనుకుంటూనే తీసేసి మూసింది. నళిని ఆలోచనా శిఖరాల నుండి ఒక్కసారి క్రిందికి దొర్లిపోయి ఫోటోవంక అలా శూన్యంగా చూస్తూవుండిపోయింది. ఫోటోలో ముఖం కన్పించటంలేదు. జడా పూలు యేదో గళ్ళ జాకెట్ కన్పిస్తున్నాయి. అనుకోకుండా నళిని హృదయంలోంచి బరువుగా ఒక్క నిట్టూర్పు బయటకు వచ్చింది. అందులోని చిత్రం అంటే తనకున్న కల్పనాభావం ఆనాటితో కరిగిపోయినట్లనిపించింది. గుండెల్నెవరో బలవంతంగా నొక్కుతున్నట్లు ఒకవిధమైన బాధ బయలుదేరింది. "చిత్ర! చిత్రంగానే ప్రవర్తించింది. తను ఆడపిల్లన్న సంగతి రెండుసంవత్సరాల క్రితమే తెలియజేస్తే యెంత బాగుండేది. ఏమీ లేకుండానే యీ వూళ్ళో తనెంత అపవాదు మోస్తోంది. చిత్ర యెవరో తెలియకముందు ఆ అపవాదులో ఒకవిధమైన మాధుర్యం వుండేది. ఇప్పుడది లేదు. నిజంగా చిత్రెవరో తనకు తెలియకుండా వుంటేనే బాగుండేది. తెలిసినా చిత్ర ఆడపిల్ల కాకపోతే తను సంతోషించేదేమో. నళినికి యీ వూళ్ళో వాళ్ళందర్నీ పిలిచి చిత్రని చూపించాలనిపించింది. కాని వాళ్ళు నమ్ముతారా? తాము అంటున్నాం గాబట్టి యెవరో అమ్మాయిని తీసుకువచ్చింది అనుకుంటారు. చిత్రమీద మొదటిసారిగా నళినికి అంతులేని కోపం వచ్చింది. కాగితం తీసుకుని గబగబా వుత్తరం వ్రాయటం మొదలుపెట్టింది.

చిత్రా,

నీ పేరుకుతగ్గట్లు చిత్రంగానే ప్రవర్తించావు. నీఫోటో చూచాను. చాల సంతోషించాను. ఏమీ లేకుండానే, ఎవరి ప్రమేయం, సంబంధం నాకు లేకుండానే యీ వూళ్లో నా పేరుకు మసి పూసుకున్నాను. ప్రతి వుత్తరంలో నువ్వు కావాలని నాలో అనుమానాలని రేకెత్తించివుంటావు. నువ్వు మగపిల్లవాడివిగా వూహించుకునేందుకు నాకు ఎన్నో అవకాశాలను చిత్రించావు. చివరకు నా వుత్తరం చూసి బహుశా నీలో నువ్వు చిరునవ్వు నవ్వుకుంటావనుకుంటాను. అది నా ఉద్దేశంలో చిరునవ్వు గాదు పైశాచిక నవ్వు. చిత్రా ఇది నీకు ఆనందాన్నిస్తోంది కదూ? అది మామూలు ఆనందం గాదు. అందులో ఒక విషమైన రాక్షసత్వం వుంది. నువ్వు చాలా తెలివిగలదానివని నేను ఒప్పుకుంటున్నాను. లేకపోతే రెండుసంవత్సరాలు నీతో ఉత్తర, ప్రత్యుత్తరాలు జరుపుతూ నిన్ను తెలుసుకోలేకపోతానా? మగపిల్లవాడివైతే నిన్ను పెళ్లిచేసుకుని వూళ్లో గలిన అపవాదును తొలిగించుకుందామనుకున్నాను. ఇప్పుడు నాకు మరో పెళ్లయినా ఇదివరకు ఎవరికో విశాఖపట్టణం ఉత్తరాలు వ్రాసేదనేవారు మానతారా? మానరు. ఏమీ లేకుండా నాకు కళంకం కల్గింది. దీనికి నువ్వేం సమాధానం చెప్తావు చిత్రా. నీసాటి ఆడపిల్లను గదూ! ఇలాటి అవమానం జరిగితే సహజంగా ఆడపిల్ల ఏంచేస్తుందో ఆలోచించగలవా?"

నళినికన్నీటిబొట్లు ఉత్తరంమీదపడి అక్షరాలని చెరిపివేశాయి. వాటిని ఇంక్‌తో సరిదిద్ది మళ్లా వ్రాయటం మొదలుపెట్టింది. "నాది గొప్పహృదయం గాబట్టి నాతో స్నేహం చేస్తానన్నావు. నీమూలంగా నాకు కళంకం కల్గినా నీతో స్నేహం వదులుకోను. ఇంకా హృదయ రహస్యాలు గూడా వ్రాసి నా గొప్పతనాన్ని మరోసారి బుజువు చేసుకుంటాను. కాని యీసారయినా సద్వినియోగపర్చుకో.

ఇంతే,
నళిని.

చిత్రనుండి వెంటనే జవాబు వచ్చింది:

నా నళినీ,

నామీద అంత ఆగ్రహం వచ్చిందే నే నేం చేశాను? నేను నీకు మొదటే వ్రాశాను మనకు లింగాల్లో భేదం వుండకూడదని. కాని నువ్వు నామీద ఆశలు పెట్టుకున్నావు. దానికి నే నేంచేయ్యను? మగపిల్లవాడివైతే పెళ్ళిచేసుకునేదానివా? ఎంత విచిత్రంగా మాట్లాడుతున్నావు. ఎంత ధీమాగా గొప్పతనాన్ని వెళ్లబోసుకున్నావు. మంచిది నేను వస్తాను. నన్ను చూసి నా చిరునవ్వు చల్లని వెన్నెలనిస్తుందో పైశాచిక విస్ఫులింగాలు వెదజల్లుతుందో స్వయముగా చూదువుగాని. తీవ్రంగా ఆశాభంగం పొందినవాళ్లెంతర్థంలేకుండా మాట్లాడుతారో చక్కగా నిరూపించావు. నాకోసం ఎల్లవేళలా మీ తలుపులు మరి ఇప్పుడుకూడ తెరిచివుంటాయా? నన్ను క్షమించి ఇంకా నాతో స్నేహంచేస్తున్నందుకు నా కృతజ్ఞత యెలా తెలపాలో తెలియటంలేదు. శలవలిచ్చారు.

కోపంతో వున్నప్పుడు నీముఖం
చూడాలనే కుతూహలంతో వున్న,
నీ,
చిత్ర.

వారంరోజులు తర్వాత నళిని ఒకరోజు రాత్రి చిత్రకి వుత్తరం వ్రాసింది,

చిత్రా,

ఏ కారణంచేత నువ్వు నన్నిలా ఆకర్షిస్తున్నావో నాకు తెలియటంలేదు. మా నాన్నగారో సంబంధంతీసుకువచ్చారు. అతను గూడా విశాఖపట్నంలో డాక్టరు చదువుతున్నాడు. బహుశా నీకు తెలిసేవుంటుంది. కాస్త అందమైన విగ్రహమే అనుకోవచ్చు. పేరు రవికుమార్. కమల లేదూ? ఆ అమ్మాయి పిన్తల్లి కొడుకు. నన్ను చూసి చేసుకుంటానంటున్నాడు. కట్నంగూడా వద్దట. అంత ఆకర్షణ యీ ముఖంలో యేం కన్పించిందో మరి. తాంబూలాలు పుచ్చేసుకున్నారు. నాతో మాట్లాడాలని అవకాశం యిప్పించమని నాన్నగార్ని అడిగాడట. తర్వాత తెలిసింది. నేను రోజూ సాయంత్రంపూట సన్నజాజిపూలకోసం మా తోటలోకి వెళ్తాను. నిన్నగూడా అలాగే వెళ్ళాను. అక్కడకు వచ్చి అతనుగూడా వున్నాడు. నేను వెనక్కుతిరిగి గబగబా వచ్చెయ్యబోతుంటే "మీతో మాట్లాడాలని వచ్చాను. వెళ్ళిపోకండి" అన్నాడు ప్రాధేయపూర్వకంగా. నే నాగిపోయాను. సన్నజాజి పందిరికి నేనీ చివరా, అత నాచివరా నుంచుని వున్నాం.

"నన్ను చేసుకోవటం యిష్టమనే అనుకుంటున్నాను" అతను సన్నజాజి మొగ్గని

మృదువుగా గిల్లుతూ అన్నాడు. నేను మాట్లాడలేదు. నిస్సంకోచంగా అతని వంక చూస్తున్నాను. అసలే నాకు యీ జన్మలో పెళ్ళిగాదని శోకాలు పెట్టున్న మా బామ్మ యితనినిచూస్తే రాజగోపాలస్వామికి యెన్ని కొబ్బరికాయలు కొడ్తుందో అని అంచనా వేస్తుండగా "చెప్పండి. మరేం ఫర్వాలేదు. సందేహించకండి" లాలిస్తున్నట్లుగా అన్నాడతను. నే నక్కడ నుంచోలేక యింట్లోకి పారిపోయి వచ్చాను. యెందుకు? సిగ్గుపడిగాదు చిత్రా, గుండెల్ని పిండే బాధతో, నా వ్యధిత హృదయం అతనికి కనిపిస్తే మరో విధంగా అర్థం చేసుకుంటాడని పారిపోయి వచ్చాను. లోతుల్ని కొలిచే అతని కళ్ళకి అందనిదంటూ వుండదనిపించింది. నా బాధెందుకో తెలుసా చిత్రా. నీకోసం. అతని అందాన్ని, ధీరత్వాన్ని నాకు యింత సన్నిహితంగా వున్న నీలో ఆసించాను. కాని అవి నీలో నాకు అందలేదు. పరాయి పురుషుడిరూపంలో అందుతున్నాయి. అందం, ఆనందం దొరికినచోట మనసు, మమత నాకు లభించలేదు. లగ్నాలుగూడా నిశ్చయించారు. 13 వ తారీఖున నా వివాహం జరుగుతుంది. అప్పటికి నీకు శలవలిచ్చి చాలారోజులవుతుంది. ఈ వివాహానికి తప్పకుండా రా. నీలోని గుణాలు యెలాంటి వ్యక్తిలో ఆసించానో తెల్సుకుందువుగాని.

నీ,
నళిని.

వారం తిథి బాగా లేవని మూడురోజుల ముందరే నళిని బామ్మ నళినిని పెళ్ళికూతురు చేయించింది. పెళ్ళి సలక్షణంగా కావాలని ముందర యింట్లో పెళ్ళికూతురుచేత, తర్వాత గుళ్ళోను మొత్తం ఓ 50 కొబ్బరికాయలు రాజగోపాలస్వామికి ముట్టాయి. నళిని చిత్ర కోసం యెదురుచూస్తుంటే కాస్త ఆలస్యంగా చిత్రనుండి వుత్తరంమాత్రమే వచ్చింది. ఇల్లంతా చుట్టాలు, స్నేహితులు అంతా నానా హడావుడిగా వుంది. కమల మళ్ళా రాకపోకలు సాగించింది. పెళ్ళి పందిట్లో నళిని చిత్రఫొటో చూపించి అందరికీ యీ అమ్మాయే విశాఖపట్నంనుంచి వుత్తరాలు వ్రాసేది అంది. అంతకుముందు నళినిమీద అభాండాలు వేసినవారందరూ ముఖాలు ప్రక్కకు తిప్పుకున్నారు ఫొటో చూడటాని కిష్టంలేక. కమలకి కొంచం వుపన్యాసం యివ్వాలనుకుంది నళిని. కాని తీరా చూస్తే కమల అక్కడ కన్పించలేదు. ఇంతలో చిత్ర నుండి వుత్తరం వచ్చింది. తన గదిలోకి పోయిన నళిని చదువుకో సాగింది.

ప్రియాతిప్రియమైన నానళినీ,

బహుశా నీకిది నా ఆఖరి వుత్తరం అనుకుంటాను. నీ పెళ్లికి బహుశా రావటం వీలుగాదేమో. కాని సాధ్యమైనంతవరకూ రావటానికి ప్రయత్నం జేస్తాను. ఇప్పుడు సరాసరి మావూరు వెళ్లిపోతున్నాను. ప్రస్తుతపు పరిస్థితులలో నా యడ్రస్ నీ కివ్వలేను. అందుకు క్షమిస్తావనే ఆసిస్తాను. తిరిగి తొందర్లో నా అడ్రస్ యిస్తూ వుత్తరం వ్రాస్తాను. రవిని గురించి విన్నానుగాని చూడలేదు. అందగాడని నా స్నేహితులంటుంటే విన్నాను. కాని నీకు భర్తగా లభించుతున్న అతని అదృష్టంమటుకు సాటిలేనిదని నా అభిప్రాయం. నాకు మెయిల్ కి టైమవుతోంది. మీ కాబోయే నూతన దంపతులకు నా హృదయపూర్వక అభివందనలు.

నీ,
చిత్ర.

ఉతరాన్ని గురించి యెక్కువగా ఆలోచించటానికి నళినికి టైం లేకపోయింది.

వాళ్లబామ్మ కొట్టిన కొబ్బరికాయల ఫలితంగాని లేక ముహూర్తబలంగాని నళిని పెళ్లి సలక్షణంగా అనుకున్న ముహూర్తానికి ముచ్చటగా, వేడుకల్తో ముగిసింది. యెంత సంతోషంలో వున్నా నళినికి ఒక చెవి ఒక కన్ను పరధ్యాసగానే వున్నాయి. కాని చిత్ర రాలేదు సరిగదా మళ్లా వుత్తరం గూడా వ్రాయలేదు. క్రమంగా రోజులు, గూడా దొర్లిపోయినాయి. నళిని రవి కిదేమీ చెప్పలేదు. కాని ఒకరోజునమటుకు అడిగింది. వూళ్ళోవాళ్ళు తనమీద యేమీ చెప్పలేదాని. రవి యీ ప్రశ్నకు జవాబివ్వకుండా వెళ్లిపోయాడు. నళినికి బాధ కల్గింది. ఎందుకు చెప్పరు. చెప్పినా లెఖ్ఖచెయ్యకుండా తన్ని చేసుకున్నాడన్నమాట. నళినికి కృతజ్ఞతాభావంతో కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

ఒకరోజు నళిని పట్టలేక రవిని అడిగింది చిత్ర అనే అమ్మాయిని గురించి తెలుసునా అని.

"అమ్మాయిల్ని గురించి తెలియదు గాని, అబ్బాయిల్లోనే చిత్ర అనే పెన్ నేమ్ గల వాడొకడున్నాడు" అన్నాడు రవి సహజంగా. నళిని ఆకాశాన్నుంచి క్రింద పడ్డట్లనిపించింది. ఇంతలో కమల అక్కడికి రావటంతో భార్యాభర్తలు సంభాషణ ఆపేశారు. కమల కాపురానికి వెళ్తూ త్రోవలో అన్నగారి దగ్గర దిగింది. మళ్ళా వెళ్లిపోవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. రవి కమలకి మంచి చీరా జాకెట్ తెచ్చాడు. కమల భర్తకు గడియారం కొనుక్కోమని డబ్బిచ్చాడు. భర్త ఉదారత్వానికి నళిని మురిసిపోయింది. వెళ్లబోతూ కమల హఠాత్తుగా నళిని పాదాలమీద వ్రాలి 'వదినా నన్ను క్షమించు. తెలియక నిన్నుగురించి అమ్మావాళ్లతోబాటు నేను గూడా వాగాను.' నళినిముఖం జేవురించింది. వెనకాల రవి వచ్చి నిలబడిన సంగతి యిద్దరూ చూడలేదు,

"నిన్నని లాభంలేదు కమలా. ఇది కేవలం నా దురదృష్టం. అయితే అది మీ అన్నయ్యకు గూడా తెలుసా?" కమల తెలుసునన్నట్లు తలూపింది. నళిని భారంగా నిట్టూర్పు విడిచి "ఇందులో యేమీ లేదని చెప్పినా ఆయన నమ్మరేమో బహుశా. అవాళ నీకు చూపించానా చిత్రఫొటో?" కమల చూపించలేదన్నట్లుగా తలూపింది. 'రా అయితే చూపిస్తాను. నా పెళ్లికాక ముందు ఒక వుత్తరం వ్రాసింది. మళ్లా వుత్తరం గూడా వ్రాయలేదు. బహుశా పెళ్లిఅయిందిగదాని మానేశాడేమో?" నళిని తనకు తనే వులిక్కిపడి కమల ముఖంలోకి చూసింది. కమల యిది గ్రహించే పరిస్థితులలో లేదు. తన చీరఖరీదు యెంతుందో అంచనా వేసుకుంటోంది, "నాకు తొందరలో చావుకల్గితే చాలా బాగుంటుంది" నళిని శూన్యంలోకి చూస్తూ అంది. 'నళినీ!' వెనకనుంచి బిగ్గరగా రవి కేక పెట్టాడు. చీర ఖరీదు లెక్కవేస్తున్న కమల, శూన్యంలోకి చూస్తున్న నళిని వులిక్కిపడి వెనక్కి తిరిగారు. రవి చేతులు చాచి నళిని పట్టుకున్నాడు. యేడుస్తూ నళిని తన ముఖాన్ని అతని వక్షస్థలంమీద తలదాచుకుంది "నా

★ చిత్రనళినీయం ★



ఇటీవల ఉత్తమకావ్యరచన పోటీలో ఆంధ్రప్రభుత్వ బహుమతి పొందిన "అమరవీణ" కావ్యరచయిత శ్రీ వజ్ఝలవెంకటేశ్వర్లు. వీరిని జయపుర పౌరులు ఏప్రిల్ 13 న సన్మానించారు.

ఋండే యిలాంటి మాటలు మాట్లాడుతున్నావా? నీమీద. నాకేమీ అనుమానం లేదు నళినీ. నిన్ను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను. చిత్ర మగవాడని తెలిసినా గూడా నన్ను బాధించటంలేదు. ఇంకపైగా ఆ సంఘటన తల్చుకున్నప్పుడల్లా నా మనసు పరవశత్వంతో పూగిపోతుంది. నీవు చిత్ర ఒకటి, నేను ఒకటీగాదు. చిత్రని గురించి నువ్వేమీ చెప్పకపోయినా నా కంతా తెలుసు. నా ఆనందాన్ని నీ కెలా తెలియజెయ్యాలో తోచటంలేగు." అతని కళ్లల్లో ఆనందాశ్రువులు నిల్చాయి. కమల అక్కడినుంచి తప్పుకుని వెళ్లిపోయింది. అతని వుదార హృదయాన్ని యే విధంగా అర్థం జేసుకోవాలో నళినికి తెలియలేదు.

కమలావాళ్లు వెళ్లిపోయినతర్వాత ఒక రోజున సాయంత్రం రవి యింట్లో లేని సమయంలో నళిని యేమీతోచక అతని లైబ్రరీ రూమ్‌లోకి వెళ్లింది. నళిని సాధారణంగా అక్కడికి వెళ్లదు. తనకు కావాల్సిన పుస్తకాలు రవే యివతలకు తీసుకొచ్చి యిస్తాడు. పుస్తకాలని యెవరిని పడితే వాళ్లని రవి ముటుకోనివ్వడు. నళిని యీ నిబంధనకు తనుకూడా తలొగ్గింది. ఇవాళ తప్పనిసరికి వెళ్ళింది. రవి తొందర తొందరగా బట్టలు మార్చుకుని వెళ్లాడులా వుంది. విడిచినబట్టలు సోఫాలో గిరాటుకొట్టివున్నాయి. నళిని ఆ బట్టలుతీసి మూలనున్న బుట్టలో వెయ్యబోతూ అలవాటు చొప్పున జేబులు చూసింది యేమయినా వున్నాయేమోనని. చొక్కా జేబులో తాళంచెవులు గుత్తీ, చిల్లరడబ్బులు జేబురుమాల, మరో చిన్న తాళంచెవీ వున్నాయి. ఆ చిన్న తాళంచెవిని గురించి యెన్నిసార్లడిగినా, అతను చెప్పలేదు. నవ్వుతూనే తోసేస్తున్నాడు. నళినికి అనుమానం వేసి తిన్నగా ప్రక్కకు తిరిగి అతని రూంలోకి వెళ్ళింది. అక్కడ స్టాండుకు బట్టలు, ఒక డ్రాయరు, కుర్చీ తప్ప యేమీలేవు. నళిని కొంత కష్టపడి డ్రాయర్ను తెరిచింది. అందులో ముందరగా అతడి డైరీ కనిపించింది. అందులో ఒకచోట నళిని దృష్టి ఆగిపోయింది. అందులో "నేనే చిత్రనని నళినికెలా తెలియబర్చాలో తెలియటం లేదు." క్షణంసేపు నళిని కళ్ళు బయర్లు కమ్మినాయి. తిరిగి మళ్లా చూసింది. అసలు శబ్దాలకు అర్థం లేదనిపించింది. డైరీని ఇవతలకు లాగి ఇంకా యేమున్నాయోనని చూసింది. ఎత్తు చాలా తక్కువగా వుండి ఒక సన్నని పొడుగాటి పెట్టె వుంది. దానిని ఎలా తెరవాలో నళినికి తెలియలేదు. తర్వాత ఆకుపచ్చగా బైండుచేసిన ఒక పుస్తకం కన్పించింది. దాని లోపలి పేజీమీద రవికుమార్ అని అందంగా పెయింట్ చెయ్యబడి క్రింద "పెన్-నేమ్" చిత్ర అని గోల్డెన్ రంగుతో పెయింట్ చెయ్యబడి వుంది. నళిని యంత్రంలాగ పేజీ తిప్పింది. గుండె చలించటం మర్చిపోయింది. తను మొదట చిత్రకి వ్రాసిన ఉత్తరం అందులో జాగ్రతగా పిన్ చేయబడి వుంది. ఇంతలో వెనకనుంచి 'హంచ్' అని తుమ్ము విన్పించింది. నళినివులిక్కిపడి వెనక్కు తిరిగి చూసింది. రవి నుంచుని ఉన్నాడు. అతని కళ్ళు ఒకవిధమయిన కాంతితో మెరుస్తున్నాయి. దగ్గరకు వచ్చి కందగడ్డలాగ అయిన నళిని ముఖం చూసి "ఎందుకలా సిగ్గుపడ్తావ్? దొంగతనం పట్టుకోబోయి దొంగనయానా? నా బరువును దింపావు. రాత్రింబవళ్ళు నీకు యీ విషయం యేవిధంగా చెప్పటమా అని సందేహిస్తున్న నాకు విశ్రాంతి యిచ్చావు. పోనీలే కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు." నళిని యింక అక్కడుంటే నోరు మెదపదని సంబాళించుకోవటానికి కొంత ప్రక్కకు వెళితే బాగుంటుందని మంచినీళ్ళు కావాలన్నాడు.

రవి అనుకున్నట్లే అయింది. నళిని తన్ని తాను పూర్తిగా సంబాళించుకుని వచ్చింది. మంచినీళ్ళు అందిస్తూ, "ఇంత నాటకం ఆడగల సమర్థులనుకోలేదు." అంది. "అవును. యెలా అనుకుంటావు? నీ చూపంతా చిత్ర మీద ఉంటేగ? సరేగాని నీ దగ్గర వున్న ఆ వుత్తరాలు గూడా ఇటు ఇవ్వు. రెండూ కలిపి బైండ్ చేయించి పేరు పెడ్దాం. "గొప్పే. పాపం కష్టపడిపోతారు." నళినికి కొంత ధైర్యం వచ్చింది. "గొప్ప కాదూ మరి. నీతో యింత నాటకమాడటం యెవరికి చాతనవుతుంది. పెళ్లిలో నే చెబ్దా మనుకున్నాను. కానీ నువ్వు చెప్పనిస్తేనా?" అని రవి నవ్వుతూ అన్నాడు. నళినికి ఉత్తరంలో మాటలు జ్ఞాపకం వచ్చాయి. "నన్ను చూచి నిర్ణయించుదువుగాని నావ నవ్వు వెన్నెలలు వెదజల్లుతుందో లేక పైశాచికపు విస్ఫులింగాలు రాలుతాయో?" యెంత ధీమాగా రాసుకున్నాడో. "మరి నాకు మీరు పంపిన ఫోటో..." సందేహం దాచుకోలేక పోయింది నళిని. "అది మా కమలది. దానికి చూపించలేదుగా. అందుకని రంగం బయట పడలా. ఒకసారి నేనే ఆ ఫోటో తీసాను. దానికి తరువాత అది పంపటానికి వీలు లేక నా దగ్గరే వుండిపోయింది. ముందర నిన్ను యేడిపించి తర్వాత నా ఫోటో పంపుదామనుకున్నాను. కాని పరిస్థితి విషమించటంవల్ల నోరు మూసుకుని వూరుకున్నాను. నే నే నీ వాడనవుతున్నప్పుడు యింకా ఫోటో యెందుకని సరిపెట్టుకున్నాను. అవాళ మీ తోటలో చెప్పాలని ప్రయత్నం జేసాను. కాని నువ్వు చెప్పనియ్యలేదు.

"యెంత గొప్పవారండి" నళిని హృదయ కుహరంనుండి ఒక నిట్టూర్పు బయటకు వచ్చింది.

"నే నేం గొప్పవాడిని, నువ్వుగాని. సర్లే. నా వుత్తరాలిటియ్యి" రవి యెత్తిపొడుపుగా అన్నాడు.

నళిని పెదవులమీద చిరునవ్వు కదిలింది, "యేం పేరు పెడ్తారు."

"నువ్వు చెప్పుమరి" రవి నళిని కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"యేమో నాకు తెలియదు" నళిని అక్కడి నుంచి పారిపోబోయింది.

"ఆగాగు!" రవి నళిని జడపుచ్చుకుని, "చిత్ర నళినీయం తెలుసా?" అన్నాడు.

మనసులో తెరలు వీడిపోయినట్లు ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

[సమాప్తి.]

తప్పెవరిది?

పరమేశ్వరం యీ ఊళ్లో నాలుగు రోజుల నుంచీ ఉంటూకూడా నన్ను కలుసుకోలేదన్న విషయం జ్ఞాపకంవచ్చినపుడల్లా మనస్సు కలవరపడుతుంది. ఎప్పుడీఊరు వచ్చినా ముందుగా జాబు వ్రాసేవాడు. ఇక తిరిగి అతనావూరు వదిలేదాకా యిద్దరంకలసే తిరిగేవాళ్లం. నేను తప్ప పరమానికి చెప్పుకోదగ్గవాళ్ళెవ్వరూ లేరు. పరమం యీసారి నన్నెందుకు కలుసుకోకుండా వెళ్ళాడు? ఇదీ నన్ను పీడించే సమస్య...

చూడటానికి స్వల్పమయిన కారణాలే కాలక్రమేణా యిటుక వరుసల్లా పేరుకొని కోటగోడల్లా నిలబడి బాంధవ్యాలను మరుగుపరుస్తాయంటారు. పరమేశ్వరం యీనాడు చూచాయగానయినా తనరాక నాకు తెలియపర్చలేదంటే... యిది ఒకనాటితో కలిగిన పరిణామం అయివుండదు, ఎంత తరచి చూసినా పరమం మనస్సు కష్టపడే పనులు నేనేం చేశానో తోచడంలేదు. ఈ విషయాలే ఆలోచిస్తూ ఒకనాడు మా గోవర్ధనం యింటికి వెళ్లాను. గోవర్ధనం లోపల స్నానం చేస్తున్నట్టున్నాడు... చిన్నమ్మాయి వచ్చి 'కూర్చోండి బాబాయ్...' అంటూ డ్రాయింగ్ రూములోకి తీసికెళ్లింది. ఏమీ తోచక అటుయిటు చూస్తున్న నాదృష్టి పుస్తకాల షెల్ఫుమీద పడింది. పుస్తకాలంటే చెవికోసుకునే నామనస్సు ఊరకలేస్తుంటే ఒక బైండు పుస్తకం యివతలికి లాగాను. అప్పుడే జారిపండిపోక కవరు అది చింపి ఉన్నది. దస్తూరీ పరమేశ్వరుని దవడంతో ఆ జాబు చదవాలనిపించింది. నాదికాని జాబు చదవడానికి మనస్సు యిష్టపడక పోయినా... చదవకుండా ఉండలేకపోయాను. ఆ జాబు చదువుతున్నకొద్దీ నాకాళ్లకింద భూమి విచ్చిపోతున్నట్టయింది. మనస్సు వికలమయిపోయింది.

ముకాం: విజయనగరం.

"ఒరే గోపూ...

నువ్వు నిజంగా గోవులాంటివాడివేరా... అందుకే నామనస్సంతా విడమర్చి నీకు ఇప్పుడు రాస్తున్నాను. అక్కడ ఉన్న నాల్గురోజులూ నువ్వు నన్నెన్నో ప్రశ్నలడిగావు అప్పుడు సమాధానం చెప్పలేదు. యిప్పుడు రాస్తున్నాను... మానావమానాలకి స్నేహం అతీతమంటావు నువ్వు. కాని ఆ స్నేహం ఆధారంగా అవమానంచేస్తే ఎలా భరించడం? రఘు ఎంతవాడు కాకపోతే నా గురించి సుశీలకి అలా ఉత్తరం రాస్తాడు. "నేనొక పనికిమాలిన వాడినట. కొత్త ఉద్యోగం రాగానే కళ్లు నెత్తికొచ్చాయట. పట్టుదల పౌరుషం అంతగాలేని వాడినట. పాపం పెళ్లిచేసుకుంటూ 'చూడు బావా రఘు ఎలా రాశాడో' అంటూ సుశీల ఆ జాబు నాకు చూపడం మూలాన్ని యీనాడయినా వాడి నిజ స్వరూపం పూర్తిగా తెలిసింది. ఏదో పినతండ్రికొడుకుకదా అని అభిమానం తప్ప వాడికీ నాకూ సంబంధం ఏమిటీ... చివరికి నన్ను పెళ్ళిచేసుకునేదానికంటె సుశీల ఏదో నుయ్యో...గొయ్యో ...చూసుకోడవం మేలుట...చూశావా

‘విభావరి’

ఇక వాడిమొహం ఎందుకుచూస్తాను?" ఇలా చదువుతున్నకొద్దీ నాకు మతిభ్రమించినట్లయింది. నేనెన్నడూ సుశీలకి ఒక్కసారయినా జాబురాయలేదే! సుశీల పరమానికి నిశ్చయింపబడినప్పుడు మొదట సంతోషించింది నేనేగదా...ఒకవిధంగా దానికి ప్రోత్సాహమిచ్చింది నేనేగదా... ఇదెక్కడి విపరీతం... నేను సుశీలకి... అందులో పరమాన్ని తిడుతూ జాబు రాయడమూ......

'ఈజాబు నీకు పంపుదామనుకుంటున్నాను' అన్న గోవర్ధనంమాటలు విని తలెత్తి చూశాను...తన జాబు చదివినందుకు ఏమనుకున్నాడోఅని సిగ్గుపడ్డాను. కానిస్వచ్ఛంగా, ఆదరణగావస్తున్న కంఠాన్ని వినగానే మనస్సుకొంత తేలికపడింది... 'నిజంగా యిందులో నాకేమి తెలియదురా గోపూ' అన్నాను ప్రాధేయపూరకంగా...

'ఆమాత్రం నాకు తెలియదూ...అసలు వాడికి సుశీల సంబంధం కుదిర్చిందినువ్వే కదరా...మూడుసార్లు మూడోసార్లు బోగొట్టుకున్న ఆ సగం యింటర్మీడియటుగాడికి నాపిల్లనివ్వనన్న సుశీలతల్లిని నువ్వేగా ఒప్పించావు...కాని వాడు స్పష్టంగా నువ్వేరాశావని రాస్తున్నాడు...ఏమనుకోవాలో తెలియడంలేదు. మనం ఒకసారి విజయనగరం వెడదాం...ఏమంటావ్' అన్నాడుగోవు... నేను సరేనని తలూపాను.

* * *

'జాబయినా రాయకుండా వచ్చేశావ్... ఏమిటిసంగతులు' అని గోవర్ధనాన్ని పలుకరించే పరమేశ్వరం నేనున్నట్టే వ్యవహరించడంలేదు. 'నువ్వురాశినజాబు మనవాడికంటపడింది...వీడు తనకేమీ తెలియదంటున్నాడురా' అని గోవర్ధనం అంటుంటే పరమం నాకేసి అసహ్యంగా చూశాడు.

'స్పష్టంగా తనురాశినజాబు ఉండగానే యింత నాటకమా...సుశీ...సుశీ' అని కేకేశాడు. సుశీలవచ్చింది...నాతోచాలా





కలకత్తా ఆంధ్ర సంఘంవారు ప్రదర్శించిన "గుమాస్తా" నాటకంలో పాల్గొన్నవారు: డి. జి. శర్మ. జి. భాస్కర్, జానకమ్మ
బి. కామేశ్వరరావు, కె. వి. కృష్ణమూర్తి, యమ్. యస్. చక్రవర్తి.

"తప్పెవరిది"

మూడావంగా ఉంది

'ఏదీ...అజాబు?'

'ఇంకా ఎందుకూ.. రుజువులూ... సాక్ష్యాలూ చూపి నమ్మించాలా బావా?'

అన్న సుశీల మాటలు శూలాల్లా గుండెలో గుచ్చుకున్నాయి. సుశీల లోపలికి వెళ్ళి తెచ్చిందాజాబు... ఆదుర్దాగా అందుకొని చూశాను. అరటావు సైజులో ఒక వైపు పూర్తిగా రాయబడిన అజాబు స్పష్టంగా తనదస్తూరీయే...క్రింద తన సంతకము...లేదు అయినా అది తన దస్తూరీయే...సందేహం లేదు...గోపు మొహం నల్లబడింది. అందరూ నావంక అదోలా చూశారు. ఇది యింద్రజాలమా...మహేంద్రజాలమా...ఇదేదో సైన్సు నవలలో ఘట్టంలా ఉంది.. జాబుని చూస్తూ అలా ఉండిపోయాను. ఇంతలో మెరుపులా జ్ఞాపకం వచ్చింది అసలు సంగతి. అవును... నేను రాసిందే.. కాని యిక్కడికెలా వచ్చింది?...యింకే ముంది.. బహుశా నేననుకున్నంతా అయి ఉంటుంది. ఇక నాకు నవ్వు ఆగలేదు. నానవ్వు మాసి అంతా జాలిగా నాకు పిచ్చెంక్కిదనుకొని కాబోలు చూస్తున్నారు. నేను కాసేప్పటికి తేరుకొని, సుశీల తమ్ముడు మధూని కేకేశాను. మధు వచ్చాడు.. 'ఒరే మధూ... క్రిందటిసారి నేను వచ్చినపుడు నీకు ఏమని చెప్పానురా' అని అడిగాను.

'మీ పేరున ఏమయినా జాబులువస్తే మీరిచ్చిన ఎడ్రసుకి తిరిగి పంపమన్నారు' అన్నాడు నసుగుతూ.


'మరి ఏమయినా వచ్చాయా?' అన్నాను నవ్వుతూ.

'ఆ...ఒక పొడుగు పాటి కవరువచ్చింది. ఎక్కడో పెట్టి మరిచి పోయాను పోయిన కాగితాలు పోగా, మిగిలిన కాగితాలతో ఆ కవరు నిన్ననే దొరికింది. అంటూ లోపలికి వెళ్ళి ఒక కవరు తెచ్చియిచ్చాడు. నేను ఆ కవరందుకొని యీజాబు అందులో క్రమంగా అమర్చి యిక చదువుకోండని యిచ్చేశాను సుశీలకి. ఇంకేముంది.. మిగిలినది నవ్వుల సందడీ .

'ఎన్నడో నేను పత్రికకు పంపిన కథ విజయనగరం పాత ఎడ్రసుకి క్షేమంగా తిరిగి వచ్చింది. అందులో యీ జాబు ఉన్న కాగితం ఎలాగో విడి సుశీలకి యింట్లో దొరికింది అదీ రాద్ధాంతం కథలో సుశీ ఊరుకున్నా మా సుశీ ఊరుకోలేదు! అని వివరించి చెప్పాను.

ఈనాటికీ సుశీల దెప్పతూనే ఉంటుంది "కథలూ రాయడం మానెయ్యి బాబూ" అని ఇంతకీ అసలు 'తప్పెవరిది?' అన్న సమస్య మాత్రం అలాగే ఉండిపోయింది. ★

మారిన లోకం



సింహాసురుడు

అమెరికాలో హడ్సన్ నదిమీద ప్రయాణం చేసినవారెవరూ కాట్స్‌కిల్ పర్వతాలను మరిచిపోరు. అప్లేషియన్ పర్వతపంక్తుల లోంచి విడివడిన ఒక శాఖకే కాట్స్‌కిల్ పర్వతాలని పేరు. హడ్సన్ నదికి పశ్చిమంగా ఎత్తుగా హుందాగా నిలబడి ఉన్న ఈపర్వతాలు ఆపరిసర ప్రాంతాన్నంతా పరిపాలిస్తూన్నట్టూ, అధికారంతో ఆజ్ఞాపిస్తున్నట్టూ కనిపిస్తుంది. ఋతువు మారినప్పుడల్లా—నిజానికి రోజు రోజూ, గంట గంటకీ—ఈపర్వతపంక్తి నవంనవంగా రూపాలూ, రంగులూ మారుస్తూంటుంది. చుట్టుప్రక్కల ఇల్లాళ్లకు ఈపర్వతశ్రేణి అద్భుతమైన అనుదిన వాతావరణ సూచిగా ఉపకరిస్తూంది. వాతావరణం సౌమ్యంగా ప్రశాంతంగా ఉన్నప్పుడు ఈపర్వతాలు నీలిరంగు తొడుగో, ముదురు వంగరంగు బురఖో వేసుకున్నట్టు కనిపిస్తూ, స్వచ్ఛమైన సాయం సంధ్యాకాశంమీద ముదురు రంగుల్లో రాసిన ముద్దుగుమ్మల బొమ్మలలా ముచ్చటగొలుపుతాయి. మిగతా ఆకాశమంతా నిర్మేఘంగా ఉన్నప్పుడు ఈపర్వతాల శిఖరాలు తెల్లని పడగలెత్తిన సర్పాల్లాగ ఉంటయి. ఆ పడగలు అస్తమయ సూర్యుని అరుణ కాంతులలో మిలమిల మెరుస్తూ, అద్భుత మణిమయ కిరీటాల లాగ ధగధగలాడి పోతయి.

ఈదేవతా పర్వతాల పాదతలం వద్ద నీలిరంగు మెరక నేలలూ, సమీపంలో కనిపించే పచ్చని మైదానమూ కలిసిపోయేచోట, చెట్ల గుబురుల మధ్య సుళ్లుసుళ్లుగా తెల్లని ఆవిరి పొగలు గక్కే ఒక పల్లె ఉన్న సంగతి కూడా ఆప్రాంతాన్ని చూచి వచ్చిన యాత్రికులకు బహుశః గుర్తు ఉంటుంది. ఆ పల్లెటూరు అతిప్రాచీనమైన ఒక చిన్న వలస. అమెరికాకు యూరపు ఖండవాసులు మొట్టమొదట వలసవచ్చిన రోజులలో, డచ్ వలసదారులు ఆపల్లెను గట్టుకున్నారు. వారు తమ హాలండ్ దేశం నించి తెచ్చుకున్న పసుపుపచ్చని చిన్న చిన్న ఇటికలతో, కర్రకిటికీలతో, పాకలుగల వాకిళ్లతో, గాలికోళ్ల స్తంభాలతో విలక్షణంగా నిర్మించుకొన్న కొన్ని ఇళ్ల గుర్తులు ఇప్పటికీ విస్పష్టంగా కనిపిస్తున్నయి.

ఆ పల్లెలో, ఇలాంటి ఒక ఇంటిలోనే, (నిజానికి ఆ ఇల్లు ఆనాటికే సగంకూలి పాడుగొడుతూందనుకోండి!) చాలా కాలం క్రిందట పరమసాధువైన ఒక నిరాడంబర వ్యక్తి ఉంటూ ఉండేవాడు. అతనిపేరు రిప్ వాన్ వింకిల్. డచ్ గవర్నర్ పీటర్ స్టైవెసెంట్ హయాంలో, ఆ వీర రసోజ్జ్వలమైన సమయంలో అతనికి చేదోడువాదోడై క్రిష్టియానా దుర్గాన్ని ముట్టడించడంలో ఆయనకు సహాయపడిన వాన్ వింకిల్ వంశం కీర్తిప్రతిష్ఠలు గలది. ఆ వీరవంశంలోనే జన్మించాడు మన రిప్ వాన్ వింకిల్. అయితే, మన రిప్‌కి తాతముత్తాతల ధైర్య సాహసాలు మాత్రం అబ్బలేదు. ఆ చుట్టుప్రక్కల అందరికీ అతను చాలా మంచివాడు. నిస్సహాయులపట్ల దయగలవాడు. భార్యపట్ల భయభక్తులతో ప్రవర్తించే పరమసాధు భర్త. నిజానికి ఈ చిట్టచివరి గుణమే అతని విశ్వవిఖ్యాతికి ముఖ్యహేతువయిందేమో! ఇంట్లో గయ్యాళి గృహిణుల చెప్పుచేతల్లో అనుదిన క్రమశిక్షణ కలవాటుపడిన భర్తలే సామాన్యంగా పరమసౌమ్యులనీ, అమాయికులనీ పేరు తెచ్చుకుంటూ ఉంటారు. వారి స్వభావ స్వరూపాలు, కోపతాపాలూ సంసారాగ్నికుండంలో అనుదిన సంస్కారాలు పొందినకొద్దీ మేలిమి బంగారంలాగ వన్నెలు తేలతయి. ఒక వ్యక్తికి ఎనలేని ఓర్పూ, ఎడతెగని సాధింపుసు సహించగల నిబ్బరంలాంటి సుగుణాలు అలవడానికి, వేలాది శ్రుతిస్మృతి ధర్మబోధనల కన్న ఇంట్లో గయ్యాళి గృహిణి గట్టిగా కోపం వచ్చినప్పుడు చేసే ఒక్క ఉపన్యాసం అమోఘంగా పనిచేస్తుంది. అంచేత గయ్యాళిభార్యగూడా ఒకవిధంగా అదృష్టవంతులకు భగవదత్తంగా లభించే వరప్రసాదమనే చెప్పొచ్చు. ఈవిషయం ఒప్పుకుంటే రిప్‌వాన్‌వింకిల్ ఇబ్బడిముబ్బడిగా అదృష్టవంతుడని ఒప్పుకున్నట్టే.

★ మారిన లోకం ★

ఆ గ్రామంలోని గృహిణులందరికీ అతడంటే అమితమైన ఆదరభావం. ఆడవాళ్లందరిలాగే వాళ్లూ పొద్దువాటారిన తరువాత భర్తలతో వాదోపవాదాలు వేసుకునేటప్పుడు వాళ్లంతా ఎప్పుడూ రిప్ పక్షానే వాదించి, శ్రీమతి వింకిల్ మీదే దుమ్మెత్తిపోస్తూ ఉండేవాళ్ళు. ఇక పిల్లలు: అతడు కనిపించగానే ఎక్కడలేని సంతోషంతో గంతులు పెట్టుకుంటూ పరుగెత్తుకొస్తారు. వాళ్ల ఆటపాటలలో రిప్ వారికి సహాయపడేవాడు. వాళ్లు ఆడుకునేందుకు కావలసిన సరంజామా అంతా తయారుచేసి ఇచ్చేవాడు. గాలిపటాలు ఎగురవేయటం, గోళీలు ఆడటం లాంటి ఆటలన్నీ స్వయంగా వాళ్లకు నేర్పేవాడు. దయ్యాలకథలు, దేవతలకథలు, రాక్షసులకథలు చెప్పేవాడు. ఇల్లుకదిలి బయలుదేరాడా పిల్లలంతా అతని వెంటబడి, కాళ్లావేళ్లా పడుతూ, వీపుమీదకెగబ్రాకుతూ నానాహంగామా చేసేవాళ్ళు. ఆ చుట్టుప్రక్కల ఎక్కడా ఒక్క పిచ్చికుక్క అయినా ఎన్నడూ అతణ్ణి చూచి మొరగలేదు.

అయితే, రిప్ జీవితంలో ఒకే ఒక్క లోపం ఉంది. తనకు లాభకరమైన పని ఏదన్నా అతనికి ఏంతమాత్రం గిట్టేదికాదు. అంతమాత్రాన అతడిలో శ్రద్ధాలోపంగాని ఓపికలేనితనంగాని ఉన్నదనుకోటానికి వీల్లేదు. పెద్ద గడకర్రంత గాలం పట్టుకుపోయి ఏటిఒడ్డు గుట్టమీద తిష్ఠవేసి, రోజంతా ఒక్క చేపపిల్ల కూడా దొరకకపోయినా ఓపికగా అలాగే కూచునేవాడు. పిట్టల్ని కొట్టే చిట్టి తుపాకీ ఒకటి భుజానపెట్టుకుపోయి, గంటలకొద్దీ అడవుల్లో పుంతల్లో తిరుగుతూ, కొండ లెక్కుతూ, కోనల్లోకి దిగుతూ, తిరిగి తిరిగి ఏవో నాలుగు ఉడతల్నీ, రెండు అడివి పావురాల్నీ మాత్రం కొట్టుకొచ్చేవాడు. ఎంత కష్టమైన పనిలో నయినా సరే ఇరుగుపొరుగు వారికి సాయపడేవాడు. ఆ ఊళ్ళో ఎవరి జొన్నచేలో మార్పిడి వచ్చినా, ఎవరి ఇంటికి ప్రహరీ గోడ పెట్టవలసివచ్చినా రిప్ లేందే సాగేది కాదు. ఆ పల్లెలోని ఇల్లాళ్ళు కూడా అతడిచేతో పనులు చేసి పెట్టేవాడు. ఎవరికన్నా కబురుపెట్టుకోవాలన్నా మాట వినని మొటు భర్తలు చెయ్యని చిల్లర పనులేవైనా చేయించుకోవాలన్నా రిప్పే వారికి శరణ్యం. ఇంతకీ, రిప్ తన ఇంటి పని తప్ప మరెవరి పనైనాసరే అతిశ్రద్ధగా చేసేవాడన్న మాట. తన ఇంటి పనులు, పొలం పనులూ చేసుకోవటం మాత్రం అతనికి అసంభవంగా కనిపించేది.

తన పొలంలో ఎంత చేసినా ఏమీ ప్రయోజనం లేదని, ఆ చుట్టుప్రక్కల అంతటికీ అది కట్టి దరిద్రగొట్టు భూమి అనీ, దానికి తాను ఎంత చాకిరీ చేసినా బూడిదలో పోసిన పన్నీరే అనీ, దానికి ఎంత బలంపెట్టినా అధ్వాన్నమైపోవడమే తప్ప, బాముకుని బాగుపడేదేమీ లేదనీ నిష్కర్షగా చెప్పేవాడు. వాళ్ళపొలం చుట్టూ కంచె ఎన్నిసార్లు వేసినా ముచ్చటగా మూడు రోజులన్నా కాక పూర్వమే అయిపూ ఆనవాలూ లేకుండాపోయేది. ఆయన ఆవు తరచు తెంచుకుపారిపోతుంది. పోయి, కాబేజి చేలోపడి ధ్వంసం చేస్తుంది. కలుపు మొక్కలు ఆ ప్రాంతంలో ఎవరి చేలోనూ పెరగనంతగా అతని చేలో పెరుగుతాయి. చేసుకు పెట్టే బలమంతా అకలుపు మొక్కలకే భుక్తమా తూందో ఏమో, అసలు పంటకంటె అవే వేగంగా, ఏపుగా ఎదుగుతూంటయి. సొంత చేలో పనికి బయలుదేరాడా, శాపం పెట్టినట్టు వచ్చి పడుతుంది పెద్దపెట్టున గాలివాన. ఈవిధంగా పాపం తాత తండ్రులిచ్చిపోయిన ఆస్తి ఇతని హయాంలో ఒక్కొక్క ఎకరమే హరించిపోయిపోయి, ఇప్పుడోక జొన్న చేను, ఒక బంగాళాదుంపల తోటా మాత్రం మిగిలినయి. ఆభూమికూడా చుట్టుప్రక్కల చేలన్నిటిలో నాసిరకం.

అతని బిడ్డలు: చింకి గుడ్డలు కట్టుకుని, చిరాకుగా గాలికి బుట్టి ధూళికి పెరుగుతున్నట్టు తిరుగుతూంటారు. అతని కొడుకు చిన్న రిప్పు ముమ్మూర్తులా తండ్రి నోట్లోంచి ఊడిపడ్డట్టు ఉంటాడు. తండ్రి పోలికలకూ తెలివితేటలకూ, అలవాట్లకూ, అతని వర్చస్సానికీ తానే వారసుడనన్నట్టు తండ్రి పాతకోట్లు తప్ప తొడుక్కోడు. కింది దాకా జీరాడుతూన్న తండ్రి చింకికోటూ, చింకిలాగూ తొడుక్కుని పట్టుచీరల వన్నెలాడులు వానకురిసి బాడిగా ఉన్న రోజున విలాసంగా కుచ్చెళ్లు ఒకచేత్తో కొంచెం పైకి ఎత్తిపట్టుకున్నట్టు లాగూకోటూ పైకి లాగి పట్టుకొని, ఎదిగిన గుర్రప్పిల్లలాగ సాధారణంగా ఎప్పుడూ తల్లి వెంటపడి తిరుగుతూవుంటాడు.

రిప్‌వాన్‌వింకిల్ ఈ ప్రపంచంలో దేనికీ ఉబ్బి తబ్బిబ్బు అయేరకం కాదు. కూరలో ఉప్పు ఎక్కువైనా, తక్కువైనా గమనించకుండా, ఖాతరుచెయ్యకుండా, ఎప్పు డేది పెడితే అప్పుడది తిని లేచిపోతాడు. ఒక రూపాయికోసం నానాగడ్డీ కరిచేకంటే, కానీ బటానీగింజలతో సుఖంగా కాలక్షేపం చేస్తూ, నిర్లక్ష్యంగా, నిశ్చింతగా బ్రతుకవచ్చుననే బాపతుమనిషి. లోకం అతన్ని బ్రతుకు అతన్ని బ్రతకనిస్తే, జీవితమంత నిరంతర సంతృప్తితో, కులాసాగా ఈల పాడుకుంటూ గడిపివేయగలడు. కాని ఇంట్లో భార్య అతనికి ఆ అవకాశం ఇయ్యడంలేదు. భర్త సోమరితనాన్ని గురించి, నిర్లక్ష్యవైఖరినిగురించి, కుటుంబానికి అతడు కలిగిస్తున్న నష్టాన్నిగురించి అస్తమానం అతని చెవిలో జోరీగలాగ అరవడమామెకు అలవాటైపోయింది. రాత్రింబవళ్లు ఆమె నాలుకకు విసుగు విరామంలేదు. అతడు ఏంచేసినా, ఏమి అన్నా, ఇంట్లో ఒక మహోగ్రమైన ఉపన్యాసం తప్పదు. ఇలాంటి ఉపన్యాసాలన్నింటికీ రిప్పు చెప్పగల జవాబు ఒక్కటే ఉంది. తరచు వాడడంవల్ల అది అతని అభ్యాసంగాకూడా పరిణమించింది, కనుబొమ్మలు ముడివెట్టడం, తల పంకించడం, భుజాలు ఎగురవేయడం, పైకి చూడటం, మాట్లాడకుండా ఊరుకోటం—ఇదే అతని జవాబు. ఈ జవాబుకి సద్యఃఫలితం లేకపో

లేదు. భార్యకిది మరింత ఆగ్రహకారణమై మళ్ళీ ఆమె మొదలెత్తుకుంటుంది. ఆపైన అతడు చెప్పేజవాబు కూడా మామూలుగా ఎప్పుడూ ఒకటే: భార్యా భీతులందరికీ తెలిసిన ఏకైక తరుణోపాయం: చల్లగా సర్దుకుని ఇంట్లోంచి బయటికి దూయడం.

ఇంట్లో రిప్పుని కనికరంతో చూసేది అతనికుక్క సర్దార్ ఒక్కటే. దానికీ దాని యజమాని కిలాగే ఆ గృహిణి అంటే హడల్. బహుశః ఇదే వీళ్ల స్నేహానికి మూల కారణం కూడా అయిఉండవచ్చు. సోమరిపోతు తనంలో వీళ్ళిద్దరూ సహోద్యాయులని శ్రీమతిరిప్ నిశ్చితాభిప్రాయం. భర్త తరచు ఇంటినించి పారిపోవడానికి కొంతవరకూ ఆ కుక్క సావాసమే కారణమన్న కోపం కూడా ఆమెకు లేకపోలేదు. అడవిలో వేటకి పోయినప్పుడు సర్దార్ ఏ జంతువు మీదికైనా రేచుఃగా దూకి, దాని అంతం చూడగల ధైర్యసాహసాలు ప్రదర్శించగల మాట నిజమే. కాని, ఇంట్లో తన యజమానురాలి నోటిముందుమాత్రం అది కుక్కిన పేను. గుమ్మందాటి ఇంట్లో ప్రవేశించేటప్పుడల్లా, మెల్లగా తలవంచుకుని, తోక కాళ్ళసందుకి ముడుచుకుని, లేదా నేలకు వేలవేసుకుని, ఒదిగి ఒదిగి, వింకెల్ సతి ఎక్కడున్నదో, ఏవేపునించి వచ్చి పడుతోందో అని పక్కచూపులు చూసుకుంటూ లోపల ప్రవేశించేది. ఈలోగా ఎక్కడైనా చీపురుకట్టగాని, గరిటెకాడగాని చప్పుడయిందో, ఉలిక్కిపడి కావుపరుగున పోయి మళ్ళీ వీధిలో పడిందన్నమాటే.

రిప్‌వాన్ వింకిల్ వివాహానంతరం కాలం గడిచినకొద్దీ, ఇంట్లోపరిస్థితి నానాటికీ తీసికట్టు అవుతూంది. గయ్యాళితనమనేది వయసు ముదిరినకొద్దీ తగ్గేబాపతు గుణం కాదు. తిట్టే నాలుక వాడినకొద్దీ పదును హెచ్చే బత్తాయి చాకులాంటిది. ఇంట్లోంచి బయటికి వెళ్ళిపోవలసివచ్చినప్పుడు చాలా కాలంవరకు, ఆ గ్రామంలోని వేదాంతులు, విరాగులు, సన్యాసులు మొదలైన మోతుబరి సోమరిపోతుల మఠానికిపోయి పునఃకొంత మనశ్శాంతి సమకూర్చుకు నేవాడు. ఆఊరిసత్రం అరుగు ఈగోష్ఠులకు ప్రధానసభాస్థలి. ఎంతకీ పొద్దుతరగని వేసవిరోజుల్లో వీళ్ళంతా అక్కడచేరి నిర్విరామంగా లోకాభిరామాయణ కాలక్షేపం సాగించేవారు. లేదా, అంతూపొంతూలేని అగమ్య కాకికథలు చెప్పుకునేవారు. ఎప్పుడైనా ఆ సత్రవులో దిగిన ఏ యాత్రికుడిదగ్గరయినా వాళ్లకి ఏపాతపత్రికో దొరికిందా, ఇక ఆరోజున వాళ్లగంభీర చర్చలు కొమ్ములు దిరిగిన రాజకీయవేత్తలుకూడా అవశ్యం వినదగిన స్థాయిలో సాగిపోయేవి. ముందుగా, ఆపత్రికలోని సంగతులను పొట్టిగా బొద్దుగా ఉండే ఆ ఊరిబడిపంతులు శ్రీ డ్రెరిక్ వాన్ బమ్మెల్ చదివి వినిపిస్తూంటే, అంతా చెవులు నిక్కబొడుచుకుని వినేవాళ్లు. నిఘంటువులలో కూడా లేని ఎంత పొడుగు డొంకతిరుగుడు మాటనయినాసరే బమ్మెల్ అవలీలగా ఉచ్చరించనూగలడు; వ్యాఖ్యానంతోసహా అరిటిపండుఒలిచి చేతిలోపెట్టినట్టు దానిఅర్థమూ చెప్పగలడు. అవిధంగా, కొన్ని నెలలక్రిందట జరిగిన రాజకీయసంఘటనలమీదకూడా వాళ్ళు ఎంతో దూరదృష్టితో, వివేకవిజ్ఞాన పూరితమైన చర్చలు జరుపగలరు.

ఈ గోష్ఠిలో ఆ గ్రామమంతటికీ మోతుబరీ, ఆ సత్రానికి ధర్మకర్త అయిన నికోలస్ వెడ్డర్ అభిప్రాయాలదే ఎప్పుడూ పైచేయి. ఆయన ఆ అరుగు మొగదల స్తంభానికి ఆనుకొని కూచునేవాడు. ప్రొద్దుటినించి సాయంకాలందాకా అక్కడికి ఏ కాలమూ ఎండ రాదు. కారణం: సత్రవు గుమ్మానికి ఎదురుగా ఉన్న పెద్ద పొగడచెట్టు నీడ. మధ్యాహ్నం భోజనవర్తాలకు గంటో అరగంటో తప్ప మిగిలిన ప్రొద్దస్తమానం వెడ్డర్ అక్కడే కూచుని ఉంటాడు. అందువల్ల ఆ చుట్టుప్రక్కల వాళ్ళు చెట్టునీడ ఆయనకు ఎంతదూరంలో ఉన్నదీ చూసి, అప్పుడు ఎన్నిగంటలయినదీ సులభంగా గ్రహించ గలిగేవారు. ఆ విధంగా ఆ వీధివారి కందరికీ ఆయన నమ్మకమయిన నీడ గడియారం. వెడ్డర్ ఆట్టే మాట్లాడనిమాట నిజమే. చుట్ట మెల్లగా చుట్ట ముట్టిస్తూ అరుగు ప్రక్కన ఉమ్మివేసుకుంటూ కూచుంటాడు. గొప్పవారందరికిలాగే ఆయనకూ వ్యాఖ్యాతలు ఉన్నారు. ఆయన అభిప్రాయాలను ఆయన చెపకుండానే వాళ్ళు గ్రహించ గలరు. ఆ చదివిన వార్తలలోగాని, ప్రసంగాలలోగాని ఏదైనా తనకు నచ్చనిది ఉందా, చుట్ట పొగ జోరుగా కోపంగా వీల్చేవాడు. ఇష్టమైనదేదైనా తగిలిందా నెమ్మదిగా, ప్రశాంతంగా లాగి పలచని ధూమమేఘాలు సృష్టించేవాడు. ఇక ఆయన నోటిలోంచి చుట్ట బయటికి తీసి, ఆ సుగంధ ధూమాలను నోటి చెలమలలోంచి సుళ్ళు తిరుగుతూ బయటికి వస్తూండగా గంభీరంగా తల ఊపాడా, ఇక ఆ విషయాన్ని ఆయన సంపూర్ణంగా ఆమోదించాడన్నమాట.

ఇంత మనోరంజకమైన వాతావరణంలో కూడా రిప్పు స్థిమితంగా కూచుని ఆనందించే ప్రాప్తిలేదు. ఆయన గయ్యాళిభార్య మధ్యలో ఎప్పుడో తుపానులాగ వచ్చిపడి, ఆ ఆనందమయ గోష్ఠిని బీభత్సం చేసివేసేది. ఆ పరిషత్సభ్యులందరిమీదా నిర్దాక్షిణ్యంగా దుమ్మెత్తిపోసేది. ఆ ప్రచండురాలి ధాటికి నికొలస్ వెడ్డర్ లాంటి మోతుబరిలెక్క కూడా ఎంతమాత్రం లేదు. తన భర్త అసలే సోమరిపోతనీ, వెడ్డర్ దాన్ని ఇంకా ఎక్కువ చేస్తున్నాడనీ ఆమె కుండ పగలగొట్టినట్టు ముఖాన పట్టుకుని అనేసేది.

పాపం రిప్ జీవితం నిరాశామయమయిపోయింది. పొలంలో పనీ, తన భార్యా తిట్లూ తప్పించుకొనడానికి ఇక అతనికి ఒక్కటే ఉపాయం మిగిలింది. తుపాకి చేత బట్టుకుని వేటకి అంటూ మెల్లగా అడవికి దూయడం. వెళ్ళి, అక్కడ ఏదో చెట్టు నానుకుని కూచుని, సంచీలో తినుబండారాలు బయటికితీసి, సంసారంలో తన దౌర్భాగ్య దశలో సమంగా పాలుపంచుకుంటూన్న సర్దార్ కి ఇంతపెట్టి, తానింత తినేవాడు. "సర్దార్! మీ యజమానురాలు పాపం నిన్ను కూడా చాలా హీనంగా చూస్తూంది. కాని, నువ్వేం విచారించకు! నేను బతికి ఉన్నంతవరకు నీకు సానుభూతి గల స్నేహితుడు లేనిలోపం ఉండదు," అంటూ వెన్ను నిమురుతూ సర్దార్ ని ఓదార్చేవాడు. సర్దార్ అతని సానునయాన్ని అర్థం

★ మారిన లోకం ★

చేసుకుని తోక ఆడిస్తూ, కృతజ్ఞభావంతో జాలిగా యజమాని ముఖంలోకి చూసేది. సరిగా అతడన్న మాటలనే తిరిగి సర్దార్ కూడా అతనిని గూర్చి మళ్లా అంటున్నదా అనేటట్టు ఉండేవి ఆ చూపులు.

అలాంటి ఒక స్వేచ్ఛా వనవిహార సందర్భంలో, శుభ్రశరత్కాలంలోని ఒక సుప్రశాంత సాయం సమయంలో రిప్ యథాలాపంగా, కాట్స్‌కిల్ పర్వతాలలోని ఒక అత్యున్నత ప్రదేశానికి ఎక్కివెళ్లాడు. వెళ్లి, తన వినోదక్రీడ అయిన ఉడతల వేటతో కాలక్షేపం చేస్తున్నాడు. ఆ తుపాకి ప్రేలుళ్ళతో ఆ ప్రాంతపు ప్రశాంత వాతావరణమంతా దద్దరిల్లిపోయింది. తిరిగి తిరిగి అలసి సొలసి ఆయాసపడుతూ పోయి ఒకగుట్టమీద పచ్చగడ్డిపెరిగిఉన్న దిమ్మమీద కూలబడ్డాడు. నిటారుగా కోసినట్టువున్న పర్వతపుటంచుమీదగల ఆ దిమ్మచుట్టూ అడవి లతలు పెరిగి ఉన్నాయి. ఆ లతల సందుల్లోంచి పర్వతంక్రింద దట్టమైన అరణ్యప్రదేశం కొన్ని మైళ్ళ దాకా వ్యాపించి ఉంది. దిగువను కొంతదూరంలో హడ్సన్‌నది, హుందాగా, వయ్యారంగా సాగిపోతూంది. తెల్లని మబ్బులకు ప్రతిబింబాలో, పడవల తెరచాపలో మిలమిల మెరుస్తూన్న ఆ నదీ వక్షస్థలంమీద అక్కడొకటి, అక్కడొకటి నిద్రపోతున్నట్లుగా, మెల్లగా తేలిపోయి పోయి నీలంగా కంపించే ఆ మెరకభూముల్లో లీనమైపోతూంది.

మరొక వేపున క్రిందికి చూస్తే దిగువనెక్కడో అగాథమైన, లోతున దట్టంగా, గజిబిజిగా అల్లుకొనిపోయిఉన్న నిర్మానుష్యమైన, అరణ్యమయమైన లోయ కనిపిస్తూంది. నిటారుగా ఉన్న ఆ పర్వతపు టంచులనుంచి విరిగి కూలిన పెద్దపెద్ద బండలు ఆ లోయలో అక్కడక్కడ పడి ఉన్నాయి. ఎప్పుడో అస్తమిస్తూన్న సూర్యుని కిరణాలు కొండచరియలపైబడి ప్రతిఫలిస్తూన్న అలాంటి సమయాల్లోతప్ప రోజు మొత్తంమీద ఆ లోయలోకి వెలుగుతగిలే అవకాశమే లేదు. రిప్ ఈ దృశ్యాన్ని చూస్తూ కొంతసేపు అలాగే ఆలోచిస్తూ పడుకున్నాడు. సాయం సంధ్య చల్లగా జారిపోతూంది. పర్వతాల నీలినీడలు చుట్టుప్రక్కల లోయలన్నిటినీ కౌగలించుకుంటున్నాయి. చీకటిపడేలోగా తాను ఇంటికి చేరుకోలేననే విషయం రిప్‌కి స్ఫురణకు వచ్చింది. దాంతో మళ్ళీ ఇంటివద్ద తన గృహిణి చేయబోయే హంగామాను గురించి ఆలోచించుకుంటూ ఒక్కసారి గాఢంగా నిట్టూర్చాడు.

కిందికి దిగిపోదామని లేచేసరికి, ఎక్కడో దూరంనించి "రిప్‌వాన్ వింకిల్! రిప్‌వాన్ వింకిల్!" అంటూ పెద్దకేకలు వినిపించినయి. చుట్టూ చూశాడు. పర్వతం మీదుగా ఏకాకిగా ఎగిరిపోతూన్న ఒక కాకి తప్ప ఎక్కడా ఎవరూ కనిపించలేదు. 'భ్రమపడ్డానేమో' అనుకుని, మళ్ళీ కొండ దిగడం మొదలుపెట్టాడు. మళ్లీ అదే పిలుపు, "రిప్‌వాన్ వింకిల్! రిప్‌వాన్ వింకిల్!" అంటూ ఎక్కడినించో ఆ ప్రశాంత సంధ్యా వాతావరణాన్ని చీల్చుకొని వచ్చి అతని చెవుల బడింది. సర్దార్ కొండదిగుడుకు నిదానించి చూస్తూ వెన్ను కుంచించుకొని పెద్దగా మూలుగుతూ తనయజమానికి దగ్గరగా వచ్చి, ఆనుకుని నిలబడింది. రిప్ మనస్సులో లీలగా ఏదో అవ్యక్తమైన భయం బయలుదేరింది. సర్దార్ చూస్తున్న దిక్కుగా చూశాడు. ఒక విచిత్రవ్యక్తి వీపుమీద పెద్ద బరువుతో క్రుంగిపోతూ తనవంకకే వస్తున్నాడు. ఆ నిర్జనారణ్య ప్రదేశంలో ఆసమయంలో మరొక మానవుడు కనపడడం రిప్‌కి చాలా ఆశ్చర్యం కలిగించింది. పాపం అతడెవరో తన ఊరివాడే అయి ఉంటాడనీ, సహాయం కోసం తనను అర్థిస్తున్నాడనీ అనుకొని, గబగబా కొండదిగి పోతున్నాడు.

దగ్గరకు వెళ్ళిన కొద్దీ ఆ నూతన వ్యక్తి విచిత్రస్థితి రిప్‌కి మరింత ఆశ్చర్యం కలిగించింది. పొట్టిగా, లావుగా దిబ్బస కొయ్యలాగ ఉన్నాడు. దుబ్బులాగ ఒత్తుగా పెరిగిన తెల్లగడ్డం అతని ముసలితనాన్ని బయట పెడ్తుంది. ప్రాచీనకాలపు డచ్ వలసదారులలాగ నడుముకి గట్టిగా బిగించిన ఒక పొట్టి కోటు, పైన బాగా విశాలంగా ఉండి రెండు ప్రక్కలా వరసగా గుండీలూ కింద అంచుల కుచ్చులూ కుట్టిన మోకాలు క్రిందికి మాత్రం దిగిన పొట్టిపైజామా తొడుక్కున్నాడు. భుజంమీద పెద్ద సారాజాడీ ఉంది. వచ్చి, "ఈ బరువు మోసుకుని పోవడానికి కొంచెం సహాయపడతావా?" అన్నట్టుగా రిప్‌కి సంజ్ఞచేశాడు. రిప్‌కి ఈ నూతన మిత్రుని గురించి కొంత అనుమానం ఉన్నప్పటికీ, సహజౌదార్యంతో వెంటనే సమ్మతించాడు. ఆజాడీని చెరికాసేపు మోస్తూ, మెల్లగా ఆలోయ వెంబడి ఇంచుమించు ప్రాకుతూ పైకి ఎక్కారు. ఆలోయ బహుశః ఎండిపోయిన చిన్న కొండవాగు కోసినచాలు అయి ఉంటుంది.

వాళ్లిద్దరు కొండపైకి ఎక్కినకొద్దీ ఆగి ఆగి ధణ ధణ మంటూ పెద్దచప్పుడు ఏదో వినపడుతూంది. అవి రెండు పర్వత శిఖరాల నడుమ ఉన్నలోతైన లోయలోంచి ఎక్కణ్ణించో పెద్ద ఉరుములాగ వినపడుతూంది. ఎన్నోచుట్లు తిరిగే ఆదారి వెంటపోయి పోయి వాళ్ళిద్దరు చివరికి మళ్లీ ఆలోయ వంకకే పోతున్నారు. మళ్లీ అలాంటిశబ్దమే వినబడింది. రిప్ ఒక్కక్షణం ఆగి, ఎత్తైన ఆ కొండల్లో పడే ఉరుములు మెరుపులతో హఠాత్తుగా కురిసేవర్షం అయి ఉండవచ్చునని సమాధానం చెప్పుకుని మళ్ళీ ముందుకి సాగాడు. ఆవాగు చాలుగూడా పోయి పోయి వారొక పల్లపు ప్రదేశానికి చేరుకున్నారు, అది గుండ్రంగా సర్కసుగాలరీలాగ ఉంది. చుట్టూనిటారుగా లేచిన కొండ గోడలలోంచి వాలుగా పెరిగిన వృక్షాల కొమ్మల మధ్యనించి కొంచెంగా నీలాకాశం, అప్పుడప్పుడొక సాయంసంధ్యా మేఘం మాత్రం కనబడుతున్నయి, రిప్పూ, అతని సహచరుడూ ఆ జాడీ మోసుకుపోతున్నారు. అంతపెద్ద సారాజాడీని మోసుకొని ఆకొండలలోకి ఎక్కడికో పోతుండడం రిప్‌కి విచిత్రంగా ఉన్నా తనకు బోధపడని ఆవింత పరిస్థితి అతణ్ణి విస్మయుణ్ని చేసి, మాట్లాడే ధైర్యం లేకుండా చేసింది.

ఆ సర్కసు వలయంలాంటి పల్లపు ప్రదేశానికి చేరగానే ఇంకా వింత వింత దృశ్యాలుకనిపించినయి. మధ్యగా చదునుగా ఉన్న ఒకచోట కొంతమంది విచిత్ర వ్యక్తులు "తొమ్మిది మేకుల" బంతి ఆట ఆడుతున్నారు. వారి దుస్తులు, చేష్టలూ ఎక్కడా కనివిని ఎరగని తీరులో ఉన్నయి. కొందరు పొట్టిగా బనియన్లలాంటి అంగీలు తొడుక్కున్నారు. వారి నడుముపట్టాలనించి పొడుగుపాటి పటాకత్తులు వేలాడుతున్నయి. వారిలో ఎక్కువమంది రిప్‌ని అక్కడికి తీసుకువచ్చిన వ్యక్తిలాగే పైజామాలు తొడుక్కున్నారు. వారి ముఖాలుకూడా అదోమాదిరిగా ఉన్నయి. ఒకడికి పెద్దతల, పళ్లెమంత ముఖం, చింతాకులంతేసి కళ్ళు. ఇంకొకడికి ముఖం నిండా ముక్కు; తలమీద మూసి ముడతలుపడ్డ ముక్కోణాకారపు తెల్లటోపీ, దానికొక ఎర్రని కోడిఈక. అందరికీ రకరకాల పరిమాణాల్లో రంగు రంగుల గడ్డాలు ఉన్నయి. అందులో ఒకడు వారందరికీ పెద్దలాగ, నాయకుడులాగ కనిపిస్తున్నాడు. లావుగా, ఎత్తుగా ఆరిందాలాగ, ముసలివాడులాగ కనిపిస్తున్నాడు. జరీ అంగరఖా, నడుముకి వెడల్పైన పట్టా, దానికి కత్తి తగిలించుకొనే కొక్కెం, తలమీద పెద్దఈకల కుచ్చుతో అలంకరించిన ఎత్తైన కోణాకారపు టోపీ, ఎర్రని మేజోళ్ళు, ఎత్తు మడమల జోళ్ళూ-వేషమంతా ఆడంబరంగా హాలెండ్ దేశం నించి తొలి వలసదారులు తీసుకువచ్చిన ఫ్లెమిష్ చిత్రాలలోని బొమ్మల ఫాషన్‌లో ఉంది.

ఈ వ్యక్తులంతా జలసా చేసుకున్నప్పటికీ, వారి ముఖాలన్నీ అతి గంభీరంగా ఉండడం, ఎవరూ ఏమీ మాట్లాడకపోవడం రిప్‌కి మరీ ఆశ్చర్యం కలిగించింది. ఖుషీ చేసుకునే గోష్ఠిలోని వ్యక్తులు ముఖం ముడుచుకుని ముళ్లముప్పులల్లే కూచోడం అతడెన్నడూ చూడలేదు. మధ్య మధ్య వాళ్ళు బంతులు దొర్లించినప్పుడయే శబ్దంమాత్రం ఉండుండి పెద్ద ఉరుములలాగ ఆ లోయ అంతటా మారుమోగుతుంది.

రిప్పూ, అతని సహచరుడూ వారిని సమీపించేసరికి, వాళ్లు ఆటమానేసి ప్రతిమలలాగ నిలబడి తదేక దృష్టులతో కళాకాంతులులేని చిడిముడిపాటు ముఖాలతో వికృతంగా చూస్తున్నారు. దాంతో రిప్ గుండెల్లో రండోళ్ళమోత ప్రారంభమయింది; మోకాళ్లు కొట్టుకుంటున్నయి. ఈలోగా అతని అనుచరుడు ఆ జాడీలోని సారాను పెద్ద పెద్ద కూజాల్లో నింపాడు. "నువ్వు ఇక్కడే వీళ్లు చెప్పిన పనిచేస్తూ ఉండు" అని అతడు రిప్పుకి సంజ్ఞ చేశాడు. గోష్ఠిలోని వ్యక్తులంతా మాటా పలుకూ లేకుండా మస్తుగా సారా తాగేసి, మళ్ళీ ఆట మొదలు పెట్టారు.

క్రమంగా రిప్ ఆశ్చర్యాలు, అనుమానాలూ తగ్గినయి. ఎవరూ తనవైపు చూడకుండా ఉన్నప్పుడు నెమ్మదిగా కొంచెం పానీయం తానుకూడా రుచి చూశాడు. హాలెండ్ దేశపు అద్భుత పానీయంలాగ ఉంది. సహజంగా రిప్‌కి దాహం ఎక్కువ. అందువల్ల ఆ పానీయంకోసం మళ్లీ ప్రాణం కొట్టుకోటం మొదలు పెట్టింది. దాంతో, కొసరి కొసరి దఫాల వారీగా ఆ కూజాను వంచి కడుపు నింపేశాడు. క్రమంగా మైకం కమ్మడం ఆరంభించింది. అతని కళ్లు తలలో ఈదులాడుతున్నయి. తల వాలిపోతూంది. నేల కొరిగిపోయి ఎన్నడెరుగని గాఢ నిద్రలో మునిగిపోయాడు.

[మిగతా కథ పైవారం]

నాకు ఒంటరిగా రైలుప్రయాణం అంటే సరదా నిజానికి ఎవరికిష్టంగాదు గనుక! ఏ బాదరబందీ లేకుండా ఒంటరిగా పోతూన్నప్పుడు ఎంతదూరమైనా, ఎలాగైనా పోవచ్చు. ఆవేళే నా పరీక్షలైపోయాయి. రెండురోజులపాటు టౌనులో ఉన్న సినిమా హాళ్లు, హోటళ్ళు పరామర్శించి, ఆ తర్వాత రాత్రి పదిగంటల పార్శిల్లో నెమ్మదిగా బయలుదేరా. ఆ పార్శిలు పాసింజరు నిడదవోలు పోయేసరికి తెల్లారుతుంది. ఈలోగా నిద్రపోవచ్చు తాపీగా. నేను రైల్లోకెక్కేసరికి అందులో ఒక్క పిట్టకూడా లేదు. బరానీ చెత్త, వేరుశెనగ తొక్కలూ ఇచ్చిన ఆహ్వానాన్నందుకుని అందులోపడ్డా. బెంచీలనిండా అరంగుళం దళసరిని ఒక మట్టి విడత ఉంది.

రైల్లో ప్రయాణంచేసేటప్పుడు ఎన్నో కథలు జరుగుతూంటాయిట. నేనలాంటివి చాలా చదివా. 'డిటెక్టివ్' కథలు వదిలేయండి. ఈ రైల్లో పోతూండగా, నే ఒక అబ్బాయి—అతనే ఇంజనీరింగో చదువుతూంటాడు—ఒక కాలేజీ అమ్మాయి కలుసుకుంటారు. తిప్పకుండా ఈ అమ్మాయి ఆ అబ్బాయికి ఏవంక చుట్టమో అయి ఉంటుంది. మొదట్లో కాస్సేపిద్దరూ దెబ్బలాడుకుని, ఆ తర్వాత ప్రేమించేసుకొని ఆఖర్న ఇంటికిపోయి పెళ్ళి వగైరా కానిస్తారు. ఇదే మోడల్లో ఒకలక్ష కథలు చదివా. ఇప్పటికి వాల్తేరు, నరసాపురాల మధ్య ఒకడజనుసార్లయినా తిరిగా, మిగతా చోట్లకి తిరగడం అలాఉంచి. ఒక్కసారైనా ముచ్చుకి ఏ అమ్మాయీ నాకు తగలేదుగద! పోనీ పెళ్లిమాట అలాఉంచి, అసలే కాలేజీ అమ్మాయీ నేనున్న కంపార్టుమెంటులో ఎక్కలేదు. ఒకసారి నే నెక్కిన పెట్టెలోకి పోలీసులు దొంగల్ని ఎస్కార్టు చేస్తూ తగిలారు. ఇంకో పెట్టె మొహం మరెవ్వరూ చూడలేదు. ఇలాగే అన్నిసార్లూ ఏవో అవాంతరాలు వచ్చిపడేవి. నేనొక్కణ్ణే పెట్టెలో కెక్కిన తర్వాత నాకీ ఆలోచనలన్నీ బుర్రలో మెదిలాయి. ఈసారైనా ఒక అమ్మాయి కనబడి, నా కెదురుగానో పక్కగానో కూర్చుని...అనిపించింది. జనతాలో చాలామంది పోతారుగాని, ఈ పార్శిలు మొహం ఎవరూ చూడరు. తొమ్మిదిగంటలతర్వాత మెలకువగా ఉండడం ఏకోశానా అలవాటులేని నాకు ఆవలింతలు పరంపరగా రావడం మొదలుపెట్టాయి. ఇక తప్పదని బెర్తు మీద హోల్డాలు పరిచి పైకెక్కాను.

స్టేషన్ను విడుస్తూ రైలు కూసింది—ప్రియుని ఎడబాటు సహించలేక, విడిపోతూన్న జవరాలి నిట్టూర్పులా. కాసేపు పెట్టె అంతా కలియజూచాను. ఒక అమ్మాయి మాత్రమే ఉంది పెట్టెలో. ఆ అమ్మాయి చాలా మోడర్న్గా ఉంది. బహుశా ఏ కాలేజీ అమ్మాయో అయి ఉండొచ్చు. ఆ సమయంలో వర్ణనచేయగల కవితాశక్తి లేనందుకు విచారించా. ఆ అమ్మాయి ఓ మూలగా కూర్చుని కిటికీలోంచి బయటికి చూస్తోంది. మధ్య మధ్య తనవాడి చూపులు నా పైకి కూడా విసురుతూండేది. బహుశా ఆ అమ్మాయికి కూడా తెలిసే ఉంటుంది. ఇక్కడ నాలాటి ఒక కాలేజీ అబ్బాయి ఒంటరిగా తనలాంటి అమ్మాయి కోసం కాచు కూర్చుంటాడని.

నేను నెమ్మదిగా క్రిందికి దిగి ఆ అమ్మాయి కెదురుగ్గా కూర్చున్నా. ఆ అమ్మాయి కొంచెం చలించినట్టు కనబడింది. నేనేదో మాట్లాడదా మనుకున్నాను. కాని ఎక్కడ ఉపక్రమించాలో తెలియటంలేదు. "ఓ సుందరాంగీ! నీ వాలకము నా గుండెల్లో గాలము వేయుచున్నది" అని అల్ట్రా మోడర్న్గా అందామా, అనుకుంటూనే "ఆ పేపరిలా ఇస్తారూ" అన్నా ప్రక్కనున్న "హిందూ" చూపించి. ఆ అమ్మాయి ఇచ్చింది. ఆ పేపరు తీసుకు చదువుతున్నాన్న మాటేగాని ఒక్క అక్షరం బుర్రలో కెక్కడంలేదు. హామర్ షెల్డ్, మాక్మిలన్; ఐక్, నాజర్, డల్లెస్—వీళ్లందరి పేర్లూ, అసమం పదిచోట్లయినా ప్రతిరోజూ కనబడుతూనే ఉంటాయి. పని లేకపోతే సరి, తిని కూర్చోలేక అనిపించింది. మరికొంతకాలం గడిచింది.

"మీ రెక్కడికి పోతారు?" అడిగిందామె ఆంగ్లంలో.

"నిడదవోలులో దిగుతా, ఇంకా పైకి పోవాలనుకోండి, మీరు?"

"రాజమండ్రీ"

ఆ తర్వాత ఆమే నన్ను సంభాషణలో దింపింది. వాకోవాల భయంగానే ఉంది ఏమిటో ఉపక్రమణ బాగాలేదే అని. అసలు సవ్యంగా పోయేటట్లయితే ముందేదో చిన్న కయ్యం రావాలి. కొంతసేపు దానిమీద వాగ్యుద్ధం చేయాలి. ఆతర్వాత జరగాల్సిందంతా ఒక నిర్దిష్ట ప్రణాళికగా ఉంటుందనే భావం నాలో కరుడుగట్టుకుపోయింది, ఇన్ని సినిమాలు, కథలు గ్రహించిన తర్వాత. కాని ఇదేదైనా నవీన పద్ధతేమో ప్రేమకి అనుకున్నా. ఆమె ఊరికే వాగుతోంది.

"హంగరీగురించి మీ ఐడియా ఏమిటి?"

చచ్చాంరా బాబూ, పొలిటిక్స్! దానికీ మనకీ ఆమడదూరం! అయినా చదువుకొనేటప్పుడు చదువే గాని ఇతర వ్యావృత్తులేమీ ఉండకూడదని మనదేశనాయకులంతా ఏకఘోషగా కంఠశోషపడుతున్నారే! వంటపొయ్యిని జేరే అబల కెందుకీ బయటిగొడవ అనిపించింది. మళ్ళీ "ఏమిటీ మధ్యయుగపు మనోభావాలు?" అని 'తనలో' అనుకొని 'ప్రకాశంగా', "ఆఁ. ఎటువేపైనా మాట్లాడొచ్చులెండి! వాళ్ళదగ్గర వీళ్లదగ్గర కూడా కొంతరీజన్ అనేది ఉండకపోదు" అన్నా. ఇంకాఏమో మాట్లాడతానుకొనిఉంటుంది, ఇంకా అలాగే వింటూన్నట్టు కూర్చుంది ఆమె. మళ్ళీ ఆమే "కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం నిలుస్తుందంటారా?" అని అడిగింది.

ఆక్షణంలో నేను లైబ్రరీ కెన్నిసారు వెళ్ళినా ఏ వనితాలోకమో, ప్రమదావనమో

పేడకలి

డి. హనుమంతరావు

చదవడగాని, వార్తాపత్రికలేమీ చదవకపోయినందుకు నన్ను నేనే నిందించుకొన్నాను. ఆఖరికి "ఏమోలెండి! చెప్పలేం!" అని చప్పరించాను.

ఇంక ఇలాగే ఉంటే ఏ ఐసెన్‌హోవర్ పథకం గురించో, బాజర్ ప్రణాళికగురించో అడుగుతుందేమోనని ప్రసంగం మార్చేశా.

"మగవాళ్లు స్త్రీల సమస్యల గురించి వ్రాయడం ఎలా ఉంటుందంటారు?" బహుశా ఈ ప్రశ్న వేస్తానని ఆమె అనుకుని ఉండదు. కాసేపలా నిర్ఘాంతపోయినట్టు చూసింది నాకేసి. ఆతర్వాత,

"భేషుగ్గా ఉంటుంది, కాకపోయినా స్త్రీలగురించి స్త్రీలే స్వంతడబ్బా వాయించుకుంటే ఏం బాగుంటుంది చెప్పండి" అందామె.

నిజమే ననిపించింది నాకూను. అందుకే గాబోలు మనపత్రికలవాళ్లుఆడపేరుతో వున్న మగ కథానికల్ని మాత్రమే ప్రచురిస్తారనుకున్నా. మావాడొకడు ఒక స్త్రీల ప్రత్యేక శీర్షికకు స్త్రీల సమస్యల్ని గురించి ఆడదాని పేరుతో అచ్చం ఆడదానిలాగా వ్రాసిన ఒక వ్యాసం ప్రచురణ అయిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ. ఇలా కొంతసేపు గడిచింది. ఇంతలోకే ఆమె కిటికీలోంచి ఏదో బయటికి చూడాలనే వంకతో నెమ్మదిగా ఇటుప్రక్కకి వాలి నా ప్రక్క జేరింది. నా గుండె బేజారెత్తింది. నెమ్మదిగ కాస్త నిలద్రొక్కుకున్నా.

"నేను వంటరిగా ఉంటానేమో ననుకున్నాను—మీరు నాకు కాస్త తోడుగా ఉన్నారు" అందామె.

"అబ్బే దానికేంలెండి" అన్నా కొంచెం మామూలుగా.

కాసేపు పోయినతర్వాత నెమ్మదిగా ఆమె ఒక ఆవలింత ఆవలించి నా ప్రక్కన చేరబడి నిద్రపోయింది. అలాగే కూర్చున్నాను.

ఆమె ముఖంకేసి చూశాను. నిద్రపోతున్నట్టనిపించింది. గవర్నమెంటు ప్రొవ్వొత్తి దీపాలే మెరుగనిపించే రైలుబల్బుల కాంతిలో ఆమె "బూడిదరంగు" శరీరం చవితి చంద్రునిలాగా ప్రకాశిస్తోంది.

నా ఆశయం నేటికి సిద్ధించింది. ఈమె ఎవ్వరో బహువిద్యా పారంగతురాలయి ఉండాలి; లేకుంటే ఇంత ముగ్ధగా తనస్నిగ్ధ సుకుమార ప్రణయాన్ని శరదృతువులోని వెన్నెలలాగా నాపై పరచి...అనుకున్నా. ఇలాగే ఏవేవో మధుర స్వప్నాలని ఊహించుకుంటూంటే ఎలా వచ్చేసిందో నిద్రాదేవి నన్ను నెమ్మదిగా తనవళ్ళోకి లాక్కున్నది.


నాకు తిరిగి మెలకువ వచ్చేసరికి ఆ అమ్మాయి లేదు. దిగిపోయిందా అనుకోడానికి రైలింకా రాజమండ్రి చేరనేలేదు. ఇంతలో నాజేబు తేలికయినటు గ్రహించాను. పోస్టలు డిపాజిట్టు రిఫండు వంద రూపాయలూ, టిక్కెట్టూ, పెన్నూ, గోవిందా, గోవింద! ఎంతమోసం, అందుకే అంత కమ్మగా మాట్లాడింది. ఆడవాళ్ళు ఎంత నిగూఢస్వభావులు! బలే టోపీలో పడ్డానే అనుకున్నా! అసలు మొదట్లోనే అనిపించింది ఆమె వాలకం, ప్రవర్తన సరిగ్గా లేవని. బహుశా ఆమె వాల్తేరులో నేను ఒక్కణ్ణే ఈ పెట్టెలో ఎక్కడం, జేబు బరువుగాఉండడం గమనించి ఉంటుంది. ఈ సదవకాశాన్ని జారవిడుచుకో కూడదనుకొని నెమ్మదిగా ఇందులో ఎక్కి, నా మనోదౌర్బల్యంపైన గట్టిదెబ్బ తీసింది. నా జేబు తేలికై గుండె బరువైంది. ఇలాంటివాళ్లు కూడాఉంటారని ఏ కథలోనూ చదవనైనా లేదే! ఎంత తెగువ ఈ మగువకి అని ఒకే విధంగా ఆశ్చర్యపడ్డా.

* * *

గమ్మున మెలకువ వచ్చింది. జేబు తడిమాను. పర్సు, పెన్నూ, టికెట్టూ ఉండనే ఉన్నాయి; జేబు బరువుగానే ఉండి, గుండె తేలికయింది. జరిగిం దర్థం చేసుకోవటానికి ఆట్టేసమయం పట్టలేదు. పెట్టె అంతా కలయజూచాను. ఎవరో అంతా అమాయకపు పల్లెటూరి జనమే ఉన్నది ఈసారి కూడా. అమ్మాయన్న మాటేలేదు. "ఏ వూరబ్బాయి వచ్చేది" అని ప్రక్కనున్న వాణ్నడిగా.

"తాడేపల్లి గూడెం."

"అమ్మో!" అని క్రిందికురికి ఔటింగ్ కట్టేంతలో రైలు ప్లాటుఫారంమీద వుంది. అమాంతం క్రిందకు దూకి, టికెట్ కలెక్టరుకు ఎక్సెస్ చెల్లించి, నిడదవోలు వెళ్లే కార్ల స్టాండువైపు నడిచాను. ★



న్యాయపరిశీలనం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

కాశ్మీర రాజప్రాసాదానికి కనతిదూరంలో అసలే చిక్కి శల్యమైపోయిన బడుగు బ్రాహ్మణుడొకడు ప్రాయోపవేశం ప్రారంభించాడు. శ్రీనగర పౌరులతనిచుట్టూ గుమిగూడి ఆ విడ్డూరమే చూస్తూ నిలుచున్నారు.

కాశ్మీరంలో చాలా ప్రాచీనకాలంనించీ బ్రాహ్మణుల ఆమరణాంత నిరాహార దీక్ష ఒక అనూచాన సంప్రదాయంగా ఏర్పడింది. ఆ రాజ్యంలో ఎవరికైనా అన్యాయం జరిగినపక్షంలో సామాన్యంగా కాశ్మీర బ్రాహ్మణులే రాజప్రాసాద పరిసరాలలో నిరాహార దీక్షల కుపక్రమిస్తారు. తత్రాపీదేశంలో దురన్యాయాలు బాగా పెచ్చుపెరిగిపోయినప్పుడు శ్రీనగర బ్రాహ్మణ పరిషత్తే ప్రాయోపవేశాలు ప్రేరేపిస్తుంది. కాశ్మీర రాజ్యచరిత్రలో అటువంటి ప్రాయోపవేశాలెన్నెన్నో జరిగాయి.

ఒక్కొక్కప్పుడు రాజశత్రువులు గూడా రహస్యంగా ప్రాయోపవేశాలు ప్రేరేపించడం కద్దు. వాటిలోనుంచి తప్పించుకుని బయటపడడానికి కాశ్మీరాధికారు లనేకమైన అగచాట్లకు లోనవుతూంటారు.

ఏది ఏమైనా బ్రాహ్మణవర్యులెవరైనా తమ ప్రాసాదప్రాంగణాలలో ప్రాణాలు పరిత్యజిస్తే కాశ్మీరరాజన్యులు తమకు తమ రాజ్యానికీ తీరని బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంటుందని భయపడతారు. అందుచేత ఆ ప్రాయోపవేశాలవిషయం పరిశీలించడానికా కాలంలో ప్రత్యేకంగా అధికారులను కూడా ఏర్పాటుచేశారు.

ప్రాయోపవేశాధికారులొక్కొక్కప్పుడు నయాన, భయాన నచ్చజెప్పి నిరశన వ్రతం అవలంబించినవారి నిళ్ళకు పంపించివేస్తూంటారు.

అభోజన వ్రతాలవల్ల సామాన్యంగా రాజ్యాధికారులు, రాజబంధువులు, ధర్మాధికారులు, నగరశ్రేష్ఠులు మొదలయినవారతిరహస్యంగా చేసిన దురంతాలెన్నెన్నో బయటపడుతూంటాయి. కనకనే ప్రాయోపవేశాధికారులేకాక, కాశ్మీరాధిపతులుకూడా నిరాహారవ్రతాలంటే తమ ప్రాణాలపై హఠాత్తుగా విరుచుకుపడిన పెను ప్రళయాలని భావిస్తారు. వాటి విషయంలో బాగా జాగ్రత్త వహిస్తారు.

రాజప్రాసాదానికి కనతి దూరంలో ఆ బడుగు బ్రాహ్మణుడలాగే భీష్మించుకుని కూర్చున్నాడు. అధికారులెంత బెదిరించినా అతడు లక్ష్యపెట్టలేదు. బలవంతంగా అతణ్ని మరి ఒక చోటికి పంపించి వెయ్యాలని ఆ అధికారులాలోచించక పోలేదు. కాని అది కూడా వారికి సాధ్యపడలేదు. అలా చేస్తే దారిలోనే అతడేమైనా అఘాయిత్యాని కొడిగడతాడేమోనని వారి భయం! ఆ అధికారులెన్నివిధాలప్రయత్నించినా మరి అతణ్ని అక్కణ్ణించి కదల్చలేక పోయారు!

అతడొక నిరుపేద. ఆ బ్రాహ్మణుని చుట్టూ మూగిన శ్రీ నగర పౌరు లందరికీ అతని ఆ మరణాంతదీక్ష ఎంతో విడ్డూరంగా కనిపించింది. దానికి కారణం లేకపోలేదు.

ఆ కాలంలో కాశ్మీర రాజ్యాధికారం బ్రాహ్మణ కులీనుడు, విద్వాంసుడు అయిన యశస్కర దేవునికి హస్తగత మయింది. అతని రాజ్యారంభంతో అంతకు పూర్వం కాశ్మీరం పరిపాలించిన ఉత్పల రాజ వంశీయుల ప్రాభవం పూర్తిగా అడుగంటిపోయింది. అంతేకాదు. ఆ వంశీయుల పరిపాలనమే పూర్తిగా అంతరించిపోయింది.

ఉత్పల రాజవంశీయులలో చిట్టచివరి పరిపాలకుడు కమలవర్ధనుడు. అతని పరిపాలనలో కాశ్మీరం అనేక విధాలుగా ఛిన్నాభిన్నమైపోయింది. అంతర్యుద్ధాలతోబాటు అధర్మకృత్యాలు, పౌర కల్లోలాలు బాగా పెచ్చుపెరిగిపోయాయి.

ఆ పరిస్థితులలో దుర్భర దారిద్ర్యపీడతో దేశాలు పట్టిపోయిన యశస్కరుడు కాశ్మీరానికి తిరిగివచ్చాడు. కావడాని కతడు కాశ్మీరరాజ్య కోశాధ్యక్షుని కుమారుడే. కాని, రాజ్యకల్లోలాలలో అతనితండ్రి అధికారము, ఐశ్వర్యము హారతి కర్పూరంలా హరించుకుపోయాయి. చిట్టచివరి కతనికి పట్టెడన్నంకూడా కరువైపోయింది. దారిద్ర్యపీడ పడలేక అతడొకనాడు జన్మదేశం విడిచి వెళ్ళిపోయాడు. దేశాంతరాలలో తిరిగి తిరిగి కొంతకాలానికి స్వదేశంచేరుకొన్నాడు.

కాశ్మీరంలో అప్పటికి అరాజకం బాగా పెచ్చుపెరిగింది. ఆ సమయంలో కాశ్మీర బ్రాహ్మణులంతా ఒకచోట సమావేశమైనారు. అనేక విధాల తర్జన భర్జనలు జరిపి చిట్టచివరికి సర్వసమర్థుడు, విజ్ఞుడు అన్న గౌరవంతో యశస్కరునికి కాశ్మీరరాజ్యం కైవసం చేశారు. ఆ పూట గడవక దేశాంతరాలు పట్టిపోయి యాదృచ్ఛికంగా జన్మదేశానికి తిరిగి వచ్చిన యశస్కరుని కదృష్టవశాత్తు హఠాత్తుగా రాజ్యాధికారమే హస్తగతమయింది! విధి విలాసం ఏక్షణంలో ఎటువైపు మొగ్గగలదో ఎవరు చెప్పగలరు?

కాశ్మీరరాజ్యాధికారమేలభించినా యశస్కరభూపతి చిన్ననాటి దుర్భరదారిద్ర్యవేదన ఎన్నడు మరచిపోలేదు. ఒక్క క్షణమైనా ఏమరకుండా కాశ్మీర రాజ్యంలో



... ప్రాచీన ధర్మ సంప్రదాయాలన్నీ ప్రతి...లాడు. ఒకప్పుడు శ్రీనగర బ్రాహ్మణ...కై అతని ధర్మాధర్మ నిర్ణయాలలో ...ం సౌఖ్యం కలిగించుకోవాలని ప్రయ...ంది. కాని అతడక్కడా చిక్కు... అపరిమితులోని బ్రాహ్మణ... చేతులుజోడించి వినయంగా ...కున్నాడు:

...ందరు ఏకగ్రీవంగా వన్నీ ధర్మ సింహాసనంమీద ప్రతిష్ఠించారు. అటువంటి వారికి నా ధర్మనిర్వహణా విధంగా అడ్డు తగలడం న్యాయం కాదు! మరి మన్నించండి."

దానితో ఆ బ్రాహ్మణవర్యులు అతని ధర్మపరిపాలనకు అడ్డుతగలడానికి సాహసించలేదు. అప్పటినించీ యశస్కర దేవుని పరిపాలన కాశ్మీరంలో అంతటా అప్రతిహతంగా కొనసాగింది. అటువంటి ధర్మవేత్త, బ్రహ్మజ్ఞుడు అయిన యశస్కరుని పరిపాలనలో ఆ బడుగు బ్రాహ్మణుని కంతటి ప్రాయోపదీక్ష వహించవలసిన అవసరం ఏమి వచ్చింది! శ్రీనగర పౌరులా విషయాన్ని గురించి అంత వింతగా గుసగుసలాడుకోడానికీ, అంత విచిత్రంగా ఆశ్చర్యపడడానికీ గల అసలు కారణమదే! అతని అభోజన దీక్షకు రాజశత్రువుల కుతంత్రాలేమైనా కారణమేమో అని రాజాధి

★ న్యాయపరిశీలనం ★

కొరులా విషయం అంతా బాగా లోతుగా పరిశీలించారు. కాని ఆ విషయ మైన అనుమానాని కాస్కారమేమీ కనిపించలేదు.

కాశ్మీరాధిపతి యశస్కర దేవుడే దిగి వచ్చి తనకు న్యాయం కలిగించేదాకా ఆ అభోజన దీక్ష విరమించేది లేదని అతడలాగే పచ్చి మంచినీళ్లైనా తాగకుండా భీష్మించుకుని కూర్చున్నాడు. తనకు జరిగిన అన్యాయం అంతా ఆమహారాజ సన్నిధినే నివేదిస్తానని పట్టుపట్టాడు.

ప్రాయోపవేశాధికారులిక గత్యంతరం లేక వెంటనే ఆవిషయం యశస్కర దేవునికి తెలియజేశారు. అప్పటి కాబ్రాహ్మణుడు ప్రాయోపవేశం ప్రారంభించి మూడురోజులయింది. ఆవిషయం వింటూనే యశస్కర భూపతి వెంటనే అతనిని తన సన్నిధికి తీసుకురావలసిందని ఆజ్ఞాపించాడు. అధికారులప్పటికే బాగా నీరసపడిపోయిన అతణ్ణి ఒక సుఖాసనంమీద కూర్చోబెట్టి నెమ్మదిగా రాజసన్నిధికి తీసుకుపోయారు.

౨

"ఎంతమంది ధర్మాధికారుల దగ్గర మొరపెట్టుకొన్నా చిట్టచివరికి నా కన్యాయమే జరిగింది. తాము నాకు న్యాయం జరిగించకపోతే నేనిలాగే ప్రాణపరిత్యాగం చేస్తాను."

రాజదర్శనం చేసినవెంటనే ఆబ్రాహ్మణుడావిధంగా మొరపెట్టుకొన్నాడు. అతని పేరు దేవశర్మ. సాంగవేదాధ్యయనం చేసిన మహావిద్వాంసుడు. దేవశర్మ తాతముత్తాతలందరు సోమపీథులు. నప్రతిగ్రహీతలు. నిరతాన్నప్రదాతలు.

అతడు తన కులగోత్రాలను గురించీ తాతముత్తాతల ఆర్షేయ పౌరుషేయాలను గురించి ఆదేధోరణిగా ఏకరువుపెట్టడం ప్రారంభించాడు. మహారాజతని ఛాందస ధోరణిచూచి కొంచెం బొమముడి విరిచాడు:

"అయితే మీ ప్రస్తుత ప్రాయోపవేశానికి కారణం?"

ఆ ప్రశ్నతో ఆ బ్రాహ్మణుడు తన ప్రాయోపవేశకారణాలన్నీ ఆమూలాగ్రంగా విన్నవించుకొన్నాడు:

"ఏలినవారు నాకుజరిగిన అన్యాయం యావత్తు జాగ్రత్తగా పరిశీలించవలసిందని కోరుకుంటున్నాను. మొట్టమొదటినించీ మాది బాగా కలిగిఉన్న కుటుంబం. అయితే నాదాకా వచ్చేసరికి ఆ ఐశ్వర్యం అంతా హరించుకుపోయింది. ఆపైన నాకు ఋణబాధ మరీ మిక్కుటమై పోయింది.

"ఇక గత్యంతరమేమీ లేక నాపిత్ర్యం అంతా తెగనమ్మివెయ్యాలనీ అన్నవస్త్రాలకోసం ఆర్యావర్తదేశం వెళ్ళిపోవాలనీ నిశ్చయించుకొన్నాను. నాకున్నదల్లా ఒక్కే ఒక నాలుగిళ్ల భవంతి. దాని పెరటిలో ఒక పెద్ద దిగుడుబావి, ఆబావిపక్కనే పెంచిన ఒక తాంబూలపు తీగలపందిరి ఉన్నాయి. నాకిక వేరే సంతానమేమీ లేదు. నాభార్య జీవికకోసం ఆ దిగుడుబావి, ఆ తాంబూలపు తీగల పందిరి ప్రత్యేకించి, మిగిలిన భవంతి అంతా మన శ్రీనగరంలో పేరుమోసిన కర్పూర శ్రేష్ఠికి విక్రయించివేశాను.

"పది పదిహేను సంవత్సరాలు పాటార్యావర్త దేశంలో పర్యటించి తిరిగి శ్రీనగరం చేరుకొన్నాను. నాభార్య శ్రీమంతుల ఇళ్ళలో నీచదాస్యంచేసి పొట్టపోసుకుంటూంది. "నీకోసం కొంతఆస్తి ప్రత్యేకించానే! నీకిటువంటి దుర్గతి ఎందుకుపట్టింది?" అని నాభార్య నడిగాను. కర్పూరశ్రేష్ఠి నాభార్య ననేకవిధాల హింసించి దిగుడుబావి దరిమానానికి కూడా రావద్దని కసిరికొట్టాడట! శ్రేష్ఠినడిగితే దిగుడుబావి, తాంబూలపు తీగలపందిరి కూడా తనకు తెగనమ్మివేసినట్లే సమాధానం చెప్పాడు. నేను ధర్మాధికారుల దగ్గర మొరపెట్టుకొన్నాను. వారా వ్యవహారపత్రాలన్నీ పరిశీలించి కర్పూరశ్రేష్ఠి చేసిన అన్యాయమేమీ లేదని నిర్ణయించారు.

"ఆపైన శ్రీనగర ప్రధాన ప్రాడ్వివాకుల దగ్గర కూడా నావ్యవహారం అంతా విన్నవించుకున్నాను. ఆయనకూడా శ్రేష్ఠిపరంగానే న్యాయం దయచేయించారు! అసలు నేనాదిగుడుబావి, ఆ పందిరి అమ్మనేలేదు. అయినా కర్పూరశ్రేష్ఠి నేనవి తనకు తెగనమ్మివేశానని తెగనాడుతున్నాడు. ఆ వ్యవహారపత్రాలు పరిశీలించిన ప్రధాన ప్రాడ్వివాకులు కూడా అదేవిధంగా తీర్పు దయచేయించారు.

"ఇక నాకు వేరే గత్యంతరమేమీ లేక ఈ ప్రాయోపవేశాదీక్ష కుపక్రమించాను. మా వంటి అభాగ్యులకు జరిగిన అన్యాయం తమరు విచారించకపోతే ఇంకెవరు విచారిస్తారు! గాయత్రీ సాక్షిగా విన్నవించుకుంటున్నాను. నాకే వ్యవహారపత్రాల ధర్మసూక్ష్మాలేవీ తెలియవుగాని ఆ దిగుడుబావి, ఆపందిరి ముమ్మాటికీ నేనమ్మలేదు. నాత్రేతాగ్ని సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను."

ఆపైన ఆబ్రాహ్మణుని కంఠం గద్గద భారంలో స్తంభించిపోయింది.

యశస్కర దేవుడా బ్రాహ్మణుని ధోరణి అంతా అతిజాగ్రత్తగా పరిశీలించాడు. అతడు కొంచెం ఛాందసుడనీ, అమాయికుడనీ గుర్తించాడు. నెమ్మదిగా బుజ్జగించాడు:

"నేనీ వ్యవహారం అంతా అక్షరశః పరిశీలిస్తానని వాగ్దానం చేస్తున్నాను! మీరు

వెంటనే ఈ ప్రాయోపవేశదీక్ష విరమించండి."

"మహాప్రభూ! తమరు న్యాయం దయ చేయిస్తారని నాకు తెలుసును! కనుకనే మీ సన్నిధికి వచ్చాను. అయితే ఈ వ్యవహారం అంతా పూర్తిగా తేలే దాకా నేనిక పచ్చి మంచినీళ్ళనా ముట్టేది లేదు!"

అని నిష్కర్షగా సమాధానం చెప్పాడు. అమాయికుడయినా అతను పట్టినపట్టు విడిపించడం మరి బ్రహ్మతరం కాదని మహారాజు కనిపెట్టాడు. మళ్ళీ వెంటనే అతన్ని ప్రాయోపవేశప్రదేశానికి పంపించివేశాడు.

వెనువెంటనే శ్రీనగర ప్రధాన ప్రాడ్వివాకునికి కబురుపెట్టాడు. అతడు ముచ్చెమటలు కక్కుతూ మహారాజ సన్నిధికి వచ్చి దోసిలిఒగ్గి నిలుచున్నాడు. ఆ వ్యవహార విషయం అంతా విపులంగా యశస్కర దేవునికి నివేదించాడు:

"నేనా వ్యవహారపత్రాలన్నీ స్వయంగా పరిశీలించి చూచాను. ఆ పత్రాలలో ఆయన ఆస్తిపంతి అంతా పూర్తిగా కర్పూర శ్రేష్ఠి కమ్మివేసినట్లే ఉంది. అయితే ఆ బ్రాహ్మణుడు పరమఛాందసుడు. పైగా తాబట్టిన కుందేటికి మూడే కాళ్ళని కూర్చుంటాడు. అంతేకాదు. అతను పరమమూర్ఖుడు! ఆ పరిస్థితులలో ఎవరు మాత్రం ఏమి చెయ్యగలరు! అలాంటి మూర్ఖుడు ప్రాయోపవేశం చేసి ప్రాణాలు విడిస్తే దానితో మరి మన పీక అంతా విరగడై పోతుంది."

యశస్కర దేవుని కంతవరకు శ్రీ నగర ప్రధాన ధర్మాధికారి సచ్ఛీలం శంకించవలసిన అవసరమే కలగలేదు. అతడంత నిష్కర్షగా ఆ వ్యవహారం ఆ విధంగా తుంచివేసి మాట్లాడినప్పుడిక మహారాజు మాత్రమేమి చెయ్యగలడు!

ప్రధాన ధర్మాధికారిని పంపించివేసి మహారాజు మళ్ళీ దీర్ఘాలోచనలో పడ్డాడు.

ఎంతసేపటికీ అతనికా వ్యవహారమేమీ అంతుబట్టలేదు. రాజ్యాధికారం చేపట్టిన పిమ్మట అతడు ఆ రాజ్యంలో అనేకమైన నూతన సంప్రదాయాలాచరణలో పెట్టించాడు.

అంతకుపూర్వం కాశ్మీర బ్రాహ్మణులవసరమైతే కత్తిచేతబట్టి రణరంగంలో వీరవిహారం చేసేవారు. యశస్కర భూపతి వారికటువంటి అవసరమే లేకుండా చేశాడు. అప్పటినించీ వారు తమ కత్తులు, కటారులు ఒకమూలపెట్టి శస్త్రవ్యాసంగానికి స్వస్తి చెప్పి శాస్త్రవ్యాసంగంలో పడ్డారు.

కాశ్మీరంలో చలి ఎముకలు కొరికివేస్తుంది. అందుచేత సామవేదాధ్యాయ సమయంలో నైష్ఠికులు కూడా మధ్య మధ్యన కొంచెం మద్యపానం చేసేవారు. బ్రాహ్మణకులీనుడు యశస్కర భూపతి రాజ్యానికి వస్తూనే ఆ దురాచారం సంప్రదాయ విరుద్ధమని వెంటనే అది నిషేధించాడు. యశస్కర మహీపతి రాజ్యానికి రాకపూర్వం కొంచెం చీకటిపడగానే వర్తకులందరు దొంగతనాల భయంవల్ల తమ క్రయ విక్రయ వ్యవహారాలు కట్టిపెట్టి వేసేవారు. యశస్కరుడు అర్ధరాత్రిదాకా అంగళ్లలాగే తెరిచి ఉంచవలసిందనీ, ఇక దొంగల భయం ఉండబోదనీ అభయప్రదానం చేశాడు. ఆనాటినించీ కాశ్మీర రాజవీధులలో అంగళ్లన్నీ అర్ధరాత్రివరకు తెరిచిఉంచడంమొక పరిపాటిగా మారింది.

ఆ విధంగా నిష్కంటకంగా సాగే అతని ధర్మపరిపాలనలో ఒక బడుగు బ్రాహ్మణుడు ధర్మాధికారులంతా ఏకగ్రీవంగా తన కన్యాయం చేశారని మొరపెట్టుకొన్నాడు. అతని అమాయిక ధోరణి పరిశీలిస్తే అతనికేదో దురన్యాయం జరిగినట్లే తట్టింది. కాని యశస్కర భూపతి కెంత ప్రయత్నించినా ఆ దురన్యాయం ఎక్కడ జరిగిందో తెలియలేదు. మరికొంత సేపటివరకు అలాగే తల బద్దలుకొట్టుకుని ఆ మరునాడే ఆ బ్రాహ్మణుని వ్యవహారం అంతా స్వయంగా పరిశీలిస్తున్నానని శ్రీనగర ప్రధాన ప్రాడ్వివాకునికొక శ్రీముఖం పంపించాడు. ప్రతివాదిని, ప్రాడ్వివాకులను వ్యవహారపత్రాలతో సహా కొలువుకూటానికి పిలిపించవలసిందని ఆ శ్రీముఖంలో ప్రత్యేకంగా ఆజ్ఞాపించాడు. మహారాజాజ్ఞ ప్రకారం ఆ మరునాటి ఉదయమే రాజప్రాసాదంలోని కొలువుకూటంలో న్యాయపరిశీలనం ప్రారంభమయింది.

3

కర్పూరశ్రేష్ఠి, అతనితో పాటతని లేఖకులు ఒకమూలగా నిలుచున్నారు. ఇంకొకమూల దేవశర్మ వ్యవహారం పరిశీలించిన ప్రాడ్వివాకులు తమ ఉచితమైన సుఖాసనాలలో కూర్చుని ఆ వ్యవహార స్వరూపం అంతా మహారాజుకు నివేదిస్తున్నారు. దేవశర్మ అప్పటికే బాగా నీరసించిపోవడంవల్ల ప్రత్యేకంగా అతనినక్కడికి పిలిపించలేదు. అతని వాఙ్మూలం అంతా భూర్జపత్రంమీద భద్రపరిచిన ఒక ప్రధానాధికారి అది చేతబుచ్చుకుని సిద్ధంగా నిలుచున్నాడు. మహారాజు కర్పూరశ్రేష్ఠిమీద శరపరంపరగా ప్రశ్నవర్షం కురిపించాడు.

శ్రేష్ఠి ఎంతసేపు తానుచేసిన అపరాధమేమీ లేదని అనేకవిధాల సత్యప్రమాణాలు చేశాడు. తన వ్యవహారానికి వ్యవహారపత్రాలే సాక్షులనీ, వ్యవహారంపుట్టి పదిపదిహేను సంవత్సరాలు జరిగిపోవడంవల్ల ఆనాటి వృద్ధసాక్షులంతా గతించారనీ, కనక వ్యవహారపత్రాలే జాగ్రత్తగా పరిశీలించి తనకు న్యాయం దయ చేయించవలసిందనీ ప్రాధేయపడ్డాడు. తన వ్యవహారాలలో ఎన్నడు తభావతు రాలేదనీ అన్యాయంగా తనమీద విరుచుకు పడే బ్రహ్మహత్యాపాతకం నివారించ వలిసిందనీ బ్రతిమాలుకొన్నాడు.

మహారాజొక నిట్టూర్పు విడిచి పెట్టాడు. శ్రీనగర ప్రధాన ప్రాడ్వివాకునికా వ్యవహారపత్రం మళ్ళీ ఒకమారు పరిశీలించవలసిందని ఆజ్ఞాపించాడు.


ప్రాడ్వివాకుడది అందరికీ వినబడేటట్టు గట్టిగా పైకి చదివాడు:

"సోపానకూప సహితం
విక్రీతం గృహం"

సోపాన కూపమంటే దిగుడు బావి.

'దిగుడు బావితో కలిపి ఆస్తిపంతి అంతా అమ్మివేయడమైనది'

అని వ్యవహారంపత్రంలో కూడా అక్షరాలా దిగుడు బావితో సహా ఆస్తిపంతి అంతా అమ్మివేసినట్లే ఉంది. మహారాజా వ్యవహారపత్రం చేత బుచ్చుకుని అదంతా అతి జాగ్రత్తగా పరిశీలించాడు. అతనికిక ఏమనడానికీ పాలుపోలేదు. ఇంకొక వేడి నిట్టూర్పు విడిచిపెట్టి ఆపత్రం తిరిగీ ప్రాడ్వివాకునికిచ్చాడు. ఆ సమయంలో యశస్కరుని కొకవేళ ఆ బ్రాహ్మణుడే అన్యాయాన్ని కోడిగడుతున్నాడా! అని స్ఫురించింది. ఉసూరుమని మళ్ళీ ఇంకొక వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు. అటుపిమ్మట మరి మహారాజా విషయమే పట్టించుకోలేదు. క్రమ క్రమంగా మహా



★ న్యాయపరిశీలనం ★

రాజు, ప్రాడ్వివాకులు ఏదో ఇష్టాగోష్ఠిలో పడ్డారు.

కర్పూరశ్రేష్ఠి ఆ వ్యవహారం ఇక తన కనుకూలంగా పరిష్కరింపబడగలదని లోలోపల బాగా మురిసిపోయాడు. యశస్కరదేవుని ముఖంలో ఆవిషయంలో అంతకు పూర్వం కనిపించినంతగా శ్రద్ధాసక్తులు కనిపించలేదు. అతడు తనకు నతిదూరంలో కూర్చున్న ప్రాడ్వివాకుని చూపుడు వ్రేలిమీద మెరిసే రత్నాంగుళీయకంవైపెంతో ఆశ్చర్యంగా చూచాడు:

"ఎక్కడ సంపాదించారో గాని చాలా సొగసైన నాగముద్రిక సంపాదించారే"

ప్రాడ్వివాకుడతి వినయంగా లేచి నిలబడి ఆ అంగుళీయకం తీసి మహారాజు చేతికందిచ్చాడు:

"ఇది పరిహాసపురంలో చేయించిన నాగముద్రిక. అయితే రత్నాలంత ప్రశస్తమయినవి కావు. మావంటి వాళ్లకు జాతి రత్నాలెక్కడినించి వస్తాయి మహాప్రభూ!"

మహారాజింకొక ప్రాడ్వివాకుని వ్రేలి రత్నాంగుళీయకం పరిశీలించాడు. తరవాత అతని దృష్టి కర్పూరశ్రేష్ఠి చేతి రత్నాంగుళీయకం మీద పడింది:

"శ్రేష్ఠివర్యా లెక్కడ సంపాదించారో గాని చాలా విలవైన వజ్రం సంపాదించారే!"

శ్రేష్ఠి తన చేతి అంగుళీయకం తీసి మహారాజసన్నిధిని ఉంచాడు:

"ఇది పెళ్లినాడు మా మామగారు బహూకరించిన జాతివజ్రం! పదివేల సువర్ణ దీనారాల విలవ చేస్తుందని రత్నపరీక్షకులంటున్నారు. ఇంతకీ వారెంత చెబితే అంత! ఆ గొడవ మావంటివాళ్లకేమి తెలుస్తుంది! అదీగాక ఏదో మామగారిచ్చారుగదా అని వేలికి పెట్టుకొన్నానుగాని లేకపోతే మేమెక్కడ! అసలైనజాతి వజ్రాల ఉంగరాలెక్కడ!"

అని సన్న సన్నగా చప్పరించివేశాడు.

మహారాజా వజ్రపుటుంగరం తన అనామికాంగుళి కలంకరించుకొన్నాడు. ఎంతో మురిసిపోతూ ఆ అంగుళీయకంవైపే చూచాడు.

"ఇది ప్రభువువారు బంగారు వ్రేలి కలంకరించుకోవలిసిన రత్నాంగుళీయకం! అంతే గాని మావంటివాళ్ళకది వేలికి పెట్టుకునే అర్హత ఎక్కడిదీ?"

అని సన్న సన్నగా నసిగాడు శ్రేష్ఠి. ఆ మాట విని మహారాజొక క్షణం నిశితంగా ఆలోచించాడు:

"మీ రలా గనడం న్యాయంకాదు, ఊరికే ఒకమారు వేలికి పెట్టుకుని చూదామని అడిగాను! అంతే!"

ఆ విషయం అంతటితో తుంచివేశాడు యశస్కర దేవుడు.

శ్రేష్ఠి తనవల్ల పెద్ద పొరబాటే జరిగిపోయిందని నాలిక కరుచుకొన్నాడు. మళ్ళీ సన్న సన్నగా నసిగాడు:

"ఎంతమాట! తమ కిలాంటి ఉంగరాలు ఒక లెక్కా! ఇవి మీ అంతఃపుర దాసీలు కాళ్ళకు మట్టెల్లా అలంకరించుకుంటారు! నాకు మాత్రం తెలియదా! ఏదో తెలియక అన్నాను. ప్రభువువారు కటాక్షించాలి!"

అని శ్రేష్ఠి వంక వంక దణ్ణాలు పెట్టాడు. మహారాజాపైన అతనిమాట అంతగా పట్టించుకోలేదు. మళ్లీ కొంతసే పిష్టాగోష్ఠి నడిచింది.

రాజాభ్యంతర మందిరంలో మధ్యాహ్నవేళా సూచకమైన మంగళ తూర్యాల సవ్వడి ఉవ్వెత్తుగా వినిపించింది.

ఇప్పుడే తిరిగి వస్తున్నానని చెప్పి మహారాజు వెనువెంటనే తన అభ్యంతర మందిరంలోనికి వెళ్ళిపోయాడు.

౪

"ఎంతటి అత్యవసరం వ్యవహారమున్నా మహారాజొక్క క్షణమైనా మధ్యాహ్న సంధ్యవేళ దాటనీయరు! నిత్యనైమిత్తికాలయందు వారి కుంచుకున్నట్టి ఆస్థ అటువంటిది!"

అన్నాడొక ప్రాడ్వివాకుడు.

"వారిప్పుడే ఒక అరగడియలోనే తిరిగి వచ్చి వేస్తారు."

అన్నాడింకొక ప్రాడ్వివాకుడు.

"తొందరగా లోపలికివెళ్ళిపోతూ నా ఉంగరం తిరిగి నా కిచ్చివెయ్యడమే మరిచినట్టున్నారే మహాప్రభువులు!"

అని లోలోపలే సణుగుకున్నాడు కర్పూరశ్రేష్ఠి.

ఇక మిగిలిన సదస్యులందరు తలకొక విధంగా పిచ్చాపాటీ మొదలుపెట్టారు.

మహారాజభ్యంతర మందిరంలోనికివెళ్ళి అప్పుడే అరగడియ దాటిపోయింది. అయినా ఇంకా తిరిగి రాలేదు ఇంకొక్క అరగడియకూడా గడిచిపోయింది.

అంతలో వంది మాగధుల స్తోత్ర పాఠాలు, మంగళతూర్యాలు భోరున మారుమోగాయి. యశస్కర మహీపతి మెరుపులావచ్చి తన ధర్మాసనంమీద కూర్చున్నాడు. సదస్యులంతా సవినయంగా ప్రత్యుత్థానంచేసి తిరిగి తమ తమ సుఖాసనాల్లో కూర్చున్నారు.

మహారాజిక తమ ధర్మ నిర్ణయం తన పరంగానే నిర్ణయించగలరని కర్పూరశ్రేష్ఠి ఎదురుతెన్నులు చూస్తూ నిలుచున్నాడు. కాశ్మీరాధిపతి నిశితంగా కర్పూరశ్రేష్ఠివైపు చూచాడు:

"ఇంతకీ ఈ వ్యవహారం విషయంలో మీరేమంటారు?"

"ఇంకా విన్నవించడాని కేమిఉంది. మహాప్రభూ! తమరన్ని విషయాలు కూలంకషంగా పరిశీలించారుగదా! ఇక తమ ధర్మనిర్ణయం కోసమే ఎదురు చూస్తున్నాను."

మహారాజుమళ్ళీ అడిగాడు:

"ఇలాంటి వ్యవహార పత్రాలు వ్రాసే కాయస్థులకు సామాన్యంగా మీరెన్ని దీనారాలిస్తారు?"

"ఎన్నో నా? నాలుగైదు దీనారాలకంటె ఎక్కువ ఇచ్చే అలవాటులేదు."

"అంతేనా?"

"అంతే మహాప్రభూ!"

మహారాజొకక్షణం సేపేదో ఆలోచించాడు:

"అయితే ప్రస్తుతం వివాదంలో ఉన్న వ్యవహార పత్రానికి మీరెన్ని దీనారాలిచ్చారు?"

"అయిదు దీనారాలే!"

"అంతేనా!"

"అంతే!"

"కాదేమో?"

ఖచ్చితంగా ప్రశ్నించాడు మహారాజు.

"మహాప్రభూ! తమదగ్గర నేననృతం చెబుతానా? ఎంతమాట!"

శ్రేష్ఠిమాట కొంచెం తడబడింది.

"మీరీ వ్యవహారపత్రం లిఖించిన కాయస్థునికి నూరు సువర్ణ దినారాలిచ్చారు! అవునా? కాదా?"

అని గట్టిగాగర్జించాడు యశస్కరభూపతి. శ్రేష్ఠి తెల్లబోయాడు. అతి రహస్యంగా దాచిన ఆవిషయం మహారాజెలాగ్రగ్రహించారో అతనికేమీ అంతు చిక్కలేదు. అయినాగట్టిగాగోడకట్టినట్టబద్ధమే చెప్పాడు:

"లేదు! మహాప్రభూ! నూరు బంగారు దీనారాలెందుకిస్తాను?"

"ఇచ్చినట్టు నాకు గట్టిసాక్ష్యమే దొరికింది. దీనికేమి సమాధానం చెబుతారు?"

"కిట్టనివారెవరైనా తమకేమైనా కూటసాక్ష్యం చెప్పారేమో!"

ఆపైన శ్రేష్ఠినూరు దీనారాలివ్వడం జరగనే లేదనికులదైవసాక్షిగా ప్రమాణం చేశాడు.

"మీ రావిధంగా నూరు దీనారాలివ్వడానికి కారణంకూడా నాకిపుడిప్పుడే అవగాహన అయింది. ఇప్పటికైనా మీరు చేయించిన కూటకరణం అంగీకరిస్తారా? లేదా?"

యశస్కరుని వాడిచూపులు నిప్పులు చెరి

(56-వ పేజీ చూడండి)

శారదా పాచకము

కె. వి: సూర్యనారాయణరావు

ప్రియమైన భర్తగార్కి,

మీరు హోటలు భోజనము పడటంలేదు అని వ్రాసిన ఉత్తరం అందనది. మీకేమిటి, ఏ మొగవానికేనా యీ హోటలు భోజనాలు పడవేమో అనిపిస్తోంది. మీకంతగా ఆ భోజనం సహించకపోతే వండుకోడం మంచిది. వంట అంత సులభమైంది ఇంకొకటి లేదు. కొబట్టి యీ ఉత్తరంలో జతపర్చి సాధారణంగా ఇంట్లో చేసుకొనే కూరలు. పచ్చళ్ళు ఏ విధంగా చేసుకోవాలో, ఏ ఏ పొళ్ళు చెయ్యాలో, పోపులో ఏ దిన్సులు పడాలో, వేటికి నూనె పోపో, వేటికి నేతి పోపో సవిస్తరంగా వ్రాశాను. ఆ విధంగా చేశారా భోజనం అయిపోతుంది. మీ యిబ్బంది తీరుతుంది. అన్నట్టు నే వెళ్ళేటప్పుడు మన ఆ ల్మారా లో జాకెట్టు గుడ్డలు వదిలేశాను. అది కొస్త కుట్టించి పంపించవలెను. మరీ ఏడో నెలనే వచ్చేసినందుకు పాపం మీకు యిబ్బందిగా వుందనుకుంటాను. ఇక్కడ నాకు చాలా సుఖంగానే వుంది. పదిమందీ ఒక్కచోట వున్నామేమో చాలా కులాసాగా జరిగిపోతుంది. వేగవ పట్నవాసం అనడమే కొని, పల్లెటూరు ముందు దిగదుడుపేసుమండీ. వెంకటేశం చెప్పినట్లు యీ గేదె పెరుగు ముందు పట్నవాసం అంతా బలాదూర్. మన వేణు ఇక్కడికి వచ్చాక చెట్లుచేమలు ఎక్కడం, గోళీలు, గిల్లి దండ, కోతికొమ్మచ్చులు బాగా ఆడుతున్నాడు. చదువుకు సున్న చుట్టేశాడు. మీరు ఆరోగ్యం కొపాడుకుంటూ తరుచు ఉత్తరం వ్రాయ ప్రార్థన.

మీ శారద.

*   *   *

శారదా,

నీ ఉత్తరము ప్రేమలేఖేమోనని మోసపోయా. కొని అది యీ మధ్య పత్రికల్లో పడే ప్రశ్నలు సమాధానాల్లా వుంది కొని, ఎంత వెతికినా ఏదీ ఆప్యాయత? ఏదీ అనురాగం? సాధారణంగా ఆడవాళ్ళ ఉత్తరాలు, ప్రత్యేకించి భార్యలు వ్రాసే ఉత్తరాలు అన్నీ యీ రకంగానే వుంటాయి. వాటిలో ఏమాత్రమూ శుభ్రజ్యోత్స్నలు కొని, మధుమాసపు చిరుగాలులు కొని, కోకిల కూజితాలుగాని ఏమాత్రం కనిపించవు. ప్రియురాలి ఎడబాటు భరించలేక యక్షుడు ఎట్లాంటి ప్రేమలేఖలు పంపాడు? ఎట్లాంటి మధురస్మృతులు! మరెల్లాంటి పులకరింపులు! ఒహో హో! ఏం భాష, ఏం భావం, ఏదీ, ఒక్కముక్క, నీ ఉత్తరం అంతా వెదికినా దాన్లో అల్లాంటిది లేదు. ఎడబాటులో అనురాగం పెరిగినట్లు మరెప్పుడూ అంతగా పెరగదనుకుంటాను శారదా! నాకీ రెండు నెల్లూ రెండుయుగాలుగా ఉన్నాయంటే నమ్ముతావా? నీవు, వేణు లేకపోవటంవల్ల యింట్లో ఏవీ ఆ చిరునవ్వులు? ఆ కలకలలు, ఎకసక్కాలు, మైతావులు, సోగకన్నుల చిలిపితనాలు, వేణు అల్లరి పనులు? శారదా నీవు చాలా చప్పనరావాలి.

అన్నట్టు నీవు ఆ వుత్తరంతో పాటు 'సామాన్య వంటదిపిక' పంపిస్తున్నా

జాకెట్టు ఎట్లా కుట్టించాలి. దర్జీ దగ్గరికి పట్టుకువెడితే మెడ ఎంత పొడుగు, చెయ్యెంత యిల్లాంటి ప్రశ్నలు వేశాడు. గుండ్రపు మెడా? పలకల మెడా? కొలతలు పంపిస్తే కుట్టించి పంపిస్తాను. వేణూని శ్రద్ధగా చదవమని చెప్పు. వాణ్ణి అదుపు ఆజ్ఞల్లో పెట్టకపోతే ఎట్లా నీ కోసం ఎదురు చూసే. నీ

శశిధర్.

*   *   *

పూజ్యశ్రీ గారికి,

ఏమండోయ్ మీ ఉత్తరం మరీ చోద్యంగావుంది. పుష్కరం కొపరం చేసిన తర్వాత హా ప్రియా! హా ప్రాణనాథా! ఎడబాటు సైపనోప! అని కల్లబొల్లి ఉత్తరాలు వ్రాయడానికి నేనేం గుంటపాపనికాదు. అన్నట్టు కోకిల కూజితాలు అంటే గుర్తు కొచ్చింది సుమాండి. ఈ

వన్నావు. అదిమాత్రం చేరలేదు. చేరకపోతేం, తస్సాదిసిరి ఆమాత్రం వంటచెయ్యలేమా అని ఓ మంచి సుముహూర్తాన బజారుకువెళ్ళి "అభినవనలభీమపాక శాస్త్ర ప్రకాశిక," 300 పిండివంటకొలు, 500 రకముల కూరలు, 700 రకముల పచ్చళ్ళు వున్నవి పట్టుకువచ్చా. కొని శారదా! నలభీముల్ని పాకశాస్త్రంలో ఓడిద్దామనుకున్న నా ఉబలాటం కుంపటి వెలిగించటంలో జారిపోయింది. ప్రపంచాన్నంతటినీ తన జ్వాలలచే దగ్ధపటలం కొవించే వీతిహోత్రుడు మనల్ని చూసి పారిపోయాడంటే నమ్ముతావా? అగ్నిమీద ఆజ్యము పోసినట్లు అనే సామెత జ్ఞాపకంవచ్చి యింట్లో వున్న నెయ్యి బొగ్గులమీద పోసి వెలిగించాననుకో. నా చేతులలో ఓడిపోయాననే అక్కసుకొద్దీ మున్న అగ్నిహోత్రుడేంచేశాడనుకున్నావ్? భగ భగ మండుతోందికదా అని సత్తుగిన్నె కొలేసి లోపలికి వెళ్ళాను ఏమో కూరలు తెద్దామనుకొని. నేవొచ్చేటప్పటికి పాపం మీ అమ్మగారు ఎంతో ఆప్యాయంగా యిచ్చిన గిన్నె రూపం మార్చుకుంది. నా తొలూకు యీ వంటానుభవాల్ని చెప్పాలంటే ఓ బృహత్కథ వ్రాయాలి. అన్నట్లు నీ

వూళ్ళో పొద్దున్ననుండి సాయంత్రందాకా అదే పనిగా కోయిల మన పెద్ద మామిడి ఎక్కి తెగ కూస్తుంది. మన వేణువున్నాడా వెధవాయ్, దానితో సమానంగా అది కో అంటే వాడు 'కో' అని అరుస్తాడండీ. 'అమ్మా కోయిల్ని మనవూరు తీసుకు వెడదామే. మన వూళ్ళో ఒక్క కోయిలా లేదు. యింత బాగా కూస్తుందో, చూడవే' అంటాడు. కోయిల ఇంత బాగా కూస్తుందని నేనూ అనుకోలేదుసుమా. నా మతిమరుపు మండ మీకు పంపిస్తానన్న వంటకొగితం ఆ వుత్తరంతో పంపలేదు. మొన్న వేణుగాడు గాలిపటానికి తోకక్రింద కట్టిన కొగితం చూస్తే నేను వ్రాసినదే. మరిచిపోయాను కొబోలు. మళ్ళీ ఉత్తరంతో జతపరుస్తానులెండి. ఇక జాకెట్ల సంగతి. ఆపాలపిట్టరంగు గుడ్డను రొండునెక్, ఆ తోపు గుడ్డను పలకల మెడపెట్టి కుట్టమనండి. అన్నట్టు మన చంటిదానికి ఏమని పేరు పెడ్దామండి. మాంఛి పేరు మీరే ఎన్నాలి. ఇంకెంత! మూడో నెలలో బారసాల చేసుకుని ఐదో నెల వెళ్ళిపోయి వద్దామను

★ శారదా వాచకము ★

సంటున్నాను. మీరు జాగ్రత్తగా కాలక్షేపం చేస్తారని తలుస్తాను. ఇట్లు
మీ శారద.

* * *

చిరంజీవి సౌభాగ్యవతి శారదా, శారదాంభోజవదనా, వదనాంబుజే,

ఏమిటి వ్రాయడం నీకు? హర్షుని కవిత్వం మహా కొబ్బరికాయ పాకంలో వుంటే మినపసున్ని, కాకరకాయ కూర, కాబోలు ఆరునెల్లు పెట్టి బుద్ధిమాంద్యం తెప్పించి అంతకంటె కొత్త సులభమయిన కవిత్వము వ్రాయించారుట. అటా కాదు. ఆరునెలలు స్వహస్తపాకం చేయిస్తే కవిత్వమంటే పది మైళ్ళు పరిగెత్తును. నీ మాట తీసివెయ్యలేక వండుకుంటున్నా గాని, యింత కష్టమయిన పని మరొకటి లేదనుకో. ఈ వెధవ పుస్తకం కొన్నానా! దాన్నిండా కొలతలు, తూకాలూను. ఆ ప్రకారమే చేశామనుకో, నోట్లో పెట్టుకోడానికి వీల్లేకుండా వుంది. ఇంకో ఐదు నెలలకు కానిరావూ? మహా భేషుగ్గా వుంది. Cooking mabe easy hints పంపిస్తానన్నావు, ఎప్పుడు పంపుతావు? ఆ పాతాల పుస్తకం కోసం ఎదురు చూస్తున్నాను. వేణుని అక్కడ హైస్కూల్లో చేరిపించు. అన్నట్టు అమ్మాయి పేరు కాదూ వ్రాయమన్నావు? దీనితో ఒక లిస్టు జతపరుస్తున్నాను. దాన్లో నీ యిష్టమొచ్చిన పేరు ఎన్నుకొని చప్పున బారసాల చేసేసుకొని రావలసిందిగా కోరుతున్నాను. అన్నట్టు జాకెట్ల విషయం. పాలపిట్ట రంగు అంటే తెలుస్తేనా (పాలవలె తెల్లనైన పిట్ట.) తోపు రంగంటే అసలే తెలవలేదు. సవిస్తరంగా వ్రాస్తే కుట్టించి తిరుగుటపాలో పంపిస్తాను. నీగురించి కాదు, నాగురించి నానా అవస్థలు పడే—

శశిధర్.

P. S. మనింట్లో పాత గానుపింగాణీ సామానులు పరలోక ప్రాప్తి జెందినందుకు నీకు తెలపడమైనది.

* * *

ప్రియమైన శశీ,

మిమ్మల్ని చూస్తే కాదు కాదు మీ ఉత్తరాల్ని చూస్తే నవ్వు, జాలికూడా వేస్తోంది. తొమ్మిదిన్నర అవకుండా వేగిరం, వేగిరం అంటూ ఆడవాళ్ళ కాళ్ళక్రింద నిప్పులు పోస్తారే? ఒక్క మనిషికి పదిగంటలలోపుగా వంట చేసుకోలేరుటండీ. కష్టమే పాపం. ఆఫీసులు మరీ పదిన్నరకి పెట్టారాయిరి. ఆంధ్రరాష్ట్రం వచ్చాక అర్ధణా జీతం పెంచకపోయినా మహామంత్రుల ధర్మమా అని ఒక అరగంట కాలం పెంచారు. ఏదో అభివృద్ధి చూపించవద్దూ? అభివృద్ధి ఆ ఆఫీసులకు వెళ్ళే మొగాళ్ళకు ఎలావున్నా ఇంట్లో వంట చేసే ఆడవాళ్ళకు కత్తిమీద సాము అయింది. ఈమధ్య మా నళిని అందిలెండి గవర్నమెంటు ఆఫీసు ఉద్యోగుల భార్యల రాయబారం ఒకటి మంత్రిసత్తముల దగ్గరకు తీసుకువెడదామని. తమ క్రింద పని చేసే ఉద్యోగుల యిక్కట్లు స్వయంగా చూస్తే మొసలికన్నీరోడ్చే ప్రభుత్వం ఆడవాళ్ళ రాయబారాలకు విలువిస్తుందనుకోను. అన్నట్టు మీరు పంపించిన లిస్టులోని పేర్లు నేనూ నళిని జాగ్రత్తగా పరిశీలించాం. నళిని చెప్పేనమాట ఏమిటంటారా? మీ ఆయనకు ఒక గాంగు కంట్రాక్టరుతోను, ఒక ఎలిమెంటరీస్కూలు ఉపాధ్యాయునితోనూ, ఒక హాస్పిటల్ నర్సుతోను మంచిస్నేహం వుంది సుమా అని. అయినా అవేం పేర్లండీ? ఆ పేర్లలో ఏ ఒక్క పేరైనా మనమ్మాయికి పెట్టి పిలవడానికి నోరెల్లా వస్తుందండీ? కానియ్యండి, అప్పటికి ఏ మాఅమ్మ పేరో పెడదాం. మీకు మతిమరుపు జాస్తి అయినట్లుంది. బారసాల చేసేసుకు రమ్మంటున్నారు. బారసాలకు మీరు రానక్కరలేదనుకున్నారా? బాగుంది విడ్డూరం. ఇప్పటి నుండీ అక్కడకు వస్తే పిల్ల పాడైపోతుంది. వచ్చేది వేసంకాలం. వచ్చేటప్పుడు ఊరగాయలు అవీ పెట్టి పట్టుకవస్తాను. కాస్త ఓపిక పట్టండి. వేణు కులాసాగా ఉన్నాడు. వైశాఖంలో బారసాల చేద్దాం. ముందుగా శెలవు పెట్టేరండి. అయ్యో రాత, పాలపిట్ట రంగు అంటే ఆకాశంరంగండి. తోపురంగే తెలియదా, తోపుకుంకుం అంటారూ. రంగులు తెలవకపోతే ఎల్లాగండి. వచ్చేటప్పటికే నా జాకెట్లు కుట్టించండి. మీ
శారద.

* * *

అప్రియవాక్యంబా,

నీకెన్ని సార్లు చెప్పాను శశీ, గిసీ అనగని నిన్ను శారి, చీరి అంటె ఎంత కోపం! మొగాణ్ణి ఆడపేరు పెటి పిలవడమేమిటి? నాకు భలేగా ఒళ్ళుమండుతోందిలే, నీ ఉత్తరం చూసి. ఆడపిల్లల పేరు ఆడవాళ్ళే పెట్టుకోవాలి; లేకపోతే మగవాడు ఎక్కడని కనుక్కుంటాడు! సరేకాని నీవింతదామాషాని ఐదు నెలలువరకు రాకపోవడం న్యాయమేకదా! అందువల్లనే పాపం మొన్నీమధ్య మా ఆఫీసుకు బదిలీ అయిన ఉమకు ఇల్లు ఎక్కడా దొరక్కపోతే మనింట్లో దిగమన్నా. ఉమది వంటలో సిద్ధహస్తంసుమా! పనసకాయ కూర ఉమచేతోనే తినాలి తింటే. నువ్వు పెట్టిన కూర ఒడియాలు వేసిన ఉమ పనసకాయ కూర తింటున్నప్పుడు స్వర్గం ఇక్కడికి ఎంతో దూరం లేదనిపించింది. అన్నట్టు ఈమధ్య రామానుజం, నేను కొత్తగా ఇటలీ నుంచి ఓడలువస్తే చూడడానికి వెళ్లాం. హార్బరులో రామానుజం స్నేహితుడున్నాడు. మమ్మల్ని ఓడలోకి తీసుకువెళ్ళాడు. ఓహ, చూడాలంటే రెండు కళ్ళు చాలవనుకో. ఏం సదుపాయాలూ! ఏం హంగులూ! ఈ ఇళ్లు ఏం యిళ్లు, ఆ ఓడలో వుండే సౌకర్యాల ముందు. నీకు చెప్పకుండా వుండలేకున్నాను. ఓడ కెప్టెన్ రామానుజం స్నేహితుడికి మిత్రరత్నమయ్యాడు, అతగాడి ఉద్యోగరీత్యా! తింటే గారెలే తినాలి వింటే, భారతమే వినాలి అన్నదానికి, తాగితే వైనే తాగాలి అని జేర్చాలి. వైన్ అంటే ఏమీ లేదు ద్రాక్ష సారాయి. ఓహో! ఏం రుచి! ఏఁ రుచి! తప్పంటావా శారదా! ఆ లక్ష్మీవారం దాన్తో ఒదిలితే బాగుండును ఆ దొరగారు. ఇంగ్లీషు డాన్సుకు తీసుకుపొయ్యాడు. ఎక్కడ నేర్చుకున్నాడో కాని రామానుజం అచ్చు దొరలా డాన్సు చేశాడంటే నమ్ము. నన్నా ఆ దొర రంగంలోకి యీడ్చాడంటే, ఆ దొరసానితోల హా! హీ! అన్నానంటే, నాకే బాగుండలేదు; నీకేమని చెప్పను? ఏదో గతం గతం-అయితే బారసాల ముహూర్తం ఎప్పుడు పెట్టించావ్. వేణుబాబుకు నా ముద్దులు. చిరంజీవి పాపాయికి ఆశీర్వచనములు. అన్నట్లు జాకెట్లు ఉమను కుట్టించమన్నాను.

శశిధర్.

ఆర్యపుత్ర

మీకీ ఉత్తరం చాలా ఆలస్యంగా వ్రాసినందుకు క్షమార్హురాలను. మీరేమో సత్యహరిశ్చంద్రులనుకున్నాను. అబద్ధాలు ఆడటం కూడా నేర్చుకున్నారుసుమండీ. ఒంటరిగా మగాళ్ళను వదిలివేస్తే ఎన్ని వికారాలు పుట్టాలో అన్నీ పుట్టాయి. మీ ఉసువంట బాగా ఉంటుందన్నమాట. పెళ్ళవుతే సుఖపడవచ్చులెండి. అవతలమనిషి ఆడా మగా తేల్చకుండా వ్రాయడంలో ఘనులండీ మీరు. మీ రామానుజం భార్య భాగ్యం ఒదిన యీ మధ్యని ఉత్తరం వ్రాసింది. "మీ యింట్లో ఉమామహేశం అనే అబ్బాయి చేరాడు. కుఱ్ఱవాడు చక్కనివాడు. కొత్త అన్నగాని ఆ అబ్బాయిని మా చెల్లెలికి మాట్లాడిరి పెట్టమని వ్రాయమని. ఆ అబ్బాయేనా మీకు స్వర్గానికి దారి చూపించే కూరలు వండి పెట్టిన ఉమ! మీరిద్దరు కేరియర్ తెప్పించుకుంటూ ఎందుకండి అబద్ధాలు. అన్నట్టు మొన్న లక్ష్మివారం నాతిలో పేద వేశాను. ఆవాళ యిల్లాజరిగిపోయింది వదినా పేరంటాళ్ళతోనూ" అని భాగ్యం ఒదినకు ఉత్తరం వ్రాస్తూ "నీవు ఆనాడు ఎల్లా గడిపావో సవిస్తరంగా ఉత్తరం వ్రాయ"మన్నాను. "ఆనాడు మేం సింహాచలం వెళ్లి మధ్యాహ్నం పన్నెండు గంటలకు వచ్చాం. మేమిద్దరమూ సాయంత్రం దాకా కాళ్ళు కదపలేక మంచాలు మీద సేవున్నాం, ఏం చెప్పను వదినా," అంటో వాపోయింది భాగ్యం వదిన. అయితే మీ ఓడ ప్రయాణం అంతా ఊహాగానమేనా; అయినా విదేశీ సరుకు కొత్త శరీరానికి మంచిదేలెండి. మళ్లా ఎప్పుడేనా రష్యానుంచి ఓడలువచ్చినప్పుడు ఓడెక్కి పుచ్చుకోండి. కోతలు కోసినా నమ్మాలండీ! మీరు ఏ విధంగానూ పొడవలేరని నానమ్మకం. పొడవడానికీ, ఆడవాళ్ల వెంటపడడానికి ఓవిధమైన తెగువ వుండాలి. నాకు తెలుసుగా మీసాహసం! మనమ్మాయి చూడండి, ఎంచక్కా ఉందో, నువ్వు పువ్వు నవ్వులాంటి ముక్కుండీదానిది. మీ కుమార రత్నం నామాట వినటం లేదు. మా అక్కయ్యగారి పనసతోట, మామిడితోట విరగకాసింది: మీ పుత్రశ్రీ ఆతోటలో పళ్ళన్నీ ఖాళీ అయ్యేవరకూ యిక్కడ నుండి కదలడట. అన్నట్లు శ్రీమామగారు వైశాఖ శుద్ధ విదియనాడు భారసాలముహూర్తముందంటున్నారు. అత్తగారు "పాపం వెఱ్ఱి నాగన్న ఏం అవస్తపడుతున్నాడో" అని మీకోసం బెంగపెట్టుకున్నారు. పాపాయికి యీ పల్లెటూరు బాగా పడిందండి. అదిగో అప్పుడే ఆకీడగాడు కార్, కేర్ మంటోంది; వస్తాను. మీరో నెల సెలవుపెట్టి రాకూడదూ! మీకొరకు ఎదురుచూసే

శారద. ★

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము
...ఐదవ భాగము




నేపథ్యరచన... నండూరి. రామమోహనరావు
బాపు
కడకునాకబో - క్షపణకులు మొ
కాలి ఊతున - కానుపించిరి—
దుక్కలా తెగ - బలిసియుండిన
భిక్షుజైనుని - పిలిచి
మంగలి
స్వామీ! మిమ్ముల జూడగానె
సత్కరింపగ కోర్కె పుట్టెను
కానరండని కోరగా యది
లోన పొంగుచు జైనుడేగెను
యతిని లోనికి - తీసికొని చని
అతిథి మర్యాదలను జరిపెను —
ఎందుకోయీ జైనులనని
కింత శ్రద్ధా సక్తి భక్తి?
"ఆ, మరేమీ
లేదు స్వామీ"
అనుచు మంగలి
లేచి వెంటనే.
దుడ్డుకర్రను బూని జైనుని
గాడ్డి మాదిరి బాద మోదెను
ఒక్కయుని యతి శిరము రెండుగ
వ్రక్కలై యతి విచిత్రముగా....

వల్లూరి కృష్ణారావు

ఆ ఊరు చాలాచిన్నది. నాగరికత ఆ ఊరును బాగా అలుముకున్నట్లు పంతులమ్మ వస్తేనేగాని తెలియలేదు అంతవరకు. మగతగా పడిఉన్న ఆ ఊరుకు గిలిగింతలు పెట్టింది పంతులమ్మ! ఒకరితో ఇంకొకరికి సంబంధంలేని ఆ గ్రామవాసులలో పంతులమ్మ పరోక్షంగా సంబంధం కలిగించింది. ఎన్నడూ ఇంతవరకూ పోటీ లేకుండా వస్తున్న ప్రసిడెంటు అపూర్వబాబుకు జమిందారుతమ్ముడు కామేశం విపరీత బుద్ధిపుట్టి పోటీగా నిలబడ్డం ఆఊరిలో చైతన్యం కలిగిందనడానికి ప్రబల నిదర్శనంగా భావించారు అపూర్వబాబులాంటి కొంతమంది. ఇంటర్మీడియట్ పరీక్ష తప్పిన రామంలాంటివారు సాయంకాలం కాగానే బడివైపు షికార్లు ప్రారంభించారు. రావిచెట్టుక్రింద బండరాయి వేదికఅయి ఊరుకొంది.

పంతులమ్మ ఏమీ వలితిమనిషి కాదు. పట్టి సాదాస్త్రీ. తనడ్యూటీ ఏమిటో తప్ప ఇతర గొడవలు పట్టించుకోని పడుచు. కాని ఆమె కుమారి. ఇదెంతో ఆహ్లాదకరమైన విషయంగా భావించారు కుఱ్ఱముాక! "ఆ!" అని అదిలిస్తే ఆగే యువకజనం ఇప్పుడు పెద్దలమాటలు ఖాతరుచేయకుండా కాలర్లు పైకిపెట్టుకు తిరుగుతున్నారు. ఆమె రాకతో అనేక మార్పులు కలిగినట్టు అనుకున్నారు అంతా!

ప్రసిడెంటు అపూర్వబాబు చాలా మంచివాడనే భావన అందరికీ ఉంది. అపూర్వబాబునుగురించి రెండు విషయాలు మనం తెలుసుకుంటే మంచిది. అపూర్వబాబుకు మంచి ఆస్తిలేదుగాని తనకు సరిపడే ఆస్తిఉంది. ఆదర్శాలుగల యువకుడు. కాని ఇంతవరకు తాను ఊరుకోసం పాటు పడవలసిన అవసరం కనపడలేదు. పోతే ఊరు చాలా మామూలుగా, సాఫీగా పని చేసుకుంటోంది. తను కలుగచేసుకోవలసిన అవసరం కలుగలేదు. అంచేత తనఇంటిలోని పెద్ద లైబ్రరీని ఉపయోగించుకుంటూ కాలక్షేపం చేయసాగాడు. పంతులమ్మ ఆ ఊరుకువచ్చి 'డ్యూటీ'లో చేరగానే తను స్కూలుకు వెళ్ళాడు. బసవ పున్నయ్యగారు హెడ్మాస్టారు. చక్కటి పంతులంటారు. ఆయన పంతులమ్మకు అపూర్వబాబును పరిచయంచేశాడు. "ఈయన అపూర్వబాబు. మన ఊరు ప్రసిడెంటు. ఆదర్శాలకోసం జీవితాన్ని కూడా త్యాగం చేయడానికి వెనుదీయరు" పంతులమ్మ ముసిముసినవ్వులు నవ్వింది. అపూర్వబాబు అంతలో కలుగచేసుకొని...

"ఈయన అభిమానం అటువంటిది. నాకేమీ ఆదర్శాలులేవు. చాలా మామూలు మనిషిని." పంతులమ్మ చిరునవ్వును పెదాల దగ్గరకు తెచ్చుకొని తిరిగిలోపలకు మళ్లించింది. సన్నగా అంది పంతులమ్మ.

"మీపేరు చాలా క్రొత్తగా ఉంటుంది కదూ." అని కళ్లు అపూర్వబాబుకళ్లలో ఒక్కక్షణం ఉంచి తిరిగి బసవపున్నయ్యగారి వైపుచూసింది.

అపూర్వబాబుకు ఏదో ఉత్సాహం వచ్చింది. పంతులమ్మ ఎంతో 'షార్పు' అనుకున్నాడు, అపూర్వబాబు.

"అవును...ఈ పేరును నా మేనమామ పెట్టాడు. ఆయన కవి. నాకు చిన్నప్పుడే తల్లి, తండ్రిపోయారు. వారుపెట్టిన పేరు సన్యాసి. అది మీకుతప్ప ఇంకెవరికీ తెలియదు." పంతులమ్మ తిరిగి నవ్వింది. కాని తాను తెలుసుకోగలిగింది అపూర్వబాబు క్షణక్షణానికి తనదగ్గరసా రావడానికి ప్రయత్నిస్తున్నాడని. పంతులమ్మ ఈసారి తెలివైందని ఋజువుపరచుకొంది అపూర్వబాబుదగ్గర.

"రెండుపేర్లకు మీరు తగియుంటారు." ఫెళ్లున నవ్వింది. బసవపున్నయ్యగారుకూడా నవ్వారు. అపూర్వబాబుకూడా నవ్వాడు. నవ్వి "అవును. తగియుండడంకాదుగాని తగియుండేలా చేసుకొన్నాను. నాకు ఎప్రక్కా నా అనేవారు లేరు. సన్యాసికయినా ఉంటారేమో ఏఒక్కడో, అరో, భక్తే ఏడవడానికి. ఇక పోతే నా మేనమామ పెట్టినపేరుకు కొంతవిలువ ఇవ్వాలనుకొన్నాను. నాగురించి ఇంతవరకూ, ఇంత వివరంగా ఎవ్వరిదగ్గరా చెప్పలేదంటే మీరు ఆశ్చర్యపడక్కర్లేదు." పంతులమ్మ నోరు తెరచి వింది. అపూర్వబాబు పదినిముషాలు ఉండి వెళ్ళిపోయాడు.

మర్నాడు కామేశంవచ్చాడు. బసవపున్నయ్యగారు నిర్ఘాంతపోయారు. ఎన్నడూ లేనిది...పెద్దలుక్రమంలో...తనపాఠశాలకు వస్తున్నారు. యధావిధిగా బసవపున్నయ్యగారు కామేశాన్ని పరిచయంచేశారు. కామేశం వస్తుంటే...ఏ అత్తరు సాహెబో వస్తున్నాడనిపించింది. బంగారు బొత్తాలు ధగధగ మెరుస్తున్నాయి. జాగ్రత్తగా పౌడరుతో మెత్తబడిన ఆ నున్నటిమొహం తళతళలాడుతోంది. గ్లాస్కో పంచె, బంగారువన్నెగల ఆ సిల్కులాల్చీ, ఆ లేసుగళ్ళ బనీను...కామేశానికి కొత్తదనం ఇచ్చింది.

"ఈయన జమీందారుగారి తమ్ముడు, కామేశం. లక్షలకధికారి." అని వేలుపెట్టి నొక్కిచెప్పినట్టు చెప్పాడు బసవపున్నయ్యగారు. పంతులమ్మ నమస్కరించింది. తిరిగి ఇచ్చేశాడు కామేశం. కామేశం డబ్బును మధ్యపెట్టి పంతులమ్మను ఆకర్షింపదలచాడు. పున్నయ్యగారితో అన్నాడు. "అన్నయ్యతో చెప్పకపోయారామాష్టారూ! ఈ షెడ్డు లేమిటి పాడు," అని విసుక్కున్నాడు. పంతులమ్మ నవ్వింది. ఆ నవ్వును అపార్థం చేసుకొన్నాడు కామేశం.

"మీరెక్కడుంటున్నారు."

"కొత్తగోడ్డులో!"

"అక్కడ బాగానేఉండచ్చు. మీకభ్యంతరం లేకపోతే..." కామేశం పంతులమ్మ కళ్లలోకిచూశాడు. పంతులమ్మ తెచ్చిపెట్టుకొని ముక్తుతూనవ్వింది. కామేశం వెర్రెత్తిపోయాడు.

"అప్పుడప్పుడు మాఇంటికి వస్తోండండి." అని కామేశం వెళ్ళిపోయాడు ఠీవిగా!

ఒకనాడు సాయింత్రం బడినుంచి ఇంటికి వెడుతోంది పంతులమ్మ. తానుమామూలుగా వెడుతోంటే ఎవరో గేలిచేస్తున్న ధ్వనులు వింది. పంతులమ్మ ఖాతరుచేయలేదు. తాను తనమానాన నడుస్తోంది.

ఆ మర్నాటి ఉదయం స్కూలుకు వెడుతున్న పంతులమ్మకు రామం తారసపడ్డాడు. పంతులమ్మను చూచి "గుడ్ మోర్నింగ్" అన్నాడు. తిరిగి అదేమాటను అంది పంతులమ్మ చిలకలా. కొన్నేపాగి...

"ఎవరుమీరు?" అంది.

"నాపేరు రామం. పూర్వం కాలేజీ విద్యార్థిని."

"ఇప్పుడు?"

"వయోజనుడను."

నవ్వింది పంతులమ్మ. రామం పిచ్చివాడయిపోయాడు క్షణంసేపు.

"పకే వస్తాను"

రామం సరేనని...వెడుతున్న పంతులమ్మను ఆపి

"చూడండి..."

"ఏమిటది?" పంతులమ్మ నిర్ఘాంత పోయింది

"ఏమీ లేదు." చప్పగా అన్నాడు రామం "మీరుభలేవారు."

రామం మరి మాట్లాడలేకపోయాడు. పంతులమ్మ "వస్తానండీ!" అంటూ వెళ్ళిపోబోయింది.

రామం తేరుకొని..."ఇదిగో చూడండీ!"

పంతులమ్మ నవ్వుతూ చూసింది రామం వంక.

"నవ్వకండిగాని...ఒకటి మీతో చెప్పాలనుకున్నాను."

"చెప్పండి..."

"ఏమీ లేదు."

"సరేవస్తాను" అంది నవ్వుటూ.

రామం దెబ్బతిని..."ఏమీ అనుకోరు కదా. సరే అయితే...మీరు అందరితోనూ, అంత చనువుగా ఉండడం మంచిది కాకపోగా ప్రమాదంకూడా!"

"మీతో కూడానా?" పకపక నవ్వింది పంతులమ్మ.

"మీలా, నేను విషయాన్ని తేలిగ్గా విదిలించుకోలేను."

"మీ కేమొచ్చింది విదిలించుకోడానికి."

"నాగురించికాదు...మీ..."

"ఆ!"

"పదిమంది..."

"పదిరకాలుగా అంటారంటారు."

"అవును."

"అన్నివ్వండి...అయినా అందర్నీ ఆడించే కాలేజీవిద్యార్థులు మీరు ఇంత పిరికివారా?"

"క్షమించండి అందర్లాటి వాడిని కాను."

"ఈ ఊళ్లో వాళ్ళంతా అందర్లాటివారూ కారు." అని నవ్వింది. తిరిగి అంది. "సరే వస్తానండి థాంక్స్."

పంతులమ్మ తనలో తాను అనుకొంది. అందర్లాంటివాడు కాదు ప్రసిడెంట్ అపూర్వబాబు..అందరు జమిందార్ల బ్బాయిల లాంటివాడు కాదు కామేశం. అందరు కాలేజీ కుర్రాళ్ళ వంటివాడు కాదు రామం. అందరి పంతుళ్ళాంటి పంతులు కాదు పున్నయ్యగారు. అందరి పంతులమ్మల లాంటిది కాదేమో తనుకూడ! నవ్వొచ్చింది తనకు.

రెండుమూడు రోజులయ్యాక అపూర్వ బాబు పాఠశాలకు వచ్చాడు. పున్నయ్య గారిని, పంతులమ్మను కలుసుకొని తన పుట్టినరోజు పండగ చేసుకుంటున్నానని టీపార్టీకి రావలసిందని కోరాడు. పున్నయ్యగారు ఆశ్చర్యపోయాడు. అపూర్వబాబుకు పుట్టినరోజుపండగ ఇదే మొదటిది తనకు తెలిసినంతవరకు. టీపార్టీకి అందరూవచ్చారు. రామం పంతులమ్మ ప్రక్కన కూర్చోవాలని మహా తాపత్రయపడ్డాడు. కామేశం, తనదుస్తులు, మెడలోని బంగారు గొలుసును పంతులమ్మ చూస్తోందో లేదోనని ఖేదపడ్డాడు. ఇక అపూర్వబాబు...నల్లటి లాంగ్ కోటులో మిలమిల మెరిసిపోతూ, దొరబాబులా పదిమందిలోనూ పెద్దగా పంతులమ్మ ఎదుట తనకు తాను కనపడ్డం గర్వంగా భావించాడు.

కామేశంకూడా టీపార్టీ ఇవ్వదలచాడు. పంతులమ్మను స్వయంగా వెళ్ళి పిలిచాడు. పంతులమ్మ నవ్వుతూ అంది.

"చూడగా మీరూ, అపూర్వ బాబుగారూ పోటీ పడినట్లుంది" కామేశం దెబ్బతిని క్షణంలో తెప్పరిల్లి వెంటనే.

"ఎందులో" అన్నాడు.

★ చక్కిలిగింతలు ★

"అహా! అదికాదు. టీపార్టీలో"

"ఓహ్! అదా! అపూర్వబాబుకు నాకు పోలికకట్టారా?" అని అభిమానంవచ్చి అన్నాడు.

"అంటే?"

"చూస్తారుగా! అపూర్వబాబు ఇచ్చినదికూడా ఒక టీపార్టీయేనా? అంటారు మీరే!"

"నేనుఅనడం దేనికీ? మీరేఅంటూంటే!"

కామేశం మరోసారి మొహం ముడిచాడు, పంతులమ్మ తిరిగిఅంది.

"అధైర్యపడకండి ఇవేం ఎన్నికలు కాదుగా! ఇది టీపార్టీ! అఖండంగానే ఉండొచ్చు."

కామేశంకు కోపంవచ్చింది. వెంటనే కోపం మంచిది కాదనుకొని "అదిసరే... వేరే నాకు పనుంది. నేనువస్తాను."

కామేశం చాలా ఘనంగా చేశాడు టీపార్టీ. ఎవరూ ఊహించలేనంత బాగుంది టీపార్టీ. టీపార్టీలో ఇచ్చిన పదార్థాలు నూటికి ముప్పాతిక మందికి కొత్త, సగానికి పైగా పదార్థాలను ఎలా పుచ్చుకోవాలో కూడా తెలియనిప్రజ ఉన్నారన్నా ఆశ్చర్యపడ నక్కరలేదు.

మర్నాడు రామంవచ్చాడు స్కూలుకు. పంతులమ్మ చిరునవ్వుతో "రాండి" అంది రామానికి ఎంతో ఉత్సాహం వచ్చింది.

"ఏం రామంగారూ! మీరు కూడా టీపార్టీ ఇస్తున్నారా" రామం తెల్లముహం వేశాడు. తన అసమర్థతను దెప్పుతోందనుకున్నాడేగాని టీపార్టీలంటే ఆమె కంత హితవుగాదని రామానికి తెలియదు. చాలా నింపాదిగా అడిగాడు రామం.

"రేపు మధ్యాహ్నం ఊరు వెడుతున్నారా?"

"ఏం?"

"శని ఆదివారాలు కదా అని..."

"ఏం అయితే వెళ్ళాలా?"

"నేను అడిగానని మానెయ్యరు కదా ఖర్మ!" అని నవ్వాడు:

"లేదు-వెడుతున్నాను."

"నేను కూడా వస్తానని చెప్పడానికి వచ్చాను. నాకు పనుంది. వేరే బండి మాట్లాడకండి స్టేషనుకు."

"నాకు సామానుఏమీఉండదు. స్టేషనుకు నడిచే వెడదామనుకుంటున్నాను. నాకు నడవడం సరదా."

"నాకూ నిజంగా అంతే!"

"నేను స్టేషనుదాకా మాత్రమేరాగలను:" అతను కళ్ళలోకి చూసి అంది ఆమె.

"అంటే?"

"మిమ్మల్ని దిగబెట్టి తిరిగి ఇంటికివచ్చేస్తాను." ఫక్కుమంది పంతులమ్మ. రామం మెలికలు తిరిగాడు ఆమె హాస్యానికి. రామం, తాపీగా—" నేనూ అదే చేద్దాం అనుకుంటున్నాను. మిమ్మల్ని స్టేషనులో దిగబెట్టి వచ్చేస్తాను. సరే...ఏదో ఒకాటి చేద్దాం లెండి.. వస్తా" అని వెళ్ళిపోయాడు.

ఆవేళ సాయంత్రం కొత్తగోద్దువపు అపూర్వబాబు నడవడం నిజంగా అపూర్వమే! అపూర్వబాబు ఎప్పుడూ ఆరోడ్డువైపు పోలేదు. పంతులమ్మ ఇంటికి సరాసరి వెళ్ళాడు. పంతులమ్మ నవ్వుతూ ఆహ్వానించింది అపూర్వబాబును. అపూర్వబాబుకు వేడి కాఫీ ఇచ్చింది. తియ్యగామాట్లాడింది, అపూర్వబాబు, తనంటే పంతులమ్మ కెంతో గౌరవం అనుకున్నాడు. తన అభిప్రాయాన్ని ఎలా చెప్పాలో తోచక తికమకపడ్డాడు. ఏమైనా తన ఉద్దేశ్యాన్ని ఆమెకు తెలియచేయాలనే నిశ్చయానికి వచ్చాడు.

"చూడండీ! నేను అతిముఖ్యమైన ఒక విషయాన్ని మీతో మాట్లాడ్డానికివచ్చాను" అని మొదలు పెట్టాడు అపూర్వబాబు.

"మాట్లాడండి! అలాగే," అంది పంతులమ్మ జడ చివరన రిబ్బనుతో ముడిపెడుతూ.

"చూడండీ! మీకు తగినంత వయస్సు వచ్చింది. పైగా పంతులమ్మగారు. కనక మీతో మాట్లాడ్డానికి కొంత సున్నితమైన విషయమైనా ధైర్యంగా మాట్లాడ ప్రయత్నించాను."

"ఏమిటది?"

"మీ పెళ్ళిమాట" అపూర్వబాబు పంతులమ్మవైపు చూడలేదు. పంతులమ్మ వెంటనే

"చూడండీ! అపూర్వబాబుగారూ! మీరు చెప్పిన మాటలనుబట్టి విషయం అర్థం చేసుకున్నాను. సాంఘిక మర్యాదలను నేను పాటిస్తాను. మాతండ్రిని కలుసుకోండి. ఆయన అంగీకరిస్తే...నా అభ్యంతరం ఉండదు." అపూర్వబాబు చెంగున లేచాడు సరేనంటూ. "వస్తానని" వెంటనే వెళ్ళిపోయాడు.

"వెమ్మదస్తుడు అపూర్వబాబు" అనుకొంది. అంతే!

మర్నాడు మధ్యాహ్నం రామం పంతులమ్మ ఇంటికి వెళ్ళాడు. ప్రయాణానికి ఆమెను సిద్ధపరచాడు. ఇద్దరూ స్టేషనువైపు వెళ్ళారు. రామం ఏదో మాట్లాడ్డానికి ప్రయత్నించి 'ఇప్పుడెందుకులే' అన్నట్టున్నాడు. ఏవేవో మాట్లాడాడు పిచ్చిగా. పంతులమ్మ యాదాలాపంగా వింటేగాని నవ్వలేదు. తుళ్ళిలేదు. పంతులమ్మ మరో దృష్టిలో ఉంది. రామం మెదడు వేరేవిధంగా పని చేస్తోంది. ఎందుకో అతడు సతమతమవుతున్నాడు. అపూర్వబాబును, రామానికి దగ్గర పెట్టి ఆలోచిస్తోంది. దృష్టి రామంమీదకన్న అపూర్వబాబువైపే పోతున్నది. కాని అపూర్వబాబు పేరును అసలు రామంతో మాట్లాడినప్పుడు తేనే లేదు. రామం పంతులమ్మను రైలు ఎక్కించాడు. ఒక్క తెలివైన పనిచేశాడు రామం. కిటికీ ప్రక్కకూర్చున పంతులమ్మతో కరచాలనం ధైర్యంగా సాహసించి చేశాడు రైలుకదులుతోంటే.

ఆదివారం సాయంత్రం స్టేషనులో పచారుచేస్తున్నాడు రామం. రైలువచ్చింది. పంతులమ్మ దిగుతోంది. పంతులమ్మను ఎదుర్కొన్నాడు. పంతులమ్మ నవ్వింది. రామానికి ఎంతో బలం వచ్చినట్టనిపించింది. అంతమందిజనంలో, బ్రహ్మాండమైన ప్లాట్‌ఫారం మీద రామం రహస్యంగా అన్నాడు... "మీరు అలా నవ్వకండి. భరించలేను." పంతులమ్మ పెదిమలు తడిచేసుకొని నవ్వింది. ఎందుకో రామంఅంటే అభిమానం ఏర్పడ్డది.

మళ్లీ నవ్వింది. రామం లోలోపల గంతులు వేశాడు. పంతులమ్మ ఎన్నో కబుర్లు చెప్పింది. అవన్నీ రామానికి ఇప్పటికీ జ్ఞాపకమే !

ఒకనాడు సాయంత్రం అపూర్వబాబు పంతులమ్మ ఇంటికి వెళ్లాడు. పంతులమ్మ నవ్వుతూ ఆహ్వానించింది. అపూర్వబాబు క్షణం కూర్చుని లేచి నుంచొని..."మీరు కోరినట్టు, నేను ఈ వేళ, మీ నాన్నగార్ని కలుసుకున్నాను."

"మీరు మా ఊరు వెళ్ళారా ?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును వెళ్ళాను. ఆయన అభ్యంతర మేమీ లేదన్నాడిందులో!"

"కాని... నేను అభిప్రాయాన్ని మార్చుకున్నాను." పంతులమ్మ మిక్కిలి నింపాదిగా అంది.

అపూర్వబాబు తగని ఆశ్చర్యం పోయాడు. కోపంతో

"వేళాకోళ మనుకున్నారా? ఒకమాటు అభిప్రాయాన్ని వెలిబుచ్చడానికీ ... అది కాదంటూ తిరిగి చెప్పడానికీ.

"అది కాదు నేనంట...పూర్వం పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితి వేరు."

"ఏమొచ్చింది పరిస్థితికి. నేనేమయినా మారానా లేక మీరు మారారా?"

"నేనే మారాను."

"క్షణక్షణానికి మీలో మార్పు వుంటుందని నేను ఊహించలేకపోయాను."

"పోని...ఇప్పుడనుకోండి. మించి పోయిందిలేదు."

"అవును. మించిపోయిందిలేదు. నన్ను వెర్రెత్తించకండి; చదువుకున్నవారు. ఏదో కొంత మాట విలువ తెలుసనుకున్నాను."

"ఏమిటి మీరనేది?"

"అవును ఇదివరకు మీరన్నదేమిటి? ఎందుకు మీ నాన్నగార్ని కలుసుకో మన్నారు? ఉట్టి అపహాస్యానికా? బడిపిల్లలు ఆడుకునే ఆటనుకున్నారా? మీమీద మీకే నమ్మకం లేదు."

పంతులమ్మ విసిగిపోయింది.

"ఇప్పుడు నన్ను ఏం చేయమంటారు?"

"ఏం చేయమంటే మాత్రం ఏం చేస్తారు మీరు. మాటల్ని చాలా తేలిగ్గా అనగలుగుతారు. అంత తేలిగ్గానూ వదలేస్తారు. ఒకమాట మనం అన్నాక, దానిని మంచో, చెడ్డో, తిరిగి వాపసు చేసుకోవడం మంచి పద్ధతి కాదు."

అపూర్వబాబు మాట్లాడ్డం తీరు పంతులమ్మను కదలించింది.

"అపూర్వబాబుగారూ ! నేను అంగీకరిస్తున్నాను. మీ ఇష్టం సరేనా?"

"నేను అంగీకరించవలసిందిగా బలవంతం మాత్రం చేయలేను."

"ఏమైనా, మీకు అభిమతమైన సమాధానం ఇచ్చినప్పుడు; సమాధానం పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకో ప్రయత్నించకండి. నాకు విశ్రాంతి ఇమ్మనికోరుతున్నాను." పంతులమ్మ ప్రాధేయపడింది.

"వెళ్లమని కోరడం లేదూ ?" అపూర్వబాబు నవ్వుతూ అన్నాడు.

"క్షమించండి. ఇప్పుడు నవ్వలేను." పంతులమ్మ శూన్యంలోకి చూస్తుండగా అపూర్వబాబు వెళ్ళిపోయాడు. పంతులమ్మ ఏదో ఆలోచిస్తోంది.

రెండు క్షణాలు గడిచాక జమీందారు కూతురు పద్మ వచ్చింది. పద్మకు ఎనిమిదేళ్ళుంటాయి. పంతులమ్మకు పద్మ అంటే ఎంతో ఇష్టం. పేలవంగా నవ్వింది పద్మను చూచి. పద్మను చేతుల్లోకి తీసుకొంది.

"బాబాయి ఇచ్చాడు" అని ఒక కవరు ఇచ్చింది. కవరు చించి లోని కాగితాన్ని తీసి చదువుతుండగా పద్మ వెళ్ళిపోయింది.

"ముఖాముఖీని మాట్లాడవలసిన ముఖ్య విషయమైనా, తగిన సాహసం లేక ఉత్తరం ద్వారా తెలియచేస్తున్నాను. మిమ్మల్ని ప్రేమిస్తున్నాను...మీరుకూడా ...అనుకొని ఏమైనా పున్నయ్యగారు, నా గురించి, చేసిన పరిచయ వాక్యాలు మరిచిపోలేదనుకుంటా. మీరేమాటా తిరిగి జాబుద్వారా తెలియచేయగలరనుకొనే...కామేశం."

"కామేశం ! పున్నయ్యగారికి పరిచయ వాక్యాలు !! ప్రేమ !!!" అనుకొంది. వెంటనే కాగితం తీసి కలం పుచ్చుకొంది పంతులమ్మ. విసురుగా వ్రాయబోయింది. కాని మరుక్షణంలోనే మెళ్లో బంగారు గొలుసు, బంగారు బొత్తాలు, రాళ్లతో పొదగబడిన బంగారు వాచీనైను... ఇవన్నీ కనబడ్డాయి. అవును కామేశాన్ని పెళ్ళి చేసుకుంటే. వెంటనే ఎగిరి కామేశం మేడమీద చివరగదిలో ముఖమల్ పరుపుపై పడ్డట్లనిపించింది పంతులమ్మకు. వంటనే ఏమీ తెలియని రామం, అన్నీ తెలిసిన అపూర్వబాబు, జమీందారు తమ్ముడు కామేశం ముగ్గురూ నిలబడ్డట్టయింది. పంతులమ్మ ఎటూ నిర్ధారణ చేసుకోలేకపోయింది. ఇది ఒక విషమ సమస్య అనుకొంది.

ఏమీ తెలియని రామంకు చదువు మధ్యలో ఆగిపోయింది. ఉద్యోగం లేదు. కనీసం ఆస్తి లేదు.

అన్నీ తెలిసిన అపూర్వబాబు మధ్య తరగతివాడు.

జమీందారు కామేశం జమీందారు, ఫరవాలేదు. కాని హృదయం లేదు. సంస్కారం లేదు. అతడే చెపుతున్నాడు తనని చూచి కాదు ప్రేమించమనేది, తన ధనాన్ని చూసి.

పంతులమ్మకు దిక్కు తెలియక శూన్యంలోకి చూస్తూ చాలా సేపుండిపోయింది.

పంతులమ్మ కామేశానికి ఉత్తరం వ్రాసింది. "చూడండీ! నేను మీకు ఈ ఉత్తరం వ్రాయవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను నిజంగా. నేను, డబ్బునకంటే మనిషినే ఎక్కువ ప్రేమించగలనని అనుకుంటాను. మీరు ఏమీ అనుకోకండి. పంతులమ్మ."

అపూర్వబాబు, రామం కలుసుకోవడం నిజంగా ఆశ్చర్యం, దైవికం. కలుసుకొన్నా అంతతో ఆగిపోక, ఆమాట, ఈమాటలలో పంతులమ్మను తాను ప్రేమిస్తున్నట్లు, పెళ్ళాడదలచినట్లు చెప్పాడు. అపూర్వబాబు ఆశ్చర్యానికి అంతులేదు. అందుకే పంతులమ్మ ఆనాడు ఆ పరిస్థితి వేరంది.

"పంతులమ్మ నిన్ను ప్రేమిస్తోందా ?"

★ చక్కిలిగింతలు ★

"పూర్తిగా" తల ఊపుతూ అన్నాడు రామం. రామం వెళ్ళిపోయాక అపూర్వబాబు చాలాసేపు ఆలోచించాడు. రామానికీ, పంతులమ్మకు మధ్య తను నిలబడ్డం తనకే నచ్చలేదు. వెంటనే పంతులమ్మకు ఉత్తరం వ్రాశాడు. 'చూడండీ!' అంటూ.

"చూడండి. నేను బలవంతంగా మిమ్మల్ని 'నాదాన్ని'గా చేసుకో లేని కారణంగా నా అభిప్రాయాన్ని మార్చుకున్నాను. మీరు ప్రేమించిన వార్ని మీరు స్వీకరించండి. ఇంతే...అపూర్వబాబు."

పంతులమ్మ తగని ఆశ్చర్యం పడింది. అపూర్వబాబు మారి పోవడానికి...ఇదంతా ఏమిటో...కారణం తెలియదు. కాని ఒకటనుకొంది. అపూర్వబాబు చాలా చిత్రమయినవాడు. ఇదంతా కామేశం కుట్ర. వెంటనే పంతులమ్మ అపూర్వబాబుకు ఒక ఉత్తరం వ్రాసింది.

"చూడండీ! నా అభిప్రాయానికి తిరిగి మార్పు కలిగే లోపలే మీరన్న మాటను వాపసు చేసుకోవడమే చిత్రం. తిరిగి, మీరు మళ్ళీ ఇది కాదంటూ అనరనుకుంటాను. నేను ఇంతవరకూ, ఏ ఒక్కర్నీ ఇదమిద్ధంగా ప్రేమించలేదంటే మీకు ఆశ్చర్యంగా ఉండడంలో ఆశ్చర్యమేమీ ఉండదు. పైగా, కాస్త నేను దూరంగా వెళ్ళింది మీతోనే అని చెప్పవలసివచ్చింది. జరిగిందంతా ఒక చిత్రమయిన కలగా, అనుభూతిగా అనుకొని మరిచిపొండి...పంతులమ్మ."

అపూర్వబాబు పంతులమ్మ ఉత్తరం చూచి ఆశ్చర్యపోలేదు. కాని కొండలు పగిలే కోపం వచ్చింది. అది రామంమీద. "దొంగ వేషం!" పళ్ళు పటపటలాడాయి. రామానికి కబురు పెట్టాడు.

రామం వచ్చాడు.

"నువ్వు దొంగవి. అబద్ధాల కోరువి. పట్టపగలు, నిర్భయంగా మోసం చేయడానికి నువ్వు వెరవవు? నీకు ఒకర్ని మోసం చేయొచ్చు, మరి ఒకర్ని చేయకూడదనే వివక్షత లేదు. నువ్వు నాతో నే పందెం వేసి నన్ను పడగొట్టదల్చావు. నీదగా పనిచేసింది."

"ఏమిటి మీర నేది" రామానికి మతిపోయింది.

అపూర్వబాబు కొరకొర చూచాడు. మాట్లాడలేదు. నుంచున్నాడు కోపంతో మొహం జేవురించింది. రామం భయపడలేదు. రామంకూడా నుంచున్నాడు. అపూర్వబాబు కళ్ళను చూడలేక పోతున్నాడు రామం.

"ఏమిటి మీర నేది?"

అపూర్వబాబు మాట్లాడలేదు. రామాన్ని సమీపించాడు. చొక్కాను లాగి గుప్పెట్లో అదిమి సాచి దవడమీద పెట్టాడు. రామం ఈ సారి కూడా మాట్లాడలేదు.

"ఇందుకేనా మీరు పిలిచింది?"

"నువ్వు పంతులమ్మను ప్రేమిస్తున్నావా? కాదు పంతులమ్మ నిన్ను ప్రేమిస్తోందా?"

"ఏం? లేదా?"

"పంతులమ్మ చెప్పింది."

"పోన్లెండి. మంచిది వస్తాను. కాని ఒకటి పంతులమ్మ నన్ను ప్రేమించని కారణంగా కొట్టారని నేను అనుకోను."

అపూర్వబాబు ఆశ్చర్య పోయాడు రామం నెమ్మదికి.

"నన్ను క్షమించు రామం" అన్నాడు. అపూర్వబాబు.

అపూర్వబాబును చూస్తుంటే రామానికి 'జలసీ' భగుమన్నది. అపూర్వబాబును పంతులమ్మ ప్రేమిస్తోందా? తనను ప్రేమించ వన్ను అపూర్వబాబు కెట్లా తెలుసు?

రామం వెంటనే పంతులమ్మను కలుసుకొన్నాడు. జలసీతో కుమిలిపోతున్నాడు రామం. పంతులమ్మ నవ్వు రెండు ముక్కలుగా చీలి ప్రవహించినట్లనిపించింది. పంతులమ్మ భయపడింది రామం తీరుమాస్తే.

"ఏమిటండీ!" అంది.

"నటన! మోసం! ఆకళ్ళు ఎంతకుళ్ళునైనా దాచగలవు" అనుకొన్నాడు రామం.

"ఏమీ లేదు."

"బాగుంది మాట!"

"ఏం? నీ అంత నేర్పరిని కాదా"

"ఏమిటో మీర నేది?"

"ఏమంటాను నువ్వు ఒకేసారి రెండు పాత్రలను అభినయించ గలవ్."

"నాకర్థ మయింది ... మీరనవసరంగా ఇనవకండి మీరు పూర్వం రామం లాగా ఉండండి."

ఏమిటీ నాటకం? ఎందుకు నన్ను ఇలా పిచ్చివాణ్ని చేయడం? అపూర్వబాబును ప్రేమిస్తున్నానంటే పోయేదిగా?

"నేనుఅందర్నీ ప్రేమిస్తున్నాను. అందర్నీ ప్రేమించడంలేదు. నాకు నేను ఏనిర్ణయం చేసుకోకుండానే మీలోమీరు కీచులాడుకున్నారు. నాకు తోచనిస్తేకదా? నేను వచ్చింది లగాయితు అందరూ ఒక్కలా ఉన్నారు."

"అందరూ"

"అవును మీరు అనుకున్నది రెండు పాత్రలే! కాదు మూడో వారు ఒకరున్నారు."

రామం ఆశ్చర్యపోయి..."కామేశమా?"

"అవును ఏం?"

"ఏమీ లేదు... ఇప్పుడేమంటారు?"

"నేనే ఏమీ అనను. కాలమే నిర్ణయిస్తుంది. ఓపిక పట్టండి...అంతే...కాఫీ పుచ్చుకొంటారా?"

"మీరిదివరకు పెట్టిన గిలిగింతలు చాలకనా?"

"మీరు అలా భావించుకున్నారు అంతే! మర్యాదను వేరొకలా అర్థం చేసుకొంటే నేనేం చేసేది?"

"నాకేమీ అర్థం కాదు. నేను వస్తాను."

"వెళ్ళిరండి...కాని మీకు కూడా ఒకటి చెప్పదలచుకున్నాను. జరిగినదంతా ఒక విచిత్రమైన కలగా, అనుభూతిగా మాత్రమే భావించి మరచిపోవడానికి ప్రయత్నించండి."

"అది మీకు వీలవుతుందేమో..."

"నేను మీలా ఇతరులను గురించి పొరపడను."

"నేను పొరపడ్డానంటారా?... ఏమో! నిజమేనేమో! అవును... అర్థమయింది... వస్తాను."

పంతులమ్మ ట్రాన్స్‌ఫర్‌కు అప్లికేషన్ పెట్టి శెలవు పెట్టి ఊరువదలి వెళ్ళింది. పంతులమ్మ పెట్టిన గిలిగింతలు ఇంకా జ్ఞాపకానికి వస్తూనే ఉంటాయేమో ముఖ్యంగా అపూర్వబాబుకూ, రామానికీను! పంతులమ్మ సెలవునుంచి తిరిగి రాకుండానే బదిలీ కాగితం వచ్చినట్టు బసవపున్నయ్యగారు తర్వాత చెప్పారు. బసవపున్నయ్యగారికి నిజంగా తెలియదు పంతులమ్మ బదిలీ కోరడానికి కారణం! ★

వనితా లోకం

కూరలనుండి చీరెలవరకూ:

బేరం చెయ్యడమూ ఒక నేర్పే...!

పోయిన క్రిస్‌మస్ శెలవుల్లో మావారి వేపు దూరపుబంధువొకావిడ మా ఇంటికి వచ్చింది. ఆవిడ నాకు వరసకు మరద లౌతుంది. పాపం! అన్ని విషయాల్లో నా కెంతో చేదోడు వాదోడుగా వుంటూ చాలా కలసి మెలసీ వుండేది. అన్ని విషయాల్లో నా కావిడంటే ఎంతో ప్రేమగా వుండేది. కాని ఒక్క బేరం విషయంలో మాత్రం మా ఇద్దరికీ చాలాసార్లు అభిప్రాయ భేదా లొస్తుండేవి. ఓరోజు మధ్యాహ్నం తీరిగ్గా భోజనాలుచేసి కూచున్నాం. వాకిట్లో ఎవడో చీరెలవాడి కేక వినపడింది. ఒక్క అంగలో 'ఆవిడ' వీధిలోకి గెంతి వాణ్ని కేకేసింది. సరే ఎటూ పిలవనే పిలిచిందికదా తన కిష్టమైన చీరేదో కొంటుందిలెమ్మని నేనూ వూరుకున్నాను. ఆ చీరలమ్మే అతను ఓ చీరె చూపించి ముప్ఫయి రూపాయలని ఖరీదు చెప్పాడు. ఒక్కసారిగా 'ప్చ్' అనేసి వాడి దగ్గరుండే దొంతర్లన్నీ ఒక్కమారు తిప్పేయించింది. అరగంట, ముక్కాలుగంటవరకు అలా చీరెల రంగులుచూడ్డం, ధరలు కనుక్కోడంతో గడిచింది. తర్వాత పమిటె కొంగులు ఎలాటివి అంటూ మళ్ళీ అన్నీ మడతలు విప్పించింది. ఆ తర్వాత ధర దగ్గర పడ్డారు ఇద్దరూ. అతనేమో 25 రూపాయలన్నాడు. వెంటనే ఆవిడి మొదలెట్టింది. "ఆ! ఎక్కడన్నా వుందా ఈ వెధవ మైసూరు సిల్కుమిటీ. 25 రూ॥ లేమిటీ; మేమేం కొనలేదనుకున్నావా? ఇలాటివి బోలెడన్ని కొన్నాం తెలుసా! దీని అసలుఖరీదు ఎనిమిది రూపాయలకన్నా ఎక్కువ చెయ్యదు. అదైనా ఇంతసేపూ కూచున్నావ్ కాబట్టి ఓ అర్ధరూపాయి ఎక్కువే చెప్పేశాను." అంటూ.

వెంటనే ఒక్క విసురున వాడు చీరలన్నీ మూటకట్టుకు అరగంటవరకూ ఆగకుండా నానామాటలూ అనీ వెళ్ళిపోయాడు. ఇదంతా గుడ్లప్పగించి చూస్తున్న నాకు నోటమాట పెగల్లేదు. తర్వాత ఆవిణ్ణి లోపలికి తీసికెళ్లి "అదేమిటొదినా, అలాటి చీరె ఎనిమిది రూపాయలంటావ్... ఇది మనకేమైనా బాగుందా?" అన్నాను మందలింపు స్వరంతో. దానికి ఆవిడేమందో తెలుసా?

"నీకు తెలీదొదినా; ప్రతి బేరగాడూ అలా ఎక్కువ ధర చెప్పేస్తాడు...మనం వాళ్లు చెప్పేదాన్లో మూడోవంతో, నాలుగోవంతో అడగాలి...చివరకు వాళ్లే ఇచ్చి పోతారు." ఈమాటలువిని ఇక వాదించి లాభం లేదనుకొని ఊరుకున్నా.

ఇదంతా ఎందుకు చెప్పుకొచ్చానంటే మన స్త్రీలలో చాలామంది అలాటివాళ్లున్నారు. అలా అని పురుషుల్లో లేరని కాదు, ఉన్నా బహుకొద్దిమంది...వారిలో కూడా మనంత తొందరగా భయపడేవాళ్లు ఎవరో ఒకరూ, అరమాత్రమే! ఇలా రాశానని బహుశా చాలామంది ప్రమదలకు కోపం రావచ్చు కాని వుండేనిజాన్ని చెప్పుకోవడం, ఒప్పుకోవడం తప్పేమీ కాదు.

దుకాణం అంతు కనుక్కుంటారు

ఓరకంవారున్నారు. వాళ్ళు షాపింగుకు బయల్దేరుతుంటే చూచేవాళ్ళకి సుమారు ఎన్నివందల విలువగల వస్తువుల్ని తేటానికి వెళ్తున్నారో అనిపిస్తుంది. తీరా ఓషాపులోకి వెళ్లి, ఆషాపులో వుండే అన్నిరకాల వస్తువులూ, చీరెలూ, జాకెట్లూ (ఓరూపాయి మొదలు వందరూ॥ల వరకూ విలువగలవి) వాళ్ళను నానాతిప్పలూ పెట్టి తనిఖీచేస్తారు. చివరకు ఏదో ఓవస్తువో, జాకెటు బట్టో (ఓరూపాయి ఖరీదు చేసేది) తీసుకు బయటికి వచ్చేస్తారు. అలాటివాళ్ళను చూస్తుంటే పక్కనుండే మనకేగాదు, ఆ షాపువాళ్ళకైనా గౌరవం మర్యాదా వుండదు సరికదా ఓవిధమైన ఏహ్యభావం కలుగుతుంది. రెండోసారి వస్తే సరిగ్గా సమాధానం కూడా చెప్పరు.

పవని నిర్మలప్రభావతి
[మొగలిచర్ల]

వింతలో పైఅంతస్తు

ఇంకా కొందరున్నారు: వాళ్ళు షాపులకుగాని ఎక్కడికిగాని వెళ్లేది, ఊరికే ఆరంగు రంగుల బట్టలూ, ఎంత వింతవస్తువుల్నీ చూచి ఆనందించడానికే నేమో అనిపిస్తుంది. ఇలాటివారు పోయినచోట మర్యాదగా బయటపడరు. ఆ రంగు బాగులేదనీ, ఈ వస్తువు బాగులేదనీ...వ్యాఖ్యలతో మొదలెట్టి అవతలివాళ్ళచేత నానామాటలూ పడి మరీ బయటపడ్తారు. ఇలాటివాళ్ళతో షాపింగ్‌కు వెళ్లేకంటే శుభ్రంగా నరకంలో ఓ అరగంటసేపు కూచుని రావటం హాయిగా వుంటుంది.

ఇక వీరి విషయంలో - ఫలానాదాన్లో అని చెప్పలేము-నిత్యజీవితంలో తటస్థపడే ప్రతి చిన్న వస్తువు బేరంలో వీరిగుణం బయటపడిపోతుంటుంది. కూరలబేరం దగ్గర్నుంచీ-చీరెల బేరం దాకా వీరు తగువులాడని వారంటూ వుండరు. వచ్చిన ప్రతి వస్తువునూ, పిలిచి బేరమాడి...నచ్చలేదనో,

బేరం చెయ్యడమూ ఒకనేర్పే...!

బాగులేదనో ఏదో ఓ సాకుతో వెళ్ళగొట్టేస్తుంటారు. అసలలాటివాళ్ళదగ్గర కొంటానికి నిలదీసి అడిగితే దమ్మిడీకూడా (ఇప్పటి భాష ప్రకారం ఒక్క నయాపైసా కూడా) వుండదు నిజానికి! కానీ వాళ్ళు అలా పూరుకోరుగా...అదో వింతైన సరదా! దానివల్ల వాళ్ళకుగాని, అవతలవాళ్ళకుగాని వచ్చే లాభమేమీ వుండదు సరిగదా...వృథాగా రచ్చన్న మాట.

సబబు, బేసబబూ

అసలు విషయానికొద్దాం. ఇలా వ్రాసినందుకు చాలా మంది పఠితలు "అయితే మీ ఉద్దేశ్యంలో, బేరమాడ్డం, షాపుల్లో బట్టలూ అవీ కొనటానికి చూట్టం తప్పేనా?" అని నా మీద ప్రశ్న పరంపరలు కురిపిస్తారేమో! దానికి సమాధానం నేను మొదటే చెప్పేస్తా! బేరం చెయ్యటం తప్పనీ, బేరమాడకుండా ఏదో ఓ వస్తువు తీసుకు నష్టపడమని కాదు నా వుద్దేశ్యం. ప్రతివస్తువూ బేరమాడాల్సిందే (అలా అని ప్రతి ఒక్క వస్తువు కూడా కాదు లెండి!) కాని ఆ బేరమాడ్డంలోకూడా వుంది నేర్పు. అదీ ఒక కళే! అమ్మకునేవాడు ఒక వస్తువు (ఓ చీర అనుకోండి) ఇరవై రూపాయలు చెప్తాడనుకోండి...దాని నాణ్యం, అదీ బాగా చూచుకునే కదా మనం దాన్ని కొంటాం. అలాటప్పుడు తపీమని ఇది ఐదు రూపాయలకు ఇవ్వమనిఅడిగితే ఏమంత సబబుగా వుంటుంది. చెప్పండి? అతనూ అమ్మకోటానికే వస్తాడు. కాని కేవలం దానం చేసి పోదామని రాడు గదా! నిజంగా దానిఖరీదు ఐదు రూపాయలే అయితే నిర్మొహమాటంగా అది ఎలాటిదైంది. మనదగ్గర వుదాహరణకి ఏదైనా వుంటే చూపి, నెమ్మదిగా చెప్పి, వద్దనవచ్చు. దానివల్ల ఆ వచ్చినవాడూ మనకో వస్తువు నాణ్యం తెలుసునని తెల్సుకొని వప్పుకుంటాడు. అంతేకాని ఏ మైసూర్ సిల్కు చీరనో, (లేక ఏ విలువగల వస్తువునో) "దీని ఖరీదు ఒక్క రూపాయి కూడా కాదు" అనటంవల్ల మనమలాటిది ఇంతకుముందు కనీసం చూడనైనా చూళ్ళేదని రుజువుచేసుకున్నట్టే గదా! నిజానికి అమ్మకునేవాళు అసలు రేటుకంటే కొంత ఎక్కువ చెప్తారు నిజమే. కానీ, అలా అని బొత్తిగా దాన్ని ఊరికే తీసుకున్నా దండుగే...ఏదో వాణ్ణి బ్రతికించటానికి తీసుకుంటున్నట్టు మాట్లాడితే ఎలావుంటుంది చెప్పండి?

ఇక షాపులకు వెళ్తే ... మనకొక్కవలసిన రకాలేవిటో, ఎంతధరలో కావలెనో వాళ్ళకు స్పష్టంగా చెప్తే...వాళ్ళకూ కష్టం, విసుగూ వుండదు; మనకూ కావాల్సిన వస్తువు మీదినుంచి మనస్సు చెదరదు. అంతేకాని అన్ని రకాలవీ చూచి చూచి చివరకు నచ్చలేదనీ, బాగలేదనీ, ధర ఎక్కువనీ, ఇవి వొద్దనీ, రకరకాల అభిప్రాయాలూ వెళ్ళబెట్టే బదులు శుభ్రంగా మనకొక్కవల్సింది తీసుకు బయటపడ్తే మనకూ అవతల వాళ్ళక్కూడా ప్రాణం హాయిగా వుంటుంది. తీరా అన్నీ చూచి ఏ అర్ధరూపాయి వస్తువుతోనో బయటికొస్తే వాళ్ళెంత చికాకు పడ్తారు చెప్పండి.

అవతలి వాళ్లను నొప్పించకుండా మనం నష్టపడకుండా బేరం చెయ్యడంలోనే వుంది నేర్పు. ★

పంజాబీ వంటకాలు

పంజాబీల వంటకాలన్నీ, పుష్టికరమైనవి, రుచికలవీను. కొన్ని మనకి తెలియని వంటలుంటాయి. ఇటుప్రక్క వారంతా గోధుమ రొట్టెలు తింటారని అందరికీ తెలుసు. మన ప్రక్క కూడ కొందరు ఒకపూట రొట్టెలుతినటం అందరికీ తెలిసిన విషయమే. కాని అందులోకి కావలసిన కూరలు మనకంటే ఇక్కడివారికే బాగా చేతవును. మనం పెసర, కంది, సెనగ పప్పులను మాత్రమే వండుకుంటాము. అవయినా పొట్టుతీసి వేసినపప్పులనే వాడుతాము. ఇక్కడలా కాదు. అన్నీ పొట్టుతోనే వండుకుంటారు. సర్వసాధారణంగా ఇక్కడ వాడుకొనేది పొట్టుమినప్పప్పు లేక మినుములు. వీటితో పప్పుచేస్తారు. వారంకి రెండు మూడుసార్లు గింజ సరుకులు, సెనగలు, పెసలు, మినుగులు మొదలగు అన్ని గింజ సరుకులూ వండుకుంటారు. ఇవన్నీ బలమైనవే. పంజాబీల స్పెషల్స్‌లో, ఒకటి 'చోలే' అంటే శనగలకూర. చోల అంటె వారికి ప్రాణం. ఇది ఎలాచేస్తారో ఈక్రింద చెపుతాను.

కావలసిన సామానులు:— $\frac{1}{2}$ పావు మినుములు (మినప్పప్పుకంటే మినుములే రుచిగా ఉంటాయి) పొట్టుతీసిన శనగపప్పు చారెడు, పెద్ద ఉల్లిపాయ, అల్లం, ఉప్పు, కారం.

ఈపప్పు రాత్రి చేస్తామనగా మధ్యాహ్నం మొదలుపెడ్తే బాగుంటుంది. మినుములు, సెనగపప్పు బాగుచేసి ఎక్కువ నీళ్లుపోసి బాగా ఉడకనివ్వాలి. మినుములు బాగా ఎనిసిపోవాలి. ఈ పప్పుని పప్పుగుత్తితో బాగా ఎనిపేసరికి మంచి రంగు వస్తుంది. అప్పుడు అందులో తగినంత పొడికారం, ఉప్పు, పసుపు, గరమ్‌మసాలా వేయాలి. అల్లం మెత్తగా నూరి వేయాలి. ఉల్లిపాయలు సన్నగా తరిగి మంచినెయ్యి కుంపటిమీద పెట్టి అందులో టీస్పూన్ జీలకర్ర వేసి ఎర్రగా వేగింతరువాత ఉల్లిచెక్కు వేసి వేగినతరువాత పప్పులో వేసి కలిపి వాడుకుంటే రుచిగా ఉంటుంది. ముందు కొంచెం చేసి చూడండి నచ్చుతుందో లేదో.

ఆలూ - ఛోలే

ఆలూ–ఛోలే (బంగాళాదుంప-శెనగలు), 1 పావుశేరు తెల్ల శెనగలు 3 బంగాళాదుంపలు, 3 పెద్దఉల్లిపాయలు, అల్లం, మసాలాదినుసులు.

శెనగలు నీళ్ళల్లో మూడు గంటలు నాననిచ్చి మెత్తుకుంటే ముద్దయేలాగ వాటిని ఉడికించాలి.

ఉల్లిపాయలు సన్నగా తరిగి, అల్లం, తగినంత పసుపు, కారం, ఉప్పు, గరమ్‌మసాలా, కొత్తిమిర ఇవన్నీ కలిపి మెత్తగా నూరి, కుంపటిమీద స్టీలుగిన్నె పెట్టి నేతిలో ఎర్రగా ఉల్లిముద్దని వేయించాలి. బాగా వేగింతరువాత గ్లాసుడు నీళ్ళు పోసి మూత పెట్టాలి.

బంగాళాదుంపలు బాగా కడిగి పొట్టు తీసి పెద్దముక్కలు తరిగి, ఉడుకుతున్న మసాలాముద్దలో వేసి ఐదు నిముషాలు ఉడకనివ్వాలి. అందులో ఉడికిన శెనగలు వేసి మరికొంచెం నీళ్ళు పోసి నీరంతా అంటే గరిట జారుగా ఉండనిచ్చి తగినంత చింతపండు పులుసు చిక్కగా చేసి కూరలో వేసి నాలుగుమూలలా కలిపి దించుకోవాలి. సర్వ్ చేసినప్పుడు కూర ఒక గాజుప్లేటులో పెట్టి ఉల్లిపాయలు సన్నగా చక్రాలుగా తరిగి ప్లేటులో కూడ మీదపేర్చి ఇస్తే అందంగా ఉంటుంది.

భర్ తా

ఇక్కడివారు వంకాయ కాల్చిచేసిన కూరకి 'భర్ తా' అంటారు. ఈ కూరకి లేత

(42-వపేజీ చూడండి)

స్వయంమర్ధబోరిణీం

"ఏమండీ!"

…………………

'ఏమిట్లే!'

…………………

'అయ్యో! పలకరేం!'

…………………

'వినిపించుకుంటేగదా చెప్పేందుకు.'

'ఆ! ఏమిటి.'

'బియ్యము నిండుకున్నాయి.'

'మొన్న నేగదా తెస్తా.'

'ఎంతని తెచ్చారేం.'

'నాల్గు రూపాయలవి.'

…………………

'అప్పుడే నిండుకున్నాయా?'

'నిండుకున్న వనేగా చెప్పేది.'

'ఇంట్లో వున్న వాళ్ళ ఇద్దర మేగదా.'

'ఒకప్పు డెవరెక్కువొచ్చారు.'

'మావాళ్ళెవరు రాలేదు.'

'మావాళ్లే మీసత్రాల్లో జారిపడుతున్నది.'

'ఎవరన్నారా మాట.'

'ఎవరో అంటే నాకెందుకు? మీ రనట్లే.'

'నిజమాడితే నిష్ఠూరము.'

'ఉన్నమాటంటే ఉలుకెక్కువ.'

…………………

'ఒట్టి అనుమానపు మనుష్యులు.'

'నిప్పులేందే పొగరాదు.'

…………………

'సంసారము సాగాలా?'

'ఇల్లాగయితే సాగినట్లే.'

'ఐదేళ్లనుండి చూస్తున్నా నీవరస.'

'నేను కాపురానికొచ్చే నిండా నాలుగేళ్లు కాలా.'

'మాటకు మాటెదురు.'

'ఎదురుకొంబట్టే మీముందర నెగ్గకొస్తున్నా.'

2

'ఏం చేస్తున్నావమ్మా! కూతురా'

'రండీ! పిన్నిగారు'

'ఈ పూట కేమున్నా తవ్వెడు బియ్యముంటే……'

'ఆ, అల్లానే తీసికెళ్లండి'

'మొన్నటివి గూడ కలిపి తెచ్చిస్తాను'

'వాటికివీటికి కలిపి ఏకంగా డబ్బిచ్చెయ్యండి'

'డబ్బా'

'అవునండీ! పిన్నిగారు'

'ఎంత'

'కావాలంటే బజార్లో కంటె ఒక సోలెడదనంగానే తీసుకోండి'

'అబ్బాయికి తెలిస్తే'

'తెలిస్తేగా'

'ఏం చేస్తున్నావిదంతా'

'నిలవచేస్తున్నా'

'దేనికి?'

'మే రోజెటు వంటిదో'

'మనసు పాపిష్టిది'

'కీడెంచి మేలెంచమన్నారు'

'పది కాలాలపాటు, పసుపు కుంకుమ బాగుండాలనుకోవాలి'

'శరీరాలు నీటిమీది బుడగలు'

…………………

'దీప ముండగనే ఇల్లు చక్కబెట్టుకోవాలి'

3

'చొక్కాయి జేబులో చిల్లర డబ్బులేవి?'

'కనబడటంలే'

'లేదు'

'ఎక్కడ బెట్టేరు?'

'వంకెకే తగిల్చా'

'ఎవరొచ్చారు?'

'ఎవరొస్తారు?'

'పడుకోబోయేటప్పుడు చూచిన జ్ఞాపకము'

'జ్ఞాపకమేగా!'

'ఏమయినట్లు?'

'నే తీశానంటారా?'

'ఆ మాట నేనంటానా'

'మనిద్దరమేగా యింట్లో ఉన్నది'

'నా జేబు నే తడుముకోనుగదా.'

'అయితే నే తడుముతానా.'

'ఏమో చీకట్లో.'

'ఎవరన్నా వింటే నవ్వుతారు.'

'నవ్వినవాళ్ళపళ్ళే బయటపడుతవి.'

'డబ్బులు పోయినట్టేనా.'

'పోక ఇంకెక్కడ ఉన్నవి.'

'ఏమాత్రము?'

'రెండయిదురూపాయల నోట్లు, చిల్లర.'

'కబ్బులో ఎవరికన్నా యిచ్చి మరచారేమో.'

'క్లబ్బుకుపోయి ఎన్నాళ్లయింది.'

'ఎందుచేత?'

'వచ్చేది పొట్టకూ, బట్టకే చాలటంలే.'

'ఎవరెక్కువ వచ్చారు?'

'ధరలు ఆకాశాన్నంటుతున్నవి.'

4

'పాలమనిషి డబ్బులడుగుతున్నదండీ.'

'అప్పుడే నెలయిందా!'

'అయి నాలుగ్రోజులయింది.'

'ఏమాత్రము ఇవ్వాలేమిటి?'

'పది చిల్లర.'

'ఈ నెల చాలా ఎక్కువయిందే!'

'మీరా మాటనకుండా ఇచ్చిందేనెల్లో!'

'ఇద్దరికీ ఇంతఖర్చా?'

'అయితే నేనేమి చెయ్యను?'

'ఖర్చులు తగ్గించుకోవాలి.'

'తిండి మానుకోమంటారా?'

'నేనామాటన్నానా'

…   …   …   …

'లెక్క సరిగా చూచావా?'

'ఒకటికి రెండుసార్లు.'

'పాలు పెరుగు బాగుండటంలే.'

'అంతకంటె ఈరోజుల్లో ఎవరూ బాగా పోయరు.'

'పోయిన నెలలో నేగదా గేదెలీనింది.'

'అయితే వచ్చేనెలనుండి, మీకే వేరేమనిషిని మాట్లాడండి.'

5

'బొగ్గులమనిషి తిరిగిపోతున్నాడండీ'

'ఎందుకు'

'రెండుబస్తాలకు డబ్బు లివ్వాలి'

'రెండో బస్తాయెప్పుడేయించుకున్నావు'

'ఒకబస్తాయే మరి యిన్నాళ్ళొచ్చిందనుకొన్నారా'

'ఇంకేమీ లేవా'

'ఇకా రెండురోజులకేమున్నా వస్తవేమో'

'ఒకబస్తాకే డబ్బులివ్వాలనట్లు జ్ఞాపకమే'

'ఎవరు'

'బొగ్గుల మనిషి'

'ఎప్పుడు?'

'నిన్ననో, మొన్ననో'

'సరిగా లెక్కకట్టుకోలే కేమో తిక్కలివాడు'

'ఎవరు, నేనా'

'ఎంతమాటలు, నే నలా ఎప్పుడన్నా అన్నానా'

'ఇప్పుడంటంలే?'

'మిమల్ని గాదంటినిగా'

6

'ఎదురింటి పిన్నిగారికి చిల్లరడబ్బులివ్వాలండి'

'ఎందుకు'

'చేబదులు'

'ఎప్పుడు'

'మొన్న మీరూళ్లో లేనప్పుడు తీసుకొన్నా'

'అంతవసరమే మొచ్చింది'

'అవసరమే వచ్చింది'

'ఎవరికి'

'నాకే'

'ఎందుకు తీసుకొన్నావు'

'రిబ్బన్లు చౌకగావస్తే తీసుకొందామని'

'మొన్న నెల్లో నన్నడిగితీసుకొన్నావుగా'

'కొనలేదుగా'

'ఏంచేశావేమిటి'

'అయిపోయాయి.'

'ఏమైనాయి?'

'ఎవరికి జ్ఞాపకముంటది ఎన్నని!'

'జ్ఞాపకముంచుకోవాలి'

'వచ్చేనెలనుండి రాసిపెడతాలెండి' ★

సి. హెచ్. వెంకటేశ్వర్లు

బ్రిటన్‌లో వైద్యసదుపాయాలు :

వాడవాడకీ సేవచేసే నర్సులు

ప్రతిరోజూ ఉదయం ఎనిమిదిన్నర అయ్యేటప్పటికల్లా ఏన్స్ఫాడ్ అనే నర్సు తన మందుల సంచీ చేతిలో తగిలించుకొని తన తనిఖీకి బయలుదేరుతుంది. అయితే బ్రిటిషుదేశంలో ఉన్న ఆ కౌన్టీ పేటలో ఆమె అందరికీ బాగా తెలిసినటువంటి వ్యక్తి. పల్లెలలోని పిల్లలంతా ఆమెను చూసి చిరునవ్వుతో అభివాదంచేసి పలుకరిస్తూ ఉంటారు. ఆ ప్రాంతంలోని కుటుంబాలకు ఆమె నర్సు, మిత్రురాలు కూడాను.

ఆ పేటలో పనిచేస్తున్న ఐదుగురు నర్సుల లోను ఏన్స్ కూడ ఒక నర్సు. అక్కడ జబ్బు పడ్డవాళ్లు, వైద్య కార్యాలయం మొదలైనవాటి 80 వేలమంది వరకు నివసిస్తున్నారు. వారిలో ప్రతి ఒక్కరికి కూడ, ఈ ఐదుగురు నర్సుల లోను ఎవరినుండైనాసరే సేవలను పొందటానికి హక్కు అవకాశము ఉన్నది.

ఉచితసేవ

బ్రిటన్‌లో అన్ని ప్రాంతాలందుకూడా - గ్రామాలు, పట్టణాలలోని అన్ని వర్గాల ప్రజలకు కూడ - ఈ జిల్లా నర్సింగ్ సేవాశాఖ పనిచేస్తున్నది. 1948 లో జాతీయ ఆరోగ్య సేవాశాఖ ఏర్పాటు అయినప్పటినుంచీ వారందరికీ ఈ నర్సింగ్ సేవాశాఖ సహాయం ఉచితంగా లభిస్తున్నది.

ఏరోజునైనాసరే ఉదయంపూట, నర్సు ఏన్స్ కనీసం డజనుమంది రోగులనైనా చూడటానికి వెళ్లుతుంది. వీరిలో చాలమంది మంచం పట్టినటువంటి రోగులే. ఆమె మొట్టమొదట చూసేరోగి, 88 సంవత్సరాల వయస్సుగల ఒక వృద్ధ స్త్రీ. రెండు సంవత్సరాలనుంచీ ఆమె ఈ రోగికి సేవచేస్తున్నది. అక్కడకు వెళ్లగానే రోగికి స్నానంచేయించి, దుస్తులు మార్చి, పడక సరిచేసి, 88 సంవత్సరాల వృద్ధుడైన ఆమె భర్తను కుశలప్రశ్నలు వేసి, అక్కడనుంచి మరొక రోగిఇంటికి వెళ్లుతుంది. అక్కడ అవసరమైన పరిచర్యలు చేసిన అనంతరం ఇంకొక ఇంటికి వెళ్లి, అక్కడ రొమ్ముపడిసెము వ్యాధితో బాధపడుతూన్న యువతి పరిస్థితిని పరిశీలిస్తుంది. ఆ ఇంటిలో ఆ యువతి మినహా మరెవ్వరూ లేరు. అందుచేత రోగికి స్నానం చేయించిన తర్వాత, ఒక వేడి పానీయాన్ని కూడ తయారుచేసి ఇస్తుంది.

‘ఎనిడ్’ జీట్లిన్’

నర్సు విధ్యుక్త ధర్మాలలో మరొకటి తన పని చక్కగా సాగడానికి రోగి, వారి కుటుంబాలు కూడ ఏవిధంగా సహాయపడగలరో వారికి బోధించటం. అందుచేత, ఇంజక్షన్ గొట్టాలు, గాయాలకు కట్టే గుడ్డలు మొదలైనవాటిని ఎట్లా శుద్ధిచేయాలో, రోగి మంచంలో ఉండగానే పడకను ఎట్లా మార్చాలో, శక్తిలేనిస్థితిలో నున్నవారికి ఎట్లా సహాయపడాలో చేసి చూపించుతుంది. అక్కడనుంచి ఆమె వెళ్లేది, కొద్దిరోజుల క్రిందటనే ప్రసవించిన ఒక యువతి ఇంటికి. ఆ జిల్లా నర్సులజట్టులోని ఇతర నర్సుల మాదిరిగానే ఏన్స్‌కూడ మంత్రసాని పని తెలుసును. తను మామూలుగా చూసేరోగులతోపాటు డాక్టరుచే వైద్యంచేయించుకున్న గర్భిణీస్త్రీలకుకూడ ఆమె పరిచర్య చేస్తుంది. అవసరమైనప్పుడు పురుడుపోస్తుంది. ప్రసవానంతర్యాన తల్లిని బిడ్డను కూడ ఒకటి రెండు వారాలపాటు కనిపెట్టిచూస్తుంది.



అఖిలభారత రాష్ట్రభాషా పరీక్షలో తృతీయస్థానం సంపాదించిన శ్రీమతి కె. పద్మావతమ్మకు, మదనపల్లి హిందీ ప్రేమీ మండలి వార్షికోత్సవంలో ప్రత్యేక బహుమతి ఇచ్చారు.

అంతేకాకుండా, నర్సు ఏన్స్ రాత్రిళ్లు కూడ రావలసివస్తుందని చెప్పవచ్చు. అయితే, ఈ రాత్రులందుకని అన్నది, ఏదో అసాధారణ పరిస్థితుల్లో తప్ప, సాధారణంగా ఉండదు.

సాధారణంగా ఉదయంపని ముగిసిపోతుంది. సాయంకాలంకూడ ఆమె రోగులను చూడటానికి వెళ్ళి, అవసరమైనవారికి ఇంజక్షన్లు ఇవ్వటం, గాయాలకు కట్లుకట్టటం మొదలైన పన్లు చేస్తుంది. ఇంతపని చేస్తున్నా ఆమె ఎప్పుడూ చిరునవ్వుతోనే ఉంటుంది. ఇట్లా చిరునవ్వుతో ఉండటంకూడ ఆమె పనిలో ఒక భాగమే. రోగులు ఆమెకు తమ కష్టాలు చెప్పుకొంటూరు. అలాగునే మధ్య తప్పిన తగాదాలలోకూడ ఆమె సలహా కోరుతూంటారు. లేదా తల్లి ఆస్పత్రిలో నున్నప్పుడు, బిడ్డను చూడటానికి ఎవరైనా కావాలని అడుగుతూంటారు. అటువంటప్పుడు బిడ్డ సంరక్షణభారాన్ని స్వీకరించేటు వ్యక్తిని ఎవరినైనా ఆ కుటుంబానికి పరిచయంచేస్తుంది. లేదా ఈవిషయంగా సహాయపడటానికున్న సాంఘిక సంస్థలకు ఈ విషయాన్ని తెలియజేసి, సహాయం లభించేటట్టు చూస్తుంది. తాను నర్సుగా ప్రత్యేక శిక్షణ పొందుతున్నప్పుడు, ప్రజాసేవ చేయటానికి ఏర్పడ్డ అనేక సాంఘిక సేవాసంస్థలనుగురించి ఆమె తెలుసుకొనిఉంటుంది.

ఎవరైనా రోగి స్వంతఇంటిలోనే చికిత్స జరగాలని డాక్టరుగాని, ఆస్పత్రివారుగాని అనుకొన్నప్పుడు, వారు జిల్లా నర్సు సేవను అపేక్షించుతారు. వారి ఆదేశాలను నైపుణ్యంతో నెరవేర్చటంలోను, రోగి పరిస్థితిలో అకస్మాత్తుగా మార్పు ఏదైనావస్తే అప్పటికప్పుడు వారికి తెలియజెయ్యటంలోను, ఆమె సమర్థంగా పనిచేస్తుందని వారికి తెలుసు. నర్సులు లేకపోతే, డాక్టర్లమీద, ఆస్పత్రులమీద వత్తిడి ఎంతో ఎక్కువగా ఉంటుంది. ★

చల్లని చూపు, చల్లని మాట

ఎ. పార్వతి

ఆస్పత్రిలో ప్రతివారు కొన్నో, కొన్నో, అవస్థలు అనుభవించినవారే ఈ రోజుల్లో. ఇంచుమించు గవర్నమెంటు ఆస్పత్రులన్నీ, ప్రతీవూళ్లో ఒకదానికొకటి, తీసిపోకుండానే వున్నాయి. చాలామంది అస్పత్రి అంటే, భయంకొద్దీ, రోగాలు పెద్దవయ్యేవరకు, నిర్లక్ష్యం చేస్తారు.

మన దురదృష్టంకొద్దీ, చల్లగా చూడవలసిన నర్సులు, డాక్టర్లు ఇలా ప్రవర్తిస్తున్నారుగాని, ఇదే పాశ్చాత్యదేశాలలో నర్సుపని అంటే, ఎంతో భక్తిశ్రద్ధలతో చేస్తారు. రాజకుటుంబాలవారు సైతం, తమ చివరకాలాన్ని, రోగుల సేవలోనే, గడపడానికి నర్సులుగా చేరతారు. నర్సు వృత్తికి ఈ గౌరవస్థానం కల్పించిన, మహిళ ఫ్లారెన్స్ నైటింగేల్. స్త్రీ సహజంగా మాతృస్వరూపిణికదా! ఆపడ ఒకసారి తన్నుతాను పరిశీలనచేసుకొని, ప్రతిరోగిని, తన అన్నతమ్ములవలెనో, అక్కచెల్లెళ్ళవలెనో భావించి చూడడం నేర్చుకున్ననాడు ఈ అవస్థ రాదు.

రోగస్థితిలో వున్నవారికి మందుకన్న ముఖ్యమైనవి, చల్లని చూపు, చల్లని మాట. అమృతహృదయులైన వారి, ఆ పరిచర్యవల్లనే, సగం ఉత్సాహం కలుగుతుంది. ఇప్పుడిప్పుడు నూతన విజ్ఞానంతోపాటు, ఆస్పత్రులలో, రోగులకు విసుగులేకుండా వుండేందుకు, మనస్సుకు సంతోషంగా వుండడంవల్ల జబ్బు చప్పున నయమౌతుందనే వుద్దేశంచేత, గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. మంచి గ్రంథాలు, సంతోషంగా వుండేవి చదవడంవల్ల, రోగుల మానసికస్థితి బాగౌతుంది. 'కాలిఫోర్నియాలో' కొత్తరకం ఆస్పత్రి ఉంది. ఇది చూడటానికి ఆస్పత్రిలా కాక, నందనవనంలా వుంటుందిట. చక్కటి జలయంత్రాలతోను, పువ్వులతోను, కలకలలాడుతూ చిరునవ్వులు చిందించే ఉద్యోగులతో ఆనందం, ఉత్సాహం కలిగించే ఆ వైద్యాలయం, ఆనందనిలయమే కదా!

ఆస్పత్రులు, గవర్నమెంటు పెట్టడం, ఒక ఎత్తు. సక్రమంగా నడిపించడం ఒక ఎత్తు. పైన పర్యవేక్షణకు జీతాలకోసం, వుద్యోగంక్రింద భావించి వచ్చినవారికన్న, ఏవూరికి, ఆవూరు ఆస్పత్రుల మీద, అధికారిగా, ప్రజలలో తనకునచ్చిన వ్యక్తిని ఎన్నుకుని, ఇంతకాలం అని అవ్యక్తి మళ్లీ ఎన్నికవచ్చేదాకా వుండేట్టు ఎన్నుకోవాలి. ఎన్నుకోవడంలో, సాంఘికసేవయందు, అభిరుచివున్నవారిని, కార్యదక్షత గలవారిని, గౌరవనీయంగా ఈపనినిభావించే వ్యక్తిని ఎన్నుకోవాలి. అతను తన చేతిక్రింద కొంతమంది, సాంఘిక సంక్షేమ, కార్యకర్తలను వేసుకుని, అధికార, అనధికార, ఆస్పత్రులలో, రోజూ రోగులకు సరియైన మందు అందుతున్నదో లేదో, అర్జెంటు కేసులకు, సకాలంలో, సరియైన వైద్య సహాయం దొరుకుతున్నదీ లేనిదీ, జాగ్రత్తగా గమనించాలి. అంతేగాని, ఇప్పటి పద్ధతిక్రింద, పెద్దఉద్యోగస్థులకి బాధ్యత లేక, చిన్నవారికీ లేక, చిటికోసం ఆస్పత్రిలో 8 రోజులుతిరగడం, మంచిమందులు వుంచుకుని, నీళ్లుకలిపి పోస్తూ వుండడం, డబ్బు ప్రైవేటుగా ఇచ్చినవాళ్ళనే ముందు చూడడం, ఇవన్నీ మాయమవాలి. బాధతో ఏడుస్తూవచ్చిన మనిషి, మనవల్ల నయమై సంతోషంతో ఇంటికి వెళ్తున్నాడంటే, అతను మనకు కృతజ్ఞత చెప్పి, మనకేసిచూసే ఆకళ్ళల్లోని విలువను గ్రహించగలుగుతే, ఎంత ఆనందంగా వుంటుంది. ఇంతకీ ఎంత చెప్పినా, డాక్టర్లెమిటి, నర్సులేమిటి, సేవాభావం, ఓర్పుకలిగివున్నవారిని తప్ప, అందరిని తీసుకోకూడదు. పరీక్షలకి ఇదికూడా ఒక గీటురాయి కావాలి. అసలు ఏమిటంటే ఈ రోజుల్లో ప్రతివారు, డాక్టరు చదవడంవల్ల ఎక్కువడబ్బు సంపాయించవచ్చుననే ఉద్దేశంకొద్దీ చదువుతున్నారు. ఆ డబ్బుకోసం, పేరుపడిన డాక్టరవుతే, విజిటింగు ఫీజే చాలు ఇచ్చుకోవాలి. గవర్నమెంటు ఆస్పత్రిలో అవస్థలన్నీ పడలేక, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్ళామా, మందులు, ఇంజక్షనులూ, అయి మనరోగం తగ్గేసరికి, ఆ బిల్లునుంచి కోలుకోవడం కష్టం. ఏమైనా, స్వతంత్ర భారతదేశంలో డబ్బు వెదచల్లలేనివారికి డాక్టర్లతో బాధగానేవుంది. ★

మామిడికాయతో

ఆంధ్రవారపత్రిక వనితాలోకంలో కొన్ని కొన్ని జామ్‌లు చేసేపద్ధతి కొంతమంది మన సోదరీమణులు వ్రాశారు. అవిఅన్ని చేసిచూచాము. చాలా బాగాకుదిరినవి. ఈసారి ఇంకొక్రొత్తరకం నాకు తెలిసిన జెల్లీ వ్రాస్తున్నాను. దీనిని మామిడికాయతో చేసుకోవాలి. ఈకాలంలో ఎక్కువగా దొరుకుతాయి కనుక వాటినిగూర్చి ప్రయాస వుండదు. పైగా ఇది చాలా సులువుగా ఎక్కువ ఖర్చులేకుండానే తయారవుతుంది. దీనికికావలసినవి:— (1) మంచి పుల్ల మామిడికాయలు నాలుగు, సామాన్యంగావుండాలి (అంటే మరీపెద్దవీకావు, చిన్నవికానివి అన్నమాట) (2) అర్ధసేరు చక్కెర.

ఇది చేయువిధానం:—ముందు మామిడికాయలు చెక్కుతీసి ఉంచాలి. ఒక్క స్టెయిన్‌లెస్ స్టీలు గిన్నెకాని, అల్యూమినియం గిన్నెకాని తీసుకుని అందులో ఈకాయలు మునిగేంతనీరుపోసి మరగనిచ్చి, దానిలో ఈ చెక్కుతీసిన మామిడికాయలు వేసి ఉడికించాలి. 15 నిముషములు వుడికిన చాలును. వాటిని తీసి చల్లారనిచ్చి మరిఒకపాత్రలోనికి గుజ్జుమాదిరిగా చేసుకోవాలి. దానిలో కొంచెం నీళ్లుపోసి పలుచనగునట్లు చేయాలి. దీనిని వడగట్టిన బాగుగానుండును. జల్లెడతో కూడ సులువుగా వడగట్టవచ్చును. అప్పుడు అర్ధసేరు చక్కెరను తీగపాకంలాపట్టి దానిలో ఈగుజ్జును వేయాలి. అది తొందరలోనే దగ్గరపడుతుంది. అది దించి చల్లారనిచ్చి ఒకసీసాలోపోసిన చాలాదినములు నిల్వవుంటుంది. దీనికికూడా అమ్లాజామ్‌మాదిరిగ ఒకవిధమైన వస పురంగువచ్చి చాలా రుచిగా వుంటుంది. వేసవికాలం కనుక దోసెల్లోకి, పూరీలలోకీ, రొట్టెలలోకీ బాగుంటుంది.

ఉత్తరాలు:

ఆస్పత్రిలో అవస్థలు

క్రిందటివారం ఒక సోదరీమణి ఆసుపత్రి అనుభవము వ్రాసియున్నారు. వాళ్ళ వూరిలోనే కాదు, ఆంధ్రదేశంలో ప్రఖ్యాతి గాంచిన ఒక పెద్ద ఆసుపత్రిలో నా అనుభవము వ్రాయుచున్నాను. అక్కడ కొన్ని వార్డులలో పరిస్థితులు మరీ అన్యాయంగా ఉన్నాయి. ఇక్కడ ఎందుకు చేరామురా భగవంతుడా అనిపించేలా ఉన్నాయి. ఇంటి పెద్ద దక్షత లేని కుటుంబాలలో ప్రసవవేదనపడుతున్న స్త్రీలను, మగవారు ఆసుపత్రి సుఖముకదా అని భార్యని అక్కడ చేర్పించి బయట చెట్లక్రింద కూర్చుంటారు.

ఇక గర్భిణీస్త్రీని కాన్పులగదిలోకి తీసుకువెళ్తారు. మగవాళ్ళు దూరముగా కనుపడుతూవుంటే, ఆయావచ్చి, యిచ్చట మగవారుండకూడదు, అని చెప్పి వాళ్ళని పంపివేస్తుంది. అక్కడ అంతా ఆడవాళ్ళే ఉంటారు అని అనుకుంటాముగాని, తీరా అక్కడికి వెళ్ళితే, మగ డాక్టర్లు ఉంటారు. వాళ్ళు నిజానికి పట్టా ఉన్న డాక్టర్లుకూడ కాదు. చదువుకుని, కాబోయే డాక్టర్లట. అగ్నిసాక్షిగా, పెండ్లియాడి, అర్ధభాగమైనపతిదగ్గర ఉంటేనే, ఆ సమయములో, సహించలేని సిగ్గు, బాధ పడే హైందవ స్త్రీకి అన్యపురుషుడు పురుడుపోయటం ఎంత అసహ్యం, చిరాకు, బాధ కలిగిస్తుందో చెప్పలేము. అంతకంటె ఆత్మహత్య చేసుకున్నా ఫరవాలేదు అని అనుకుంటుంది.

ఇదివరలో కానుపు కష్టమైనపుడు ఎంతో అవసరమైనపుడుమాత్రమే క్వాలిఫైడ్ (పట్టాపుచ్చుకున్న) డాక్టరువచ్చి పరిస్థితి తెలుసుకుని పద్ధతి చెప్పేవాడు. అప్పుడు లేడీ డాక్టరు పురుడుచేసేది. ఇప్పుడు ఇలా జరగడానికి కేవలం, వారి నసవలసిన పనిలేదని అచ్చటిపరిస్థితులబట్టి అనుకోవలసివస్తోంది.

కారణము, భారతనారీమణియు, ప్రజాసేవికయు, తోటి స్త్రీరత్నము అయిన "నర్సు" (Nurse) వైఖరియే అనిన మనము సిగ్గుచే తలవంచుకోవలసి వస్తున్నది.

వారు కాబోయే మగడాక్టర్లు అనవసరంగా కాన్పులగదిలోనికి వచ్చుటకు వీలులేదని చెప్పవచ్చు. చదువు సాకుగా చెప్పి, నోరులేని మధ్యతరగతి స్త్రీలను ఇబ్బంది పెట్టడం, మనస్సు నొప్పించడం మంచిదికాదు. భాగ్యవంతులకు ఎక్కడా బాధలేదు. ఇది చెప్పుకొనుటకు వీలుకాని విషయము. ఎవరికివారు, చెప్పుకున్న సిగ్గు, చెప్పకున్న బాధ ఇకముందైనా అధికారులు, స్త్రీలకు పురుషులచే పురుడు పోయించే పద్ధతులు మానుతారని ఆశించుతున్నాను.

ఒక సోదరి.

* * *

అడిగితేచిరాకు లేదా పరాకు

ఆంధ్ర వారపత్రిక (24-4-57) వనితాలోకం శీర్షిక క్రింద శ్రీమతి పాకల సీతమ్మగారు వ్రాసిన "ఆస్పత్రిలో అవస్థలు" చదివితే, నా మేనకోడలు ఆస్పత్రిలో పడ్డ బాధలు జ్ఞాపకము వచ్చినవి.

నా మేనకోడలుని ప్రసవానికి గవర్నమెంటు ఆస్పత్రిలో చేర్చినాము. అక్కడ నర్సులు, మరియు పనివారు పెట్టిన బాధలు, అన్నమాటలు, పడరానివి వినరానివి. రోగస్థులమీద వారికి దయ లేనేలేదు. రాత్రులు మంచినీళ్లకి నర్సుని పిలుస్తే ఆవిడ గునుసుకుంటూవచ్చి నీళ్లు ఇస్తూ "ఎందుకు పెళ్లిళ్లు చేసుకోవాలి, బిడ్డల్ని ఎందుకు కనాలి, మమ్మలని చంపుకు తింటానికే కామోసు" అని అనేదట. పాకీది వచ్చి కసురుకుంటూ మాటలాడేది. ఈ సంగతి పెద్ద డాక్టరుగారికి చెబితే ఆయన మొదట్లో వినిపించుకోలేదు. రెండు మూడు సారులు మావారుకూడ డాక్టరుగారితో ఈ సంగతి చెప్పారు. దానికి ఫలితంగా డాక్టరుగారు పాకీదానిని మందలించారు. బెదిరించారు. కానీ నర్సుని ఏమీ అనలేదు. దీనికి ఫలితంగా పాకిది ఆ రోజు నుంచి ఆ గదిని ఊడవడం మానేసింది. తరువాత బిడ్డని స్నానానికి సరిగా తీసుకెళ్లేవారు కారు. రాత్రులు పిలిచినా ఎవరు వచ్చేవారు కారు. మళ్లీ ఈ సంగతులు డాక్టరుగారికి రిపోర్టుచేస్తే ఇంక ఏమి అవస్థలు పెడతారోనని ఊరుకున్నాము. ఈ ఇబ్బందులు భరించలేక రోజు నా మేనకోడలు కంటతడి పెట్టుకునేది. ఏదో ఓదార్చేవాళ్లం. ఇకముందుప్రసవానికి గవర్నమెంటు ఆస్పత్రికి వచ్చినా వెళ్ళను అని తన బిడ్డమీద ఒట్టు పెట్టుకుంది.

ఈలాగున్నాయి మన ప్రభుత్వ ఆస్పత్రులలో రోగుల సుఖాలు.

పుట్టా సీతాబాయమ్మ.

* * *

అర్జెంటు కేసులా, ఆదివారాలా

ఆంధ్ర వారపత్రిక (24-4-57) వనితాలోకం శీర్షిక కింద పాకాల సీత (ఏలూరు) గారు వ్రాసిన 'ఆస్పత్రిలో అవస్థలు'—అన్న వ్యాసంతో నేను అక్షరాలా ఏకీభవించుచున్నాను. ఈ మధ్య మా అక్కగారు అస్పత్రిలో చాల అవస్థలుపడినది. ఇక పది రోజులకు ప్రసవించుతుందనగా శరీరమంతా వాచినది. తట్టి పోసినది. మాకు ఏమిచేయుటకు తోచలేదు. ఆరోజు ఆదివారం. ఆస్పత్రిలో చేర్చుకోము అన్నారు. మరుసటి రోజు డి. ఎం. ఓ. వచ్చేంతవరకు వుండి అటుతర్వాత మా అక్కను ఒకగదిలో చేర్చినాము. ఆ రూము ఎంతో అసహ్యముగానున్నది. ఆ రూమును మేమే శుభ్రపరచినాము. మా అక్క రూముకు ఏ డాక్టరుగానీ, నర్సుగానీ వచ్చి చూడలేదు. మా బావగారు పదేపదే డాక్టరును కలుసుకోగా ఆయనవచ్చి చూడగా లాభంలేదన్నారు. మా బావగారికి ఏమీ తోచలేదు. మా అన్నగారు డాక్టరు అగుటచే వెంటనే అక్కడినుండి ఆంబులెన్సులో ప్రొద్దుటూరు తీసుకొనివచ్చి, తగినమందు లిచ్చినారు. ఇచ్చటికి వచ్చిన ఆరురోజులకు మా అక్క ప్రసవించినది. ప్రసవించిన రెండురోజులకు బిడ్డ చనిపోయినది.

ఈ రోజుల్లో కాస్తో, కూస్తో వున్నవారంతా దమ్మిడీ ఖర్చుగాదనే వుద్దేశ్యంతో ఏ రోగం వచ్చినా; కాన్పైనా ఆస్పత్రిలో చేర్పించుచున్నారు. అక్కడ పరిస్థితులుచూస్తే ఇలా ఉన్నాయి.

శెట్టిపల్లి లక్ష్మీనరసమ్మ.

* * *

ముఖ్యమైనవి

17-4-57 తేదీ పత్రికలో, పొత్తూరు సీతామహాలక్ష్మిగారు వక్కపొడి తయారు చెయ్యడం చెప్పేరు. వక్కపొడికి కావలసిన దినుసులలో, ముఖ్యమైన ఏలకులు, లవంగాలు, దాల్చినిచెక్క ముఖ్యంగా వేసి తీరాలి. ఇవి వేయకపోతే, వక్కపొడికి, కావలసిన ఘుమఘుమ రానేరాదు.

వక్కపొడి చేసుకోడానికి ఓపికలేని వారు సహితం, తమలపాకులలో రెండు వక్కలతోపాటు, ఒక ఏలక్కాయ, లవంగంమొగ్గ వేసుకుంటారు. సీతామహాలక్ష్మిగారు, మరచిపోయి వాటిగురించి రాసివుండరని తలుస్తాను.

ఆర్. హేమాదేవి (ఢిల్లీ)

* * *

మరొకపద్ధతి

పి. సీతామహాలక్ష్మిగారు వ్రాసిన "వక్కచూరతయారీ" చదివాను. ఆమె వ్రాసినట్లు కడగటం, ఎండబెట్టటం, వేయించటం పద్ధతి కొంచం కష్టమేమో. వక్కపొడి తేలికగా మరికొన్ని సుగంధ ద్రవ్యాలతో చెయ్యవచ్చు. బజార్లో కొన్నదానికంటే రుచిగానూ వుంటుంది. ఖర్చూ తక్కువ.

కావలసినవి:- వక్కలు ఒక వీశె, యాలక్కాయలు 3 తులాలు, లవంగాలు 6 తులాలు, జాపత్రి, కుంకుమపువ్వు, ఎండుకొబ్బరి ½ సవాశేరు, పచ్చకర్పూరం, జాజికాయ ఒకటి, నెయ్యి 4 టీస్పూన్లు.

చేసే విధము:- వక్కలు పెద్ద పలుకులు కాకుండానూ, మరీ చిన్నవి కాకుండానూ కొట్టి అట్టేపెట్టాలి. యాలక్కాయలు, లవంగాలు యిష్టమున్నవాళ్లు మెత్తగా కొట్టచ్చు, లేకపోతే కచ్చాపచ్చాగా తొక్కిపెట్టుకోవాలి. జాపత్రి, కుంకుమపువ్వు కొద్దిగా కొట్టి తీసెయ్యచ్చు. జాజికాయ మెత్తగా పొడుం చెయ్యాలి. కొబ్బరి తురిమిపెట్టుకోవాలి. తురిమేప్పుడు జాగ్రత్తగా తురిమితే కోరు సన్నగా, పొడుగ్గా, బాగా వస్తుంది. నెయ్యి కరగబెట్టి వుంచుకోవాలి.

పెద్ద పళ్లెంలో కొట్టిన వక్క పలుకులు పొయ్యాలి. లేకపోతే కలపటానికివీలుండదు. అందులో ముందుగానే కొట్టి పెట్టుకున్న లవంగాలు, యాలక్కాయలు, జాపత్రి, కుంకుమపువ్వు, జాజికాయపొడి, కొబ్బరికోరు వేసి కలపాలి. 2 స్పూన్ల నెయ్యి వేసి వక్కపొడి బాగా కలపాలి. బాగా కలిశాక మిగతా నెయ్యి కూడా వేసి కలపాలి. అట్లాగనుక కలిపితే నెయ్యి వక్కపొడికిపట్టి సువాసనగా వుంటుంది. పచ్చకర్పూరం చేత్తో నలిపితే మెత్తగా అవుతుంది. అది వేసి బాగా కలిసేటట్లు కలిపి శుభ్రంగా తుడిచిన డబ్బాలో పోసి మూతపెట్టుకుంటే వాసన పోకుండావుంటుంది. పచ్చకర్పూరం ఇష్టంలేనివాళ్లు పిప్పరమెంటు పువ్వు వేసుకోవచ్చు. ఇదికనుక వక్కపొడిలో వేస్తే అదోవిధమైన ఘాటుగా వుంటుంది.

ఎం. కమల (గుడివాడ)

* * *

డిగ్రీల ఉపయోగాలు

ఈ వారం బి. ప్రేమలీలగారు వ్రాసినట్లుగా ఈ B. Sc, M. Sc డిగ్రీలు స్త్రీ కుటుంబవ్యవహారాల్లో ఎందుకూ వుపయోగపడడం లేదు. నాసంగతి చూస్తే నేను మొన్ననే B. Sc కెమిస్ట్రీ మెయిన్‌తో పరీక్షలు వ్రాశాను. ప్యాసుఅయితే B. Ed అన్నా చదవాలి, లేదా ఏదైనా నౌకరీ అన్నా చేయాలి. వివాహమైన తర్వాత ఎంతమంది భర్తలు తమ భార్యలను వుద్యోగం చెయ్యనిస్తారు. పోనీ వొప్పుకుంటారే అనుకోండి, పిల్లల సంరక్షణ చూసుకుంటుందా? లేక వుద్యోగం చేస్తుందా?

ఉద్యోగం చేయకపోతే పొయ్యిదగ్గర కూర్చుని ఈ క్వేషన్సు వేసుకోవాలా? లేక బట్టలు వుతికేటప్పుడు ఇంతసబ్బుకు యింత నురుగు వచ్చింది. అందుకని ఈ సబ్బులో యింత పర్సెంటు మలినాలు వున్నాయి, లేక ఈ బావినీరు కఠినజలము అని లెక్కలు వేసుకోవాలా? స్త్రీలు ఈ సైన్సు గ్రూపులలో చదివేకన్నా హోమ్‌సైన్సు, వాషింగు, కోళ్ళపెంపకం మొదలగునవి నేర్చుకుంటే వాటివల్ల ఇంటిఖర్చు తగ్గుతుంది. భర్త తెచ్చే నాలుగు జీతంరాళ్లకు యింకొంచెం సహాయం చేసినట్లవుతుంది. అందుకని స్త్రీ విద్యావిధానంలో మార్పులు రావాలి. ఏదోకట్నం తగ్గుతుందికదా అని బి. ఏ. లు చదివించి పెండ్లిండ్లు చేయలేని తల్లిదండ్రులు ఎంతమందో! అటు చదువుకు డబ్బుపెట్టి మరలా కట్నాలు పోయాలంటే మనపెరట్లో కామధేనువులూ కల్పవృక్షాలు లేవుగా. ప్రభుత్వమువారే స్కూలుఫైనలు పూర్తి చేసేలోపల స్త్రీకి గృహకృత్యములకు కావలసినవన్నీ నేర్పిస్తే ఆతర్వాత యిష్టమున్నవారు పైచదువులు చదువుతారు. ఇష్టం లేనివారు అప్పటివరకు చదివిన చదువైనా నిత్యజీవనంలో అమలుపరచుకుంటారు. వుద్యోగం చేసేవారిమాటకాదు, ఇంట్లో వుండేవారిమాట నేను చెప్పేది.

పి. అనసూయ [నెల్లూరు.]

* * *

ఉత్త(రాల) చెత్త

తమరు ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో వనితాలోకములో ఉత్తరాలు అనే శీర్షికక్రింద ఉత్తచెత్త అచ్చువేస్తున్నారు. ఈ శీర్షికక్రింద వ్రాసే విషయాలవల్ల అణగింజలో ఆరసగమైనా ఉపయోగములేదు. అందులో యీ మధ్యను బొత్తిగా ఒకరినొకరు వ్రాత మూలకముగా తిట్టుకోవడము తప్పిస్తే, పనికొచ్చే విషయ మేమీ లేదు.

ఎం. హేమలత (విశాఖపట్టణం)

* * *

ఈ 'చర్చ'లో పాల్గొనేవారు

వనితాలోకం ఉత్తరాల శీర్షికలో చాలామంది మహిళలు అనేక విషయాలను గురించి అనేక వ్యాసాలను వ్రాస్తున్నారు. బాగున్న వ్యాసాలను సమర్థిస్తున్నారు. లేనిచో విమర్శిస్తున్నారు. వ్యాసాలలో ఏమైనా లోపాలువుంటే మృదువుగా నెవిమర్శించడం ఉత్తమం. అలాంటిలోపాలు లేనిచో యింక విమర్శ అవసరమేలేదు.

విమర్శలుకూడా ప్రక్కింటివారు, ఎదురింటివారు అనే ఉదాహరణలతో విసుగును పుట్టించేలా గాకుండా పాఠకులు గ్రహించగలేలా, సబబుగా ఉండాలి. అనవసరంగా ఒకరినొకరు విమర్శించుకొనేలా కాకుండా ఒకరు చెప్పినది మరొకరు విశాలదృష్టితో అర్థంచేసుకొని సహృదయంతో ఈ చర్చలో పాల్గొనేలా వుండాలి.

ఏ. వి. రత్నం,
(గూటాల).

* * *

ప్రతివిమర్శన

ఆంధ్ర వారపత్రికలో వనితాలోకంలో ఉత్తరాలు అనే శీర్షిక పెట్టి తెలుగు వనితల బాలికల రచనాశక్తిని ప్రోత్సహిద్దామన్న ఉద్దేశ్యంతో వారికి ప్రత్యేకించి 2 పేజీల కేటాయించడం ఒక విశేషం.

ఇదేవిధంగా మహిళలంతా తమ అనుభవాలు వ్రాస్తూ, తెలియని విషయాలు తెల్సుకుంటూ మంచి చెడులకు గల వ్యత్యాసాన్ని ఈ ఉత్తరాల శీర్షికద్వారా గమనించాలి.

27-2-57 సంచికలో 'తెగని సమస్యలు, తగని గొడవలు' అని కోటంరాజు కృష్ణవేణి (మద్రాస్) గారు వ్రాశారు. మేము పని మనుషులవల్ల చిక్కులు పడుతున్నామని చెప్పుకోకూడదా?

హిమాయత్ నగర్‌లో శ్రీమంతుల వాడలో పనిమనుషుల ఇబ్బంది తప్పితే తెలుగు నారీమణులకు అర్థంటుగా తెలియాల్సినవి లేవన్నట్లు ఆంధ్ర వారపత్రికలో మనకు

నేటి కథకులు

కొందరు కథలు వ్రాసే వాళ్ళ తీరు చాలా తమాషాగా వుంటుంది. అందులో మగవాళ్ళది మరీను. మొన్న ఒక కథ చదివాను. ఆ రచయిత పేరు ఇప్పటికి అప్రస్తుతము. కాని, రచన చూద్దాము. ఒక బీదయింటి ఆడపడుచు గొప్పయింటి కోడలు అయింది. భర్త కొంచెము పూర్వాచార పరాయణుడు. అంటే యేమీ లేదు. ఆధునికపు అలవాట్లు నచ్చక బిళ్ళగోచీ పెట్టి నిష్ఠ నియమాలతో వుంటాడు. కొత్త కోడలు వచ్చిన యేడాదికే అత్తగారికి హఠాత్తుగా జబ్బుచేసి, ఆరేళ్ళ మరిదిని కోడలుచేతుల్లో పెట్టి వెళ్ళిపోతుంది. ఆ చిన్నమరిదికి తల్లి లేని లోటు కనుపించకుండా మంచిచెడ్డలు చూచి చాలా ప్రేమగా పెంచుతుంది వదినెగారు. ఇంతవరకు కథ సాఫీగానే నడిచింది.

మరిది పెద్దవాడైన తరువాత, భర్తకు దూరమై అతనికి దగ్గరవుతుంది. అదే చివరికి ఇంకొకవిధమైన ప్రేమగామారి, లేచిపోవటం జరుగుతుంది. పచ్చటి సంసారంలో తనే చిచ్చుపెట్టుకుంటుంది. ఇంక పైకథ చెప్ప నవసరము లేదు.

ఈలాంటి కథలను మనకథకు లెందుకు ఊహిస్తారో అర్థంకాదు.

కన్నప్రేమకన్న పెంచినప్రేమ మిన్న అన్నది పరమసత్యంగదా. అలా ఎంతో మమకారంతో పుత్రవాత్సల్యంతో పెంచినప్రేమకు పర్యవసానం ఇదా? మానసిక ప్రవృత్తిని, అర్థం చేసుకొని వ్రాయజాలిన మన రచయిత లిలాటి వృత్తాలను చిత్రించటంలో తమ ప్రతిభను సద్వినియోగం చేయటంలేదని నా అభిప్రాయం. రామాయణ, భారతాలు చదువుకొన్న సంస్కారముకల మన వారి కీలాటి చిత్రణ

వేటూరి వినత

అసంగతంగా పరిహాస్యంగా కనబడుతుంది. అసలు వదినెగారి కీలాటిస్థాన మివ్వాలి? పూజనీయురాలైన మాతృదేవితో సమానురాలు, తల్లి తరువాత తల్లివంటిది. ఆమెను గౌరవించటము లేకపోగా నీచాతినీచంగా చిత్రిస్తున్నారు. ఇదే ఇతి వృత్తంలో, పేరెన్నికగన్న ఒక గొప్ప నవలారచయిత కూడా సృష్టించాడొక నవలని. ఒక స్త్రీ పాత్రని యింతగా ఖూనీచేసి వ్రాయటం పరిపాటి అయిపోయింది. చూడబోతే మన సంఘంలో యిలాంటివి నిజంగా జరుగుతున్నాయా అనిపిస్తుంది. ఇదే శరత్ గచనని చూడండి. వదినెగారికి ఎంత గౌరవ స్థానమిచ్చి పూజిస్తాడో, ఒక స్త్రీపాత్రను సృష్టిస్తే యెంత పవిత్రంగా వుంచుతాడో ఆయనరచన చదివినవాళ్ళకు బాగా తెలుస్తుంది. బహుశః ఆ రచయిత పేరు తెలియనివాళ్లు, ఆయన రచన చదవనివాళ్లు యెవరూ లేరనుకుంటా. ఏదైనా శరత్, టాల్‌స్టాయి, ప్రేమచంద్, భగవతీ చరణవర్మ మొదలగు ప్రముఖుల రచనలు చూడండి యెంత నీతివంతంగా పవిత్రంగా వుంటాయో. మన తెలుగు రచయితలలో పెద్దవాళ్ళమాట అటుంచి, అసలు నేటి యువరచయితల వుద్దేశ్య మేమిటో అర్థంకాదు. కాని, నే ముందు చెప్పిన రీతిగా రచనలు వ్రాయడమువల్ల చదువరులు నేర్చుకోవలసినది ఏమీ కనబడదు. పైగా అనేక విషయాలపై దురభిప్రాయాలు ఏర్పడతాయి. ఈ విషయంలో పురుషుల రచనల కంటే, స్త్రీల రచనలే నయమనిపిస్తుంది. అంటే కథ వ్రాసే పద్ధతి చాలా గొప్పగా వుంటుందని కాదు నే చెప్పేది. ఎప్పుడూ కూడా వారు కథావస్తువును మంచిదిగానే తీసుకుని వ్రాస్తారు. రచనలు సాగించేవారెవరైనా సరే, ఒక కథను వ్రాయ మొదలు పెడితే పాఠకులకు మంచి గుణపాఠాన్నిచ్చే టట్లుగా వుండాలని నాకోరిక.

గుఱ్ఱంలాటిది మనస్సు. అది చెడ్డదే కావచ్చు. మంచి మార్గాన్ని తప్పించనూ వచ్చు. కానీ దానికి కళ్ళెంలా నిగ్రహం కావాలి. పై చెప్పిన కథ ఆ మనస్సులాటిదే. అయినా దానికి కళ్ళెం కావాలి. అది లేనినాడు గుఱ్ఱం యెక్కడికో దూసుకు పడిపోతుంది. ★

★ ప్రతివిమర్శన ★

కేటాయించిన పేజీలు వీటితో నింపడం అనవసరం అని ముగించారు. మరి దేనితో నింపడం అవసరం? తెలియని తెలుగు నారీమణులకు తెలియజేయడం మంచిది కాదా? ఎవరి అనుభవాలను వారు రాస్తూవుండటం అనవసరమా? ఉత్తరాలు, శీర్షికలు, ఒక్క పనిమనిషి గురించి మాత్రమే వ్రాయడంలేదుగదా? బహుశా ఈ విషయం కృష్ణవేణిగారు మరిచారనుకుంటా. "మంచికి చెప్పినా", "హద్దుమీరి అలవాట్లు", "పిల్లలపట్ల మన ప్రవర్తన", "ఆవుపాలు మంచివా కావా?" "ఆత్మ విమర్శన" వగయిరాలు ఎవరికి తోచినవి వారు రాశారు. పిల్లలు పెద్దలెలా చేస్తే అలా చేస్తారని వ్రాయడం అనవసరమా? ఆవుపాలు మంచివో కావో తెలియనివారు తెలిసినవారిని అడగడం అనవసరమా? తెగని సమస్యలు తగని గొడవలు అని వూరుకుంటారా? సాధ్యమైనంతవరకు సమస్యా పరిష్కారమార్గం ఆలోచించాలి. ఎవరయినా తమకు తోచిన అభిప్రాయాలతో అందరూ ఏకీభవిస్తారనుకోవడం చాల పొరపాటు. అలా అని కొందరైనా ఏకీభవించరనుకోవద్దు. కొందరు బాగుంది అంటారు. ఇంకొందరు బాగులేదు అని రాస్తూ ఎందుకు బాగులేదో చెప్తారు. ఇలా ఒక్కొక్క విషయంమీద నలుగురూ అభిప్రాయాలు రాస్తే అప్పుడు దాంట్లో మంచి చెడ్డలు ఎవరిమట్టుకు వాళ్ళకే తెలుస్తాయి. అలా అభిప్రాయాలు తెలిపితే అందులో తప్పేముంది?

టి. స్వర్ణ, [కొల్లాపురం]


పంజాబ్‌లో కొన్ని వంటలు

(36-వ పేజీ తరువాయి)

వంకాయలు కాస్త పెద్దవిగా చూచి తెచ్చి నిప్పులమీద కాల్చి తొక్క డుల్చి వెయ్యాలి.

రెండు పెద్ద ఉల్లిపాయలు సన్నగా తరిగి, అల్లం, పసుపు, జీలకర్ర, కారం, ఉప్పు, కొత్తిమీర, ఇవన్నీ రోట్లోవేసి మెత్తగా నూరుకొని, కుంపటిమీద స్టీలు గిన్నె పెట్టి, ఉల్లిముద్దని నూనెలో ఎర్రగా వేయించి, అందులో కాల్చిన వంకాయముద్దని వేసి గరిటతో బాగా ఎనిపి కావలసినవారు టీస్పూన్ గరమ్‌మసాలా కొంచెం ఆమ్‌చూర్ (ఎండుమామిడికండ) వేసి బాగా కలిపి దించుకొని వాడుకోవచ్చు. ★

ఎన్. సుగుణ,
(హిస్సార్, తూర్పుపంజాబ్)



కాలిబాట

★ ★

పోటురుగనోయ్ కాలిబాటలో నేను
దాటిపోగలనెంత దవ్వైననుగాని
ఆముగ్ధ సౌందర్య మావింత శోభ
నామదిని కదిలించి ఉయ్యాలలూప
పారవశ్యాన మైమఱచి పోతాను
దూరాన్ని మైమఱచి దాటిపోతాను...

పచ్చని పొలాలన్ని పక్కలకు నెట్టి
పచ్చిక బయళ్లపై పొడవుగా ప్రాకి
గుబురైన పొదరిండ్ల గుంపులో నడుమ
గగనమ్ము నంటేటి తరులనీడలలో
పామేదో ముందునకు ప్రాకుచున్నట్లు
పోతూంది సన్నగా పొడుగాటిదారి...

చిట్టడవిలో దూరి సెలయేర్లు దాటి
గుట్టదగ్గరకొచ్చి అట మలుపు చుట్టి
పైరుపచ్చలలోకి పరతెంచి, నీటి
చెఱువులకు ప్రక్కగా 'కట్ట'యై నిలిచి
పల్లె పల్లెనుకలుపు నీ 'పల్లెదారి'
పల్లెప్రజలందరూ పయనించుదారి...

ఎక్కడో దూరాన ఎడతెరిపిలేక
వినవచ్చు కలకంఠిపాటలో తీపి,
పనిసాగిపో జానపదములను పాడు
పల్లె జవరాండ్ర కంఠాల మార్దవము
శ్రోవలో ఏబాధ తెలియనీదోయి
మత్తుమందునుచల్లి మరపించునోయి...

అలసిపోతేనేమి?-తరుల నీడలలోన
నిలిచితేచాలుమరి-అదియె స్వర్గమ్ము!
చల్లగా మెల్లగా వీచు పవనమ్ము
జోలపాటలుపాడు నళినీ కులమ్ము
"సేదతీర్చుకు పిదప పోదమనుకున్న
నిద్రమైకమెవచ్చి క్రమ్ముకొనునంత!...

దారిలో కనిపించు దృశ్యాల సొగసు
తెలియకనె నానుండి దోచుకొను మనసు
దూరాన్ని దాటినే 'గమ్యమ్ము చేరినా
'దారిలో వింతలే' గోచరిస్తాయి.
కను మూసికొంటినా కెరటాలవోలె ఆ
ఊహాలే మనసులే వచ్చిపడతాయి.

★ 'సదానంద' ★

భైరవుడు

ఢిల్లీలో మొగలాయి సామ్రాజ్యానికి బలమైనపునాది వేసినవాడు బాబరు. అక్బరు కాలంలో అదిఆకాశ సౌధంగా తయారై అత్యున్నత స్థితిలోకి వచ్చింది. కానీ, మొగలాయీ సామ్రాజ్య క్షీణదశకు ఔరంగజేబు ఎంత వరకు బాధ్యుడో జగమెరిగిన విషయమే కదా!

అవి ఔరంగజేబు రాజ్యానికి వచ్చినరోజులు. సింహాసనం శృంగారించగానే రాజ్యకాంక్షతో నలువైపులా దృష్టిని సారించాడు. చిన్నప్పటినుంచీ దృక్పథంలో మెలుగుతూన్న దక్షిణాపథంలోనున్న చిన్నచిన్న రాజ్యాలన్నిటిని రూపుమాపి అక్కడకుకూడా మొగలాయి సామ్రాజ్యాన్ని విస్తరింపచేయ నిశ్చయించుకున్నాడు. అతను అనుకోవడమేమిటి, నెరవేరక పోవడమేమిటి? వెంటనే ఒక పెద్ద సైన్యాన్ని సమకూర్చుకుని దక్షిణాపథానికి దండెత్తి వచ్చాడు. బీజపూరు, శిరమొగ్గి ఔరంగజేబు ఆధిపత్యాన్ని అంగీకరించింది. ఈ విజయ గర్వంతోనే అతని దృష్టి గోల్కొండ మీదికి దండెత్తింది. ఆరోజుల్లో గోల్కొండ ఆదిల్‌శాహు వంశీయులలో ఆఖరి రాజు తానీషా రాజ్య పరిపాలన చేస్తున్నాడు. తానీషా ఔరంజేబు అడుగులకు మడుగులొత్తి అతని ఆజ్ఞల్ని శిరసావహించ లేదు. ఔరంగజేబు దండయాత్ర సంగతి చెవినిసోకగానే కోటగుమ్మం మూయించేసి లోపల సిపాయీ సిబ్బందులతోను యుద్ధ సామగ్రులతోను సురక్షితంగా కూర్చున్నాడు.

గోలకొండకోట కట్టడం అతి విచిత్రమైంది. శత్రుసైన్యం కోటగుమ్మందగ్గరదాకా వచ్చిన తర్వాత కూడా వారికేం భయం ఉండదు. కోటచుట్టూ చాలా దూరంవరకు బలమైన ప్రహారీగోడలు పహారాయిస్తూనే ఉంటాయి. ఆకారణం చేత శత్రువులు గోలుకొండ సమీపించడానికి సాహసించలేకపోతున్నారు. కానీ చివరకి శత్రువులు గోలుకొండని ముట్టడించారు. ఔరంగజేబు గోల్కొండ నుంచి ఆచుట్టు బయట ప్రపంచానికి ఏవిధమైన సంబంధము లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లుచేసేశాడు. ఇంత చేసినప్పటికి చివరకి ఔరంగజేబుకి ఓటమి తప్పలేదు. అట్లాగే సుమారు ఒక్క సంవత్సరం జరిగిపోయింది. తానీషా ఎన్నికష్టాల్నయినా ఎదుర్కుంటున్నాడు గానీ ఔరంగజేబు అధికారాన్ని అంగీకరించలేదు.

ఆ సమయంలో ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. తానీషా ప్రధాన మంత్రి శత్రువులదగ్గర లెక్కకు మించినంత లంచం పుచ్చుకుని, కోటలో ఫలానా ముఖ్యప్రదేశంలో చాలా తక్కువ సైన్యం వుంటుంది. రాత్రి అదేస్థళంలోనుంచి సైన్యాన్ని ప్రవేశపెట్టవచ్చునని ఒక ఉత్తరం వ్రాసి పంపేడు.

వి. రత్నావళి

రాత్రి చాలా చీకటిగా ఉంది ఊరు మాటు మణిగింది. నలుమూలలా నిశ్శబ్దం నెలకొంది. ఔరంగజేబు సైన్యం ప్రవేశించబోయే కోటగుమ్మంలోని ద్వారపాలకుడు; అతని అనుచరులుకూడా నిశ్చింతగా నిద్రలో లీనమైయున్నారు. కనురెప్పపాటులో కోట శత్రువులకు హస్తగత మవగలిగి యుండేడిది. ఈలోపుగానే ఒక కుక్క ఔరంగజేబు సైన్యాన్ని పసికట్టేసింది. ఆ సైనికులు తమ సైనికులకన్న భిన్నంగాఉన్న క్రొత్తరకపుదుస్తుల్లో ఉండడంచూసి ప్రళయం జరుగుతుందన్న ఆవేశంతో గట్టిగా అరవడం ప్రారంభించింది. పహారావాళ్ళ చెవుల్లో త్రుప్పుపోయేట్లుగా మొరగడం ప్రారంభించింది. కుక్కచేసే కోలాహలానికి ప్రహరావాళ్ళు త్రుళ్ళిపడ్డారు. వెంటనే మేల్కొని గంటలు మ్రోగించేశారు. నాలుగు మూలలనుంచీ సైన్యం సాయుధులై వచ్చి పడ్డారు. వెంటనే శత్రుసైన్యాన్ని తమ గుండుదెబ్బలకి గురిచేశారు. శత్రుసైన్యం చెల్లాచెదరై కాలికి బుద్ధిచెప్పింది.

మర్నాడు తానీషా కొలువు తీర్చాడు. కుక్కకథ ఊరంతా వ్యాపించిపోయింది. ఆవేళ, రాజు తానీషా తనసైన్యాధిపతుల ప్రక్కనే కుక్కని కూడా అధిష్ఠింజేశాడు. కుక్కకోసరం ఒక అందమైన బంగారుపట్టా తయారుచేయించాడు. ఆనిండు దర్బారులో తానీషా ఎంతో గౌరవంతో కుక్కమెడలో ఆ బం

'జోస్యం నిజమైంది!'

సుమారు ఏడువందల సంవత్సరాలకు పూర్వం పారశీక దేశాన్ని అర్గాన్‌ఖాన్ అనే మంగోలియను చక్రవర్తి పాలించేవాడు.

ఆయన రాణియైన అబీశాఖాటూన్ ఏభైఐదవయేట మరణించింది.

ఆమె చనిపోయేముందు భర్తను పిలిచి, 'నేను పోయాక, మీకు మళ్లీ పెళ్ళిచేసుకోవాలని తోస్తే, మన మంగోలియావంశపు పిల్లనుగాని చేసుకోకండి' అంది.

అర్గాన్‌ఖానుకు అప్పుడు అరవైరెండు సంవత్సరాల వయస్సు. ఆ వయస్సులో ఇంక మళ్లీ పెళ్ళి ఏమిటి అని ఆయనకు తోచలేదు. దర్బారులో సింహాసనంమీద తన పక్కన కూర్చోడానికి రాణి లేకపోతే ఎలాగ అనిపించి, పెళ్ళికూతురుకోసం ప్రయత్నించాడు.

పాలంకి వెంకట రామచంద్రమూర్తి

ఆ కాలంలో చైనా దేశాన్ని కుబ్లైఖాను అనే మంగోలు చక్రవర్తి పాలించేవాడు. కుబ్లైఖాను, అర్గానుకు పెత్తల్లి కుమారుడే. 'మనవంశంలో మంచికుటుంబంలోని పెండ్లికుమార్తెను చూసిపంపించండి' అని కోరుతూ, అర్గాను కుబ్లైఖానుకు జాబురాసి పంపేడు.

రైళ్లుగాని విమానాలుగాని లేని కాలం అది. టపా అంతా గుఱ్ఱాల మీదా, ఒంటెల మీదా వెళ్లేది. పారశీకానికీ చైనాకూ మధ్య కొన్ని వేలమైళ్లదూరం ఉంది. ఆ లేఖ కుబ్లైఖానుకు చేరేసరికి సుమారు ఒక సంవత్సరం పట్టింది.

జాబును చూచీ చూడటంతోనే కుబ్లైఖాను పెండ్లికుమార్తెను పరిచేశాడు. ఆయనకు బైషీ అనే ఒక మేనత్త ఉంది. ఆమె కుమార్తె 'యూలన్' అనే సుందరి. ఆ సుందరి వయస్సు పద్ధెనిమిది సంవత్సరాలు. కుబ్లైఖాను బైషీని రప్పించి, 'అత్తా, నీ కుమార్తె పారశీక చక్రవర్తిని కాబోతోంది!' అన్నాడు.

బైషీ ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయాయి! 'జోస్యం నిజమైంది! జోస్యం నిజమైంది!!' అంటూ ఆమె నృత్యం చేయసాగింది.

'జోస్యమేమిటమ్మా?' అని అడిగాడు కుబ్లై.

'మా యూలన్ పుట్టినప్పుడు జ్యోతిష్కుడు నక్షత్రాలు చూసి, "ఈపిల్లకి చక్రవర్తి భర్తఔతాడు!" అని చెప్పేడు' అంది బైషీ.

'ఐతే ఆమె పెట్టెబేడా సర్ది, ప్రయాణానికి సిద్ధంచెయ్యి' అన్నాడు కుబ్లైఖాను.

గారు పట్టాను బహుమతిగా తన స్వహస్తాలతో కట్టాడు. కుక్కతలని దువ్వుతూ— ఈ కుక్క పెద్దపెద్ద సైన్యాధిపతులు, సర్దారులకంటే కూడా శ్రేష్ఠమైంది. మా ప్రధాన మంత్రికంటేకూడా మిక్కిలి శ్రేష్ఠమయిందని చెప్పడానికెంతో గర్విస్తున్నాను. మా ప్రధానమంత్రి లంచంపుచ్చుకొని తనయొక్క, తన రాజుయొక్క, మరియు తన దేశవాసుల అమూల్య మైత్రి స్వాతంత్ర్యాన్ని వెండి నాణేలకోసరం వెలకిచ్చేశాడు. వ్యక్తిత్వాన్ని వెలకమ్ముకుని ఆత్మవంచించుకున్నాడు. కానీ ఈకుక్క తన స్వాతంత్ర్యంయొక్క స్థానాన్ని తెలుసుకొని నిలబెట్టుకుంది. అని అపరిమితానందంతో దాన్ని ప్రశంసించాడు, పదిమందిలోనూ.

ఆ తర్వాత ప్రధాన మంత్రి కారణంగానే గోలకొండ పరహస్తమైపోయింది. తానీషా పట్టుబడ్డాడు. కానీ యిప్పటికికూడా గోలకొండమీద ఆకాశాని కంటుచున్న తానీషా రాజ దర్బారు భవనం నుండి ఆకాశవాణి పలికినట్లుగా— "ఒక దేశభక్తిగలకుక్క, దేశద్రోహియైన ప్రధానమంత్రి లేక రాజుకంటేకూడా శ్రేష్ఠమైనది" అన్న మాటలు ప్రతిధ్వనిస్తూన్నాయట. పిల్లలూ మీరు ఎప్పుడైనా ముఖ్య పట్టణమైన హైదరాబాదు వచ్చి గోలకొండ నవాబు ఉన్నత శిఖరాన్నెక్కినప్పుడు మీరు చదివిన ఈకుక్క కథను మరిచిపోకండేం! ★

★ 'జోస్యం నిజమైంది!' ★

యూలనుకు మాత్రం ఏమీ సంతోషంగా లేదు.

'ఏమే అలా ఉన్నావ్?' అని అడిగింది జైషీ.

యూలనుకు బుర్టీ అనే చెలికత్తె ఉంది. ఆమె జైషీతో, 'అమ్మగారూ, ఎంత చక్రవర్తిఐనా ఆర్గాను ఖాను చాలా వృద్ధుడు. ముసిలివాణ్ణి పెళ్లి చేసుకోమంటే, యూలనుకు మనస్సు ఎలా వప్పుతుంది?' అంది.

జైషీ కోపంగా 'బుర్టీ, నిన్నెవ్వరూ చెప్పమనలేదు. నోరుమూసుకుని అవతలకు వెళ్లు!' అంది.

బుర్టీ వెళ్లేక జైషీ కూతురుతో, 'అమ్మాయీ, నేను ఆ జోస్యం విన్న వెంటనే మంగోలియా దేశం వదలి ఈ 'పెకింగు' రాజధానికి ఎందుకు చేరుకున్నానో తెలుసా?' అంది.

యూలను, 'నాకు తెలియదు.' అంది.

'నేను ఎరిగిఉన్న చక్రవర్తి కుబ్లైఖానే. జ్యోతిష్కుడు చెప్పిన ప్రకారం, నిన్ను వివాహం చేసుకోబోయే చక్రవర్తి ఈ కుబ్లైఖానే అనే ఉద్దేశంతో నిన్ను తెచ్చి, ఈ అంతఃపురంలో పడేశాను!' అంది జైషీ.

యూలను తల్లి మాటలు విని ఆశ్చర్యపోయింది. 'మహారాణి ఉందిగా? కుబ్లైఖాను నన్నెలాగ పెళ్లి చేసుకుంటాడనుకున్నావ్?' అని అడిగింది.

'ఏమో, ఎప్పుడేం జరుగబోతోందో ఎవరికి తెలుసు? ఇవాళ ఉన్నవాళ్లు రేపు ఉండటంలేదు!' అంది జైషీ.

యూలను నిర్ఘాంతపోయింది. ఏరోజుకారోజు చైనారాణి మరణిస్తుందనీ, అప్పుడు కుబ్లైఖాను తనకుఅల్లుడౌతాడనీ ఎదురుచూస్తోందన్నమాట జైషీ!

జైషీ, 'ఇన్నాళ్లూ, కుబ్లై నీభర్త కాబోతున్నాడనుకుంటే, ఆరగాను ఖాను భార్య మరణించి ఆమె స్థానం నీకు లభించింది. ఏ చక్రవర్తి ఐతేనేమమ్మా? పారసీక సింహాసనం కూడా బంగారపుదేనట! అతని సంపదకూడా గొప్పదనే విన్నాను.' అంది.

యూలను మాట్లాడలేదు. ప్రయాణసన్నాహాలు చురుగ్గా జరిగేయి.

'పెండ్లికుమార్తెనూ, ఆమె పరివారాన్నీ పారశీకంపంపడంఎలాగ?' అన్నది ఆలోచనలో పడ్డాడు కుబ్లైఖాను.

ఖాను కొలువులో మార్కోపోలో అనే వెనిసు యాత్రికుడొకడు ఉన్నాడు. ఆతడు తూర్పుదేశాలను చూడాలనే కోర్కెతో చిన్నతనంలోనే స్వదేశమైన ఇటలీని వదలి వచ్చాడు. చీనాదేశం వచ్చి కుబ్లైఖానును దర్శించాడు. ఖాను అతని తెలివినీ చురుకుతనాన్నీ చూచి మెచ్చుకుని, 'నువ్వు మా దగ్గరే ఉండిపో. నీకు గొప్ప ఉద్యోగం ఇస్తాను' అని ఆపేశాడు. మార్కోపోలో చైనావచ్చి పదిహేడు సంవత్సరాలైంది. 'ప్రభూ, ఒకసారి మా దేశానికి వెళ్ళి జన్మస్థలాన్నీ, బంధుమిత్రులనూ చూసి వస్తాను, అనుజ్ఞ ఇవ్వండి' అని ఎన్నిసార్లు కోరినా ఖాను సమ్మతించలేదు.

ఇప్పుడు పెండ్లికుమార్తెకు సాయంగా పారశీకానికి ఎవరిని పంపుతే బాగుంటుంది అని ఖాను ఆలోచించడం చూసి మార్కోపోలో, 'ప్రభూ నన్ను పంపండి. నేనామెను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చి, ఆ తర్వాత అక్కడకు కొంచెం దూరంలోనే ఉన్న మా దేశానికి పోయి వస్తాను' అన్నాడు. ఖాను 'నీ ఆలోచన బాగుంది' అని వప్పుకున్నాడు.

ప్రయాణానికి ముహూర్తం నిశ్చయం ఐంది. తెల్లవారితే ప్రయాణమనగా యూలను కన్య చెలికత్తెతో, 'బుర్టీ, నాకు పాలల్లో విషంకలిపి తెచ్చిపెట్టు. నేను ప్రాణాలు వదిలేస్తాను!' అంది.

బుర్టీ, 'అదేమిటమ్మా, ఆత్మహత్య చేసుకోవలసినంత ఉపద్రవం ఏమి వచ్చింది?' అంది.

యూలను, 'తెలుసుండీ అలా అడుగుతావేమిటి బుర్టీ' ఆ వృద్ధుణ్ణి భర్తగా చేసుకోడంకన్న చచ్చిపోవడం మేలుకాదా? ప్రయాణంలో సాయంగా ఉండటానికి ఎవర్ని పంపుతే బాగుంటుందని చక్రవర్తి ఆలోచించడంలో కొంత కాలయాపన ఔతోందని సంతోషించాను. చివరికి మార్కోపోలో వప్పుగోడంతోనే ఆ సంతోషమంతా మటుమాయమైంది. ఇక ప్రయాణం తప్పదు!' అంది.

బుర్టీ, 'అమ్మా, చచ్చి సాధించగలిగిన దేముంది? మార్కోపోలో మనల్ని సముద్రమార్గాన ఓడలో తీసుకు వెడతాడుట. దారిలో ఎన్నో సుందరమైన దీవులున్నాయని విన్నాను. లంకాద్వీపం మన ప్రయాణంలో తగులుతుందిట. బుద్ధభగవానుడు అవతరించిన పుణ్య

భూమి భారతదేశంకూడా మనం దర్శించవచ్చునన్నాడు మార్కో. చీనా దేశానికీ మన గమ్యస్థానమైన పారశీకానికీ మధ్య ఎన్నో దేశాలున్నాయిట. ఆ దేశాలూ, అందలి వింతలూ చూసేభాగ్యం కలిగిందన్న సంతోషంతో ప్రయాణం కట్టు. ప్రస్తుతం పెళ్ళిమాట మరిచిపో' అంది. యూలాను కన్య తనకు తెలియకుండా ఏమి అఘాయిత్యం చేసుకుంటుందో అన్న భయంకొద్దీ ఆమె తెల్లవారేవరకూ ఒక్కక్షణం కూడా విడిచిపెట్టకుండా యూలాను వద్దనే ఉండిపోయింది.

మర్నాడు మార్కోపోలో గుఱ్ఱాన్ని ఎక్కి వెంటరాగా యూలాను బంగారు పల్లకీని ఎక్కి బుర్టీతోనూ, తక్కిన పరివారంతోనూ ఓడరేవుకు ప్రయాణమై వెళ్ళింది. వెళ్ళేటప్పుడు బైషీ, 'పారసీక సింహాసనంమీద రాణీవై కూర్చున్నప్పుడు నన్ను తలచుకుంటావు కదూ?' అంటూ ఒక్క చిరునవ్వు నవ్వి, ఆశీర్వదించి పంపింది.

మార్కోపోలోకి ఒక్కటే కోరిక ఉండేది. ప్రపంచం నాలుగు మూలలకూ వెళ్ళి చూచిరావాలన్నదే ఆ కోరిక. ఇరవై సంవత్సరాల క్రితం స్వదేశమైన ఇటలీదేశంలో బయలుదేరి భూమార్గాన మూడున్నర సంవత్సరాలు ప్రయాణంచేసి చైనా దేశాన్ని చేరుకున్నాడు. ఇప్పుడు సముద్రమార్గాన ప్రయాణం సాగిస్తూ కొత్తదేశాల నెన్నింటినో దర్శించబోతున్నానని ఆతడు సంతోషించాడు.

కొన్ని మాసాలు ఓడలో ప్రయాణంచేసి ఆ పెళ్ళివారు సుమత్రా దీవిని చేరుకున్నారు. ఆ దీవిలో శ్రీ విజయ సామ్రాజ్యం అభివృద్ధిలో ఉన్న రోజులవి. మార్కోపోలో యూలాను కన్యనూ, బుర్టీని సపరివారంగా తీసుకుపోయి శ్రీ విజయరాజధానిలోని మహాభవనాలనూ, వింతలనూ చూపించాడు.

యూలాను కన్య ఆ వింతలన్నీ చూస్తో తన గమ్యస్థానంమాట మరిచేపోయింది. 'ఇక్కడ ఆలయాల మీది శిల్పం చాలా అద్భుతంగా ఉంది!' అని మెచ్చుకుంది.

'కాంభోజ సామ్రాజ్యానికి ముఖ్యపట్టణమైన అంకోరు నగరంలోని శిల్పం ఇంతకన్నా అద్భుతంగా ఉంటుందని విన్నాను' అన్నాడు మార్కో.

'అదికూడా చూసివద్దాం పదండి' అంది బుర్టీ.

'ఆదేశం మన దారిలో లేదు. అక్కడికి వెడితే మనకి ఆలస్యమైపోతుందేమో అని ఆలోచిస్తున్నాను' అన్నాడు మార్కో.

'పరవాలేదు. అదికూడా చూచే వెడదాం' అంది యూలాను.

రోగీ, వైద్యుడూ కూడా పాలే కోరేరన్నట్లుగా ఐంది. వాళ్ళందరూ పారశీకప్రయాణానికి వాయిదా వేసి కాంభోజ సామ్రాజ్యంలోని రేవుకు ఓడను మళ్ళించారు.

ఆ తర్వాత వాళ్ళు భారతదేశంలోని దక్షిణాపథం చేరుకున్నారు. అప్పుడు దక్షిణాపథంలో పాండ్యరాజులు అతి వైభవంగా పాలిస్తున్నారు. రాజైన సుందర పాండ్యుడు మార్కోపోలోనూ, యూలాను కన్యనూ తక్కినవాళ్లనూ కూడా బహుమానాలిచ్చి సత్కరించి పంపేడు.

అక్కడనుండి వాళ్లు ఉత్తరంగా వెళ్లి ఆంధ్రదేశాన్ని చేరుకున్నారు. అప్పుడు ఆంధ్రాన్ని గణపతిదేవ చక్రవర్తి పరిపాలిస్తున్నాడు. ఆయన కుమార్తె రుద్రమదేవి అప్పటికింకా బాలిక. ఆమె పురుషుని దుస్తులు ధరించి గుఱ్ఱాన్నెక్కి స్వారిచేస్తూండేది. కత్తిసాము నేర్చుకునేది. ఆమెను చూచి యూలాను, 'చెల్లీ, నువ్వు స్త్రీలోకానికంతకూ ఆదర్శకాంతవు కావాలి. నిన్ను చూచే సరికి నాలో ఉన్న పిరికితనమంతా నశించిపోయింది!' అని మెచ్చుకుంది.

వాళ్లు యీ విధంగా ఒక్కొక్క దేశమే చూసుకుంటూ పారశీకం చేరుకునేసరికి సుమారు మూడు సంవత్సరాలకాలం పట్టింది.

మార్కోపోలో, 'ఇదేనమ్మా పారశీక దేశం' అనేసరికి యూలాను కన్య గుండె గతుక్కుమంది. 'బుర్టీ, మంచి కలలోంచి మెలకువ వచ్చినట్లైంది! ఇంక నాకీ పెళ్లితప్పదు' అని కంట తడిపెట్టింది.

'ఎప్పటికీ అధైర్యం మంచిది కాదు. ధైర్యంగాఉండు.' అందిబుర్టీ.

వాళ్ళు రాజధానీనగరం ప్రవే

★ 'జోస్యం నిజమైంది!' ★

శించేసరికి వీధులన్నీ రంగురంగుల తోరణాలతో కన్నుల పండువుగా ఉన్నాయి. ప్రజలందరూ మంచి దుస్తులు వేసుకుని ఏదో ఉత్సవానికి వెడుతూన్నట్టుగా కనపడ్డారు.

మార్కో యూలనుతో, 'అమ్మా, నీ రాక ముందుగానే చక్రవర్తికి తెలిసినట్టుగా ఉంది. కల్యాణోత్సవానికి ఏర్పాట్లు జరుగుతోన్నట్టున్నాయి' అన్నాడు.

'ఏనా సంగతేమిటో కనుక్కుందాం.' అని బుర్టీ హడావుడిగా పోతోన్న ఒక పౌరుణ్ణి ఆపి, 'ఏమిటయ్యా విశేషం?' అని అడిగింది.

వాడు 'మీకు తెలీదా? చక్రవర్తి పట్టాభిషేకం' అన్నాడు.

'ఏ చక్రవర్తికి? అర్గానుఖానుకేనా?' అంది బుర్టీ.

'ఇంకెక్కడి ఆర్గానమ్మా? ఆయన స్వర్గస్థుడై అప్పుడే రెండు పున్నములు గడిచాయి. ఆయన కుమారునికి నేడు పట్టాభిషేకం. నేను త్వరగా వెళ్లాలి' అంటూ ఆ పౌరుడు పరుగెత్తేడు.

చక్రవర్తి కాబోతున్న అర్గాను కుమారుడు నెముజీన్ ఖానుని మార్కోపోలో వెళ్ళి దర్శించాడు. 'ప్రభూ, నేను చైనాచక్రవర్తి కుబ్లైఖాను ఆస్థానంనుండి వచ్చాను. యూలను అనే రాజకన్యను వెంటబెట్టుకుని వచ్చాను' అన్నాడు.

'యూలను ఎవరు?' అన్నాడు నెముజీను. బుర్టీ ముందుకు వచ్చి సలాంచేసి, 'ప్రభూ, మా చెలి యూలను ఉన్నత వంశంలో పుట్టిన భువనైక సుందరి. ఆమె పుట్టినప్పుడు జ్యోతిష్కులు 'చక్రవర్తికి రాణి ఔతుంది' అని చెప్పేరు' అంది.

మార్కో మాట అందుకుని, 'ప్రభూ, తమ వయస్సు ఇరవైమైదు సంవత్సరాలకు మించదు. మా కన్య మీకంటె నాలుగేళ్లు చిన్నది. మీ దాంపత్యం చిలకా గోరింకలకుమల్లే ఉంటుంది' అన్నాడు.


మొదట యూలను నెముజీనుల కల్యాణమహోత్సవంతర్వాత పట్టాభిషేకం జరిగేయి. బైషీ అనుకున్న ప్రకారం కాకపోయినా జోస్యం నిజమైంది! యూలను స్వర్ణ సింహాసనం మీదకూర్చుని తల్లిని తలుచుకుంది. ★

వహీదా రెహ్మాన్ ఎల్లప్పుడూ

లక్స్ టాయ్‌లెట్ సబ్బును

ఉపయోగించును. "అది ఎంత తెల్లనిదో

అంత శుద్ధమైనది"



సినిమా తారలు తమ చర్మమును మనోహరముగాను, మృదువుగాను ఉంచుకొను విషయమందు అధికమైన శ్రద్ధ వహించవలెను. ప్రవీణురాలైన భరత నాట్య వర్తకి మరియు పురోవృద్ధి గాంచుచున్న సినిమా తార, వహీదా రెహ్మాన్, తన చర్మమును మృదువుగాను, పరిమళముగాను, ఉంచుకొనుటకు లక్స్ టాయ్‌లెట్ సబ్బునే ఉపయోగించును.

సినిమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు

* గురుదత్‌గారి "ప్యాసా" చిత్రంలో సినిమా తార

LTS. 491-X52 TL

భారతదేశంలో తయారుచేయబడినది

సినిమా

కృత్యాద్యవస్థ

"అనగనగా రాజు" అనగానే పెద్ద మీసాలున్న భారీ ఆసామీ, నెత్తిన కిరీటం, పక్కన సేవకుడూ ఉండే చిత్రం క్షణంలో సగంలో స్ఫురిస్తుంది.

"ఆ రాజుకి ఒక కొడుకు..." అని ఆగితే కథ రాజుకోదు.

ఆ చిన్నవాడు ఓ చిన్నదానివంక చూశాడనీ, చూసి బెంగెట్టుకున్నాడనీ, రాజు తగదన్నాడనీ, కొడుకు తప్పదన్నాడనీ చెబుతూ పోతే కథ చకచక నడుస్తున్నట్లుంటుంది.

వెండితెరమీద ఈ కాస్త కథా చూపించి వాళ్ల తరహాలు తెలియచెప్పడానికి దాదాపు అరగంట పడుతుంది.



"మిస్ మేరీ" లో జమున.

అన్ని కథలకీ, అన్ని చిత్రాలలోనూ ఇలా కథ మొదలై కదిలేసరికి అరగంటా పడుతోందని కాదు. కాని, ఈనాటి చిత్రాల తీరు తెన్నుల గురించి ఆలోచిస్తే ఇలాంటి ఊహ కలుగుతుంది.

అసలు ఏవిషయమైనా ఒకడు ఇంకొకడితో చక్కగా చెప్పడం ఒక కళ.

"గురువుగారూ మీకొంపకి నిప్పంటుకుందండి" అన్న చిన్న వార్తని కూడా పదిమంది పది విధాల చెబుతారు. సినిమా బాక్సాఫీసు సూత్రాలు తెలిసో తెలియకో ఒక శిష్యుడు పైవార్తని స్వరయుక్తంగా, రాగాలాపనసహా తెలుగు చిత్రం అంత పొడుగ్గా చెప్పాడట. అదీ ఒక కళేగదా.

అందుచేత అబద్ధం దగ్గిర్నించి ప్రబంధం వరకు, అప్పుఅడగడందగ్గిర్నించి, అఖండంగా ఉపన్యసించడంవరకూ ఎలా చెప్పడం, ఎక్కడ మొదలుపెట్టడం అన్నది పెద్దప్రశ్నగానే ఉంటూవచ్చింది. దీన్నే కృత్యాద్యవస్థ అన్నారు.

మళ్ళీ మళ్ళీ వెనక్కెళ్లి సందేహాలుంటే తేల్చుకు ముందుకు సాగడానికి వీలున్న పుస్తకంలోనే కథ మొదలుపెట్టడం ఆనేది క్లిష్టసమస్య. అటువంటి సదుపాయాలు లేనివి రంగస్థల నాటకం, వెండితెరమీద చలనచిత్రం. అందువల్ల చలనచిత్రంమీద కథ చూపడం ఒక ప్రత్యేకమైన కళ. దీని పద్ధతులు వేరు.

కాగితంమీద, 'అనగనగా ఓ రాజుకి లేక లేక కొడుకు' అని రాస్తే సరిపోయే వాక్యాన్ని సెల్యులాయిడ్‌లోకి తర్జుమా చేస్తే, రాజునీ, వాడికోటనీ, మందీ మార్బలాన్నీ చూపించి వాడు రాజేనని ఖాయం చేస్తారు. ఆ తరవాత వాడికి కొడుకులు లేకపోవడం, ఆ సంగతిని ప్రేక్షకులికి తెలియ చెబుతూ రాణీ పాటపాడడం, అనక పూజ చేయడం, పిమ్మట దేముడు లేక ఋషి కనబడి వరమివ్వడం, చూపించాలి. కొడుకు పుట్టాక వాడిని తొట్టిలోపెట్టాక, ఒక బృందగానం చిత్రించాక వాడు పెరగడం మొదలైనవి. వాడు పెరిగి రామారావో నాగేశ్వరరావో అయితే తప్ప కథ కదలదు. చిత్రం మొదలైనప్పుడు ఎక్కడుందో విదురీళ్లయ్యాకా అక్కడే ఉంటుంది. ఇంకాస్సేపటికి మరోచోట అంజలిని చూపించి, ఈలోగానో ఆతరవాతనో కుట్రచేసే విలన్‌ని చూపించి, "అదీ సంగతి, అప్పుడేమయిందంటే—" అని అనేసరికి ఇంటర్వెల్ వచ్చేస్తుంది. ఇంటర్

వెల్ అనంతరం నడక మొదలెట్టిన కథ, మెల్లిగా నడిచినట్లే నడిచి, గబుక్కున ఉరకలూ పరుగులూ మొదలెడుతుంది—స్టేషన్ 50 గజాల దూరంలో ఉండగా రైలు కదలడం గమనించిన ప్రయాణీకుడిలా.

అంతవరకూ పరిపరివిధాల చిక్కొరుపోయి తెరమరుగున తిరుగుతున్న పదిపదిహేను అప్రధాన పాత్రలు సహా, చిత్రంలో వారంతా ఎక్కడెక్కడినించో గబగబ ఆఖరు సీనులోకి పరుగెత్తుకొస్తారు. సదరు కార్యక్రమం చాలా హడావుడిగా జరుగుతూంది. కథ అయిపోతుంది అక్కడితో.

ఇది స్థూలంగా వర్తమాన తెలుగుచిత్రాల పరిస్థితి అనవచ్చు. ఉదాహరణగా నడచిన కథ జానపదంఅయినా, పౌరాణిక, సాంఘిక జానపద చిత్రాలూ, ఈ జాతిభేదాలకు అతీతాలు అయిన 'విచిత్రాలూ' కూడా "ఇదే మాకథ" అంటున్నాయి.

ఇటీవల ఒక చిత్రంలో, ఒక అమ్మాయి చాలా అల్లారుముద్దుగా పెరిగి పొగరుబోతుగా తయారై, నా అన్నవాళ్ళకి వేరై బుద్ధితెచ్చుకున్న కథను చెప్పారు. ఊహ చాలమంచిదే. కాని, ఆ అమ్మాయి 'ఎంత చాలా గారాబంగా' పెరిగిందో తెలియ చెప్పడానికి ఏడెనిమిది రీళ్ళ ఫిలిం వాడుకున్నారు. అప్పుడూ కథ ప్రారంభం అయేది. అంతవరకూ మరోతరం జనం కథని చిత్రించారు. అందువల్ల దాదాపు పూర్వార్థం పూర్తి అయే పర్యంతం ఈకథ ఏమిటో లీలగా కూడా అంతు చిక్కదు. మరోచిత్రంలో ఒక నవయువకుడినీ, అతగాడి జతనీ, వాళ్ల పాలిట యముడినీ చూపించి ఫిల్ము ఖలాసా అని చెప్పడానికి పట్టినవేళ చూస్తే ఇది సినిమా కాదన్న దురభిప్రాయం కలిగింది.



అశ్వరాజ్ వారి "వినాయక చవితి" లో శ్రీకృష్ణుడుగా ఎన్. టి. రామారావు

సాధారణంగా మన చలనచిత్రకారులకు, కృత్యాద్యారంభం ఎలాగన్నది, ఏమంత ఘన విషయంగా కనిపించదనిపిస్తుంది.

నూటికి తొంభై చిత్రాలు పాటతో మొదలౌతాయి. కొంతమందికి చిన్నపిల్లల డాన్సుతో మొదలు పెట్టడం ఇష్టం. మరికొందరు తులసిపూజ చేయిస్తారు. ఈ ముచ్చటలకు పర్యాయపదం "ప్రత్యేకత." ఈ ప్రత్యేకత, ముందర కొత్తపద్ధతి అవలంబించాలన్న వాదం నిలవలేదు. దాని కసలు చోటులేదు అనిపిస్తుంది ఇప్పటి పరిస్థితి చూస్తే. కాని, ఇప్పటిపరిస్థితులు మారాలనీ దర్శకులు కొత్త పద్ధతులలో కథలు మొదలు పెట్టాలనీ అవి చురుకుగా నడవాలనీ, ఆశిద్దామనిపిస్తూంది. కృత్యారంభానికి నాలుగైదు రీళ్లు ఖర్చు కానవసరంలేనినాడు చిత్రాల నిడివి, వాటి ఖర్చుకూడా తగ్గుతాయనీ అనిపిస్తుంది.

అన్నిటికన్న ముఖ్యం ఇకనైనా కొత్త తెలుగుచిత్రం చూడబోయినప్పుడు అందులో కొత్తదనం ఉంటుందని, చిత్రం మొదలైన కొంతసేపటి దాకానూ, అనక ఇంకొంత సేపూ నిద్రపోనవసరంలేదనీ సంతోషించే అవకాశం కలగాలని ఆశపడ మనసౌతుంది. ★




శర్వాణీ వారి "అక్కాచెల్లెళ్లు" చిత్రంలో అమర్‌నాథ్, కృష్ణకుమారి.



సత్యం　　　సుశీల　　　అనసూయ　　　రమణయ్య

అన్నపూర్ణావారి చిత్రం "తోడికోడళ్లు"



ఆర్. కె. ఫిలింస్ వారి "అబ్ ఢిల్లీ దూర్ నహీం"లో యాకూబ్, మాస్టర్ రోమీ

ధనం; జనం

1956లో విడుదలయిన ఉత్తమచిత్రాలకు బహుమతి ప్రదానం ఏప్రిల్ 28వ ఢిల్లీ విజ్ఞాన భవన్‌లో జరిగింది. ఆర్భాటం లేక పోయినా నిండుగా హుందాగా ఒప్పిన సభలో రాష్ట్రపతి డా॥ రాజేంద్ర ప్రసాద్ ఆయాచిత్రాల నిర్మాతలకు బహుమతులూ, యోగ్యతా పత్రాలూ ఇచ్చి సత్కరించారు. ఆయా చిత్రాలలో పాల్గొన్న ముఖ్యనటీనటులకు పుష్పగుచ్ఛాలిచ్చి గౌరవించారు. (బహుమతులందుకున్న చిత్రాల వివరాలు ఇదివరకే ప్రకటించాము.) పిల్లలచిత్రాలలో ప్రధాని సువర్ణ పతకం అందుకోతగ్గ చిత్రం లేకపోయినా, బాలచలన చిత్ర సంస్థ కిదార్ శర్మదర్శకత్వాన నిర్మించిన "జల్‌దీప్" చిత్రానికి ప్రశంసాపత్రం ఇచ్చారు.

డా॥ రాజేంద్ర ప్రసాద్ నేటి భారతీయ చలన చిత్ర పరిశ్రమ పరిమాణాన్ని, ప్రజాబాహుళ్యంపై దానికిగల ప్రభావాన్ని ప్రస్తావిస్తూ, చలనచిత్రకారులు ఈ దృష్ట్యా తమపై గల బాధ్యతను గుర్తించి వ్యవహరించాలన్నారు. అసంఖ్యాక ప్రేక్షక జనుల శ్రేయస్సుకు దోహదం చేసే విధంగా చలన చిత్రాలను నిర్మించాలన్నారు పశ్చిమ దేశాలలో చలన చిత్ర కళ విద్యా విజ్ఞాన వ్యాప్తికి ఎంతో కృషి జరుగుతున్నదనీ, మన దేశంలో కూడా అదేవిధంగా చలనచిత్రకళ అనే ఈ మహత్తర సాధనాన్ని ఈ రంగంలో పూర్తిగా సద్వినియోగం చేయ



బాబు　　చంచల　　వైకుంఠం　　కుటుంబరావు

...దినోత్సవాలలో పాల్గొన్న నటీనటులు

గలరని నమ్ముతున్నామనీ డా॥ రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

"అయితే ఒక విషయం ఉత్తమ ప్రమాణాలు అందుకొన్న అన్ని చిత్రాలకు లాభాలు రాకపోవచ్చు. అలా అయినప్పటికీ, మన చిత్రనిర్మాతలు సర్వదా ధనం కన్న జనం మంచికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి సంఘశ్రేయస్సుకూ, జాతి పురోభివృద్ధికీ దోహదంచేసే విధానాలనే అనుసరిస్తారని నేను విశ్వసిస్తున్నాను" అని డా॥ రాజేంద్రప్రసాద్ అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి డా॥ బి వి కేస్కార్ కూడా తమ ప్రసంగంలో ఈ విషయం నొక్కి చెప్పారు.

"మన చలనచిత్ర పరిశ్రమ ప్రజలకు వినోదం సమకూర్చడంలో గొప్ప ఫలితాలు సాధించింది. కాని, సాంఘిక ప్రయోజనాలన్నూ, విద్యా విజ్ఞానవ్యాప్తి అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే, మనం ఈ రంగంలో ఇంకా తొలిఘట్టంలోనే ఉన్నామనిపిస్తుంది ఈవిషయమై శ్రద్ధ వహించడం, ఇందుకు సంబంధించిన కృషిని ప్రోత్సహించడం అవసరం అని డా॥ కేస్కార్ అన్నారు.


చిత్రాల సంఖ్య, దానితోపాటు స్థాయీ కూడా పెంచవలసిన అవసరం ఎంతైనా ఉన్నదనీ, ఆయాచిత్ర నిర్మాణ సంస్థలు పట్టుదలతో పనిచేసి ఉత్తమస్థాయి చిత్రాలను నిర్మించాలనీ ఆయన అన్నారు।

ఈపరిశ్రమ పురోభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్నకృషిని కూడా ఈ సందర్భంలో ఆయన ప్రస్తావించారు.

కళ, వ్యాపారం కలసి నిలచే ఈపరిశ్రమ పరిశ్రమలో ధనం చాలా ప్రధానమైనదన్న విషయం నిర్వివాదాంశం. అది లేకపోతే కథేలేదు అయితే ఈనాడు ఈపరిశ్రమ మనదేశంలోనూ యావత్ప్రపంచంలోను ఆక్రమించిన స్థానాన్ని, ప్రజానీకంపై దీనికిగల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలోచిస్తే ధనంతోపాటు జనం మంచికి కూడా సముచిత ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. జనం చూస్తున్నారనీ, ధనం వస్తోందనీ బాధ్యతా రహితంగా వ్యాపారం చేయడం దేశానికీ మంచిదికాదు; పరిశ్రమకు అంతకన్నా కాదు. ★

సినిమా వార్తలు

• శ్రీ ధనసాయి ఫిలింస్‌వారి తొలి చిత్రం "బలేబావ" నిర్మాణం పూర్తికావచ్చింది. జగ్గయ్య, రేలంగి, గుమ్మడి, జానకి, గిరిజ, చదలవాడ, నల్లరామమూర్తి మొదలగువారు పాల్గొంటున్నారు దర్శకుడు ఎస్ రజనీ



"తోడికోడళ్లు" శతదినోత్సవాలలో- రచయితలు కొసరాజు, ఆత్రేయ, కళాదర్శకుడు కృష్ణారావు, దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, నిర్మాత, దుక్కిపాటి మధుసూధనరావు.

రాఘవ స్మారక వార్షికోత్సవాలు

రాఘవ స్మారక వార్షికోత్సవాలు ఏప్రిల్ 16 నుండి 20 వరకూ విజయనగరం హాస్టల్ మందిరంలో వైభవంగా జరిగాయి. నాటక ప్రదర్శనలు, పోటీలు, సాహిత్య, నాటక గోష్ఠులు, సన్మానాలు మొదలగు లలితకళావ్యాసంగాలతో ఆ ఐదు రోజులూ విజయనగరం కలకలలాడింది. మహాసభకు పద్మశ్రీ స్థానం నరసింహారావు అధ్యక్షత వహించారు. ముదిగొండ లింగమూర్తి సభను ప్రారంభించారు. సాటి రాష్ట్రాలతోపాటే, ఆంధ్రప్రదేశ్ లో కూడా నాటక కళ పురోభివృద్ధికి, వ్యాప్తికి ప్రభుత్వం సహాయం చేయాలని లింగమూర్తి అన్నారు.

అందుకు తగిన కృషి చేస్తామని అఖిల భారత సంగీత నాటక పరిషత్ సభ్యులుగా నరసింహారావు చెప్పారు. అనంతరం నాట్యకళాప్రపూర్ణ బళ్లారి రాఘవ చిత్రపటాన్ని ఆవిష్కరించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ ఉత్సవాలపేరిట ఈ రూపేణా ఆంధ్రలో ఔత్సాహిక నటీనటులు, రచయితలూ ఒకచోట కలుసుకుని మన నాటకకళ స్థితినీ, గతినీ పరస్పరం తెలియచెప్పుకోవడం ముదావహం ఈనాడు రాష్ట్రంలో దాదాపు అన్ని పట్టణాలలోనూ ఔత్సాహిక నాటక సమాజాలు ఉన్నాయి. ఉన్న వాటిలో ప్రముఖ బృందాలు అనేకం ఈ ఉత్సవాలలో పాల్గొన్నాయి. 5 నాటకాలు, 15 నాటికలూ ఈసారి ప్రదర్శించారు బహుమతి నిర్ణాయక సంఘం, జనరంజకమైన నిర్ణయాలను చేశారు.

పోటీలు రాత్రివేళ జరిగాయి. ఒక్కో రోజు ప్రదర్శనలు ముగిసేసరికి రాత్రి ఒంటిగంటా రెండూ అయినా చూడవచ్చిన ఆబాలగోపాలం నాటకాలను పూర్తిగా చూచి ఉత్సవాలను సార్థకంచేశారు.



1957, విజయనగరం రాఘవ స్మారక నాటక పోటీలలో ఉత్తమ నటిగా ప్రథమ బహుమానం పొందిన కుమారి రాధ

16 వ తేదీ ఉదయం నాటక గోష్ఠి జరిగింది. రాఘవ నాటకోత్సవ సంఘాధ్యక్షులు పీవ పాటి నరసింహామూర్తి అధ్యక్షత వహించారు. ఇటీవల నాటకకళ పైగ్రంథం వ్రాసి ఆంధ్రప్రభుత్వ బహుమతి నందుకున్న మిక్కిలినేని రాధాకృష్ణమూర్తికి, ఔత్సాహిక నటుడు కె. వెంకటేశ్వరరావుకూ సన్మానం చేశారు. 19 వ అబ్బూరి రామకృష్ణరావు అధ్యక్షతన సాహిత్యగోష్ఠి జరిగింది. వ్యావహారిక భాషకు వ్యాకరణం రూపొందించాలని, సర్వసమగ్రమైన నిఘంటువు వ్రాసిన గిడుగువారిఉద్యమాన్ని సఫలం చేయాలనీ వక్తలు అన్నారు. మర్నాడు కవితాగోష్ఠి జరిగింది. కాళోజీ నారాయణరావు అధ్యక్షత వహించారు. అనంతరం కావ్యపఠనం జరిగింది

నాటక పోటీలలో ఈ క్రిందివారు బహుమతి నందుకున్నారు:

ఉత్తమ నాటక ప్రదర్శన: "తెరలో తెర" రచన కె గంగాధరరావు. ప్రదర్శన: బాపట్ల కళాసమితి.

ఉత్తమనటుడు ఆర్. వి. శలం. (హితశ్రీ వ్రాసిన "విచిత్రజీవులు" నాటకంలో) ప్రదర్శన ఆంధ్ర నాటకసాహిత్య సంఘం; జంషెడ్పూర్.

ఉత్తమనటి: రాధాకుమారి. "విచిత్ర జీవులు" నాటకంలో)

ఉత్తమ నాటికా ప్రదర్శన "వరప్రసాదం" రచన ఆత్రేయ. ప్రదర్శన కవిరాజా మెమోరియల్ క్లబ్, విజయనగరం

ఉత్తమనటుడు – గరిమెళ్ల రామమూర్తి. (రావికొండలరావు వ్రాసిన "కుక్కపిల్ల దొరికింది"లో) ప్రదర్శన శ్రీకాకుళం యువజనసంఘం ఉత్తమనటి–రాగేశ్వరి. ("వరప్రసాదం"లో నటనకు).

రచన

నాటకం: "తెరలో తెర." రచయిత: కొప్రపాటి గంగాధరరావు.

నాటిక. "కుక్కపిల్ల దొరికింది." రచయిత రావికొండలరావు.

రంగాలంకరణలో విశాఖ నాటకకళా మండలివారికి బహుమతి వచ్చింది. వారు "తీర్పు" అనే నాటిక ప్రదర్శించారు.

"వారఫలాలు" అనే నాటకంలో పాల్గొన్న పి. నరసింగరావును ఉత్తమహాస్యనటుడుగా ఎన్నికచేసి బహుమతి ఇచ్చారు.

పూర్ణాపిక్చర్స అధిపతి జి. కె. మంగరాజు బహుమతులను పంచిపెట్టారు.

(ఒ. వి.)

సినిమా వార్తలు

కాంత్. మాటలు గో.రా.శర్మ, పాటలు అనిసెట్టి వ్రాశారు. సంగీత దర్శకుడు సుసర్ల దక్షిణామూర్తి ఛాయాగ్రహణం సి. నాగేశ్వరరావు. ఈ చిత్రాన్ని ఈ నెలాఖరులోగానే విడుదలచేయ సంకల్పించినట్లు నిర్మాత టి. రంగయ్య తెలియచేస్తున్నారు.

* * *

మే 4 వ "మక్కళైపెట్ర మహారాసి" అనే తమిళ చిత్రానికి తెలుగు వ్యాఖ్యానం జోడించి చమేరియావారు విడుదల చేస్తున్నారు. శివాజీగణేశన్, భానుమతి, కన్నాంబ, ఎం. ఎస్. రాజం, నంబియార్, కె. సారంగపాణి. వి. కె. రామస్వామి మొదలగువారు నటించారు. తెలుగు వాఖ్యానాన్ని సురటి దుర్గారావు చదివారు.

* * *

మాడర్న్ థియేటర్స్ వారి "వీరకంకణం" మే నెలాఖరువాటికి విడుదల కాగలదని తెలుస్తోంది. జమున, గిరిజ, ఎన్. టి. రామారావు, జగ్గయ్య, రేలంగి, గుమ్మడి, రమణారెడ్డి కె. వి ఎస్. శర్మ, పేకేటి, ఇ. వి. సరోజ పాల్గొన్నారు రచన ఆరుద్ర, సంగీతం దక్షిణామూర్తి. దర్శకత్వం జి.ఆర్. రావు.

* * *

కాశీనాథ్ ప్రొడక్షన్స్ వారి "రామాంజనేయయుద్ధం" ఏగుతీళ్ళవరకూ తయారైంది. శ్రీరంజని, మాలతి, అమర్ నాథ్, నాగయ్య ముక్కామల, సూర్యనారాయణ, రఘురామయ్య, సూరిబాబు, వంగర, కె. వి. యస్ శర్మ, రామకోటి, ఆంజనేయుడుగా జంధ్యాల గౌరీనాథశాస్త్రి నటిస్తున్నారు. దర్శకుడు ఎస్. ఎస్. అచార్య నిర్మాత కాశీనాథం సుబ్రహ్మణ్యం. రేవతీ స్టూడియోలో ఈచిత్రం తయారవుతోంది.

అక్కడే నిర్మించబడుతున్న మరో చిత్రం నందివారి కృష్ణగారడీ తెలుగులోను, కన్నడంలోనుకూడా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగుచిత్రం ధర్శకుడు వై. వి. రావు ఇందులో జగ్గయ్య, అమర్ నాథ్. శివరావు, మిక్కిలినేని, రేవతి, జయలక్ష్మి, సూర్యకళ పాల్గొంటున్నారు. ★

వాల్ట్‌డిస్నీ కొత్త చిత్రం

‘ఆఫ్రికన్ లయన్’

వారం పదిరోజుల తేడాలో తలితండ్రు లిద్దరినీ కోల్పోయిన కుర్రాళ్ళిద్దరు వా అన్న మనిషీ, రా అన్ననీడా కూడా లేక సత్రాల వెంబడి పడి మనుగడ సాగిస్తూ వచ్చారు. ఇద్దరూ ఓరోజున ఓయింటిఅరుగు మీద కూచున్నారు తిరిగి తిరిగి నీరసించి.

“సాటిలేని మేటి నాటకం నేడే ప్రారంభ”మని రాసిఉన్న గూడుబండిఒకటి ఆదారిన వెళ్లింది.

“అన్నయ్యా నాటకానికెళదాం” అని మారాం చేశాడు ఏడేళ్ళ తమ్ముడు.

పదమూడేళ్ళ అన్నయ్య నాటకముపై వేళ్ళ వేదాంతిలా మొహంపెట్టి, “హు” అన్నాడు. ఆ తరవాత.

“బ్రతుకే—ఓ—నాట
కమ్రా తమ్ముడూ
మన బ్రతుకే ఓ
నాటకమ్రా తమ్మా”

అని తెచ్చుకున్న హుషారుతో ఓ పాట పాడాడు.

నీరసంగా ఊసూరు మంటున్న చిన్న తమ్ముడు ఒక్కసారి కిలకిల నవ్వాడు. వాళ్ళన్న కూడా మనసారా నవ్వాడు. ఆకలి మళ్లీ జ్ఞాపకంవచ్చింది. ఉసూరు మన్నారు...వాళ్ళ కథ అలాగే సాగి పోయింది.

బతుకే నాటకం అన్న విలవైన ముక్కని అనుభవజ్ఞులు అయిన పెద్దలు చాలమంది చాలసార్లు చెప్పారు. అయితే నాటకంలో వేషం వేస్తున్నవాళ్లకి ఇది నాటకంగా గబుక్కున కనబడదు. మంచినాటకం చూసి నపుడు జీవితంలా ఉందనుకుంటాం. జీవితంలో ఓ ఘట్టంచూసి నాటకంలా ఉందనుకుంటాం. పుట్టడం, బతకడం, చావడం అన్న మూడంకాల నాటకం, లేక ముడిజీవితం మన కెపుడు కనబడదు. నాగరిక తెరలు చాలా ఉన్నందువల్ల ఈ నాటకం రూపురేఖలు అస్పష్టంగా ఉంటాయి.

వాల్ డిస్నీ, సహజ వాతావరణంలో జంతుసంతు జీవితాన్ని ఉన్న దున్నట్లు చూపుతూ నిర్మించిన చిత్రాలవిశిష్టత, వాటి లోని ఈ విస్పష్టతే. అతని చిత్రాలు అన్నమాటకు బతుకే నాటకం సెల్యులాయిడ్ తర్జుమాలు. చీమలూ, దోమలు, ఎలకలు, కుందేళ్లువంటి సన్న కారు ప్రాణులు మనుగడకోసం తమకన్న బలమైన జీవులతోనూ, ప్రకృతి శక్తులతోను అజన్మాంతం సాగించే సమరాన్నీ అంగులో వినోదాన్ని, చిత్రిస్తూ “లివింగ్ డెజర్ట్” (ఎడారిలో జీవనరాగం) అనే చిత్రాన్ని, అలాగే ‘జనారణ్య’ వి స్తరణఫలితంగా క్రమేపీ అంతరించి పోతున్న నిర్జనారణ్యం అమెరికన్ ప్రేరీలో జంతుకోటి జీవితాన్ని చిత్రిస్తూ “వానిషింగ్ ప్రేరీ” అనే చిత్రాన్ని డిస్నీ ఇదివరకు నిర్మించాడు. వాటిలో అల్లినకథ ఏమీ లేదు. ఆ జంతువులు ఉండేచోటుకు వెళ్ళి ఓపికగా నెలలతరబడి కూర్చుని, అవి ఆహారం సేకరించడం, పిల్లలికి పెట్టడం, వాటినీ, తమనూ కాపాడుకోవడం, మొదలైన సన్నివేశాలను, అవి జరుగుతూఉండగా ఫొటోగ్రాఫ్ చేస్తారు. ఆయా ఖండాల కూర్పులో చూపిన నేర్పువల్ల అన్నికోట్ల ప్రాణుల జీవితానికి ఆలంబనమైన సూత్రం నిజ స్వరూపం చిత్రంమొత్తంమీద మనకు గోచరిస్తుంది.



డిస్నీ ఈసారి నిర్మించిన “ఆఫ్రికన్ లయన్” చిత్రం, ఇదివరకటి చిత్రాలంతగా ఆద్యంతం రక్తికట్టించేటట్టుండదు. చీమల చిత్రం తియ్యడం కష్టం; అయితే సింహాల కథ ప్రమాదభూయిష్టం. దానికీ దీనికీకూడాసిద్ధపడే డిస్నీబృందం ఈ ఆఫ్రికన్ వన్యమృగాల చిత్రాన్ని నిర్మించినా, ఆరువేల అడుగుల పొడుగున్న ఈ చిత్రంలో దాదాపు సగంభాగం వ్యాపార విభాగం అనవచ్చు. ఈ చిత్రంలో మృగ రాజులాగానే చిత్రంకూడా బద్ధకంగా నడుస్తుంది.

అయితే ఈ విభాగంలో కూడా, మనం ఇంకెక్కడా చూడలేని సన్నివేశాలున్నాయి. మరువరానిదృశ్యాలున్నాయి. ఇవన్నీ ఆఫ్రికాఖండం మధ్యభాగంలో వేలాదిమైళ్లు వ్యాపించిఉన్న సెరింగెటి మైదానంలోనివి. ఇక్కడవన్నీ కొండలు దూరని కొరడవులు కావు. అక్కడక్కడా ఒకటీ అరా చెట్లుంటాయి. చెట్లకింద సింహా లుంటాయి. చేరువనే జింకలూ ఉంటాయి. ఈ సింహాలు అస్తమానం జంతువులమీద పడి చంపవు. ఆ సంగతి ఆ చిన్న జంతువు లకీ తెలుసు. సింహం ఎప్పుడు ఆకలిగా ఉందో కూడా అవి పసిగట్టగలవు. ప్రమాదం లేదని తోచినపుడు అవి, సింహం దగ్గర కొచ్చినా పారిపోవు. సింహం కూడా, ఆకలేసినపుడు ఇలాంటి ఒడుపు వేస్తుంది. పొంచిపొంచి మీద పడుతుంది. ఎందుకంటే, తరిమితే ఏజంతువూ దానికి దొరకదు. అదే చిరుతపులి అయితే గంటకి నలభైమైళ్ల వేగంతో పరుగెత్తి, పారిపోయే జంతువు అంతు కనుక్కొంటుంది.

మృగరాజ బిరుదాంకితమైన మొగసింహం అస్తమానం నిద్రపోవడం, మేలుకున్నప్పుడు గంభీరంగా (ఫొటోలు తీయించుకునే పోజులో) అటూ ఇటూ చూడడం వినా మరేం చెయ్యదు. వేటకెళ్లి తిండి తెచ్చే పూచీ రాణీదే. ఆవిడ తెచ్చి ఆ మొగుడికీ, పిల్లలకీ పెడుతుంది. ఈలోగా ఆ తెచ్చిన జింకలో చాలవరకు చుట్టపక్కాలు, దొంగలూ సాధ్యమైనంతవరకూ తినేస్తారు. ఇంతా కష్టపడ్డ ఆడసింహానికి మిగిలేది ఎముకలూ కొమ్ములూను. ఎప్పుడూ ఇంతే అని తెలిసినా ఆడసింహం ఎప్పుడూ కక్కుర్తి పడి, పిల్లలు తినకుండా తను తినదు....

ఖడ్గమృగం అంటే అన్ని జంతువులకూ భయమే. అంత భయంకరమైన, భారీ జంతువు ఓసారి నీరు తాగబోయి ఊబిలో దిగబడింది. ఆ నిస్సహాయస్థితిలో, తిక్కరేగి, తల నేలకేసి బాదుకుంటుంది. రొప్పుతుంది. ఒక ఏనుగు [illegible] వస్తుంది. ఓనిముషం చూస్తుంది. సాయం చేద్దామా అని. మళ్ళీ, దుష్టులకు దూరముగా ఉండుము అన్న నీతిని మననం చేసుకుని, ఆ గొడవలో మంచినీళ్లు తాగాలన్న సంగతి మర్చిపోయి, వచ్చిన దారినే చక్కాపోతుంది. ఆఖరికి సాటి జంతువు వచ్చి కూడా,ఆదృశ్యాన్ని వింతగా చూసి మనకెందుకని మంచినీళ్లు తాగి పోతుందే తప్ప ఊబిలోని సోదరిని ఆదుకోదు. చివరకి ఆఖడ్గమృగం అలా తల బాదుకుని చనిపోయింది...

ఇలాంటి అసదృశ ఘటాలతో వాటికి తగిన సంగీతంతో, ఆహ్లాదకరమైన వ్యాఖ్యానంతో డిస్నీ ఈ చిత్రాన్ని రూపొందించాడు. దర్శకుడు జాన్ ఆల్గర్. సంగీతం పాల్ స్మిత్.

ఈచిత్రాన్ని ఆర్. కె. ఒ. రేడియో పిక్చర్స వారు ఏప్రిల్ 26 న మద్రాసు ఓడియన్‌లో విడుదలచేశారు. 28 న పత్రికల వారికి చూపించారు. ★

అమెరికా అధ్యక్షుని ఎన్నిక

(4-వ పేజీ తరువాయి)

యగానే అతన్ని సమర్థించేవారంతా జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ మహారభస చేస్తారు. ఈ ఉపన్యాసాలూ, సమర్థింపులూ అయ్యాక వోటింగ్ జరుగుతుంది. సభ్యులలో అధికసంఖ్యాకులు ఎవరికి వోటు చేస్తే ఆ అభ్యర్థే నియమించబడతాడు. అధిక సంఖ్యాకుల వోట్లు ఏ అభ్యర్థికీ రాకపోతే మళ్ళీ వోటింగ్ జరుగుతుంది. అధిక సంఖ్యాకులవోట్లు ఏ అభ్యర్థికో ఒకడికి వచ్చేదాకా వోటింగ్ జరుగుతూనే వుంటుంది. 1920 లో డెమొక్రాటిక్ జాతీయ మహాసభ 44 సార్లు బాలెట్ చేస్తేగాని జేమ్స్ ఎమ్. కాక్స్ అభ్యర్థిత్వం నెగ్గలేదు. 1924 లో జాన్ డబ్ల్యు. డేవిస్ 103 సార్లు బాలెట్ అయిన తర్వాత నెగ్గాడు.

అలా నెగ్గిన అభ్యర్థి దేశ అధ్యక్ష పదవికి అభ్యర్థిగా పార్టీతరఫున నిలబడతాడన్నమాట. అక్కణ్ణించి పార్టీ ప్రచారం ప్రారంభమవుతుంది. ముందు నెమ్మదిగా మొదలవుతుంది. ఎన్నిక దగ్గరవుతున్నకొద్దీ పుంజుకుంటుంది. సెప్టెంబరు, అక్టోబర్లు వచ్చేసరికి ప్రతిపౌరుడూ తప్పించుకుందామన్నా ఈపార్టీల ప్రచారం నుంచి తప్పించుకోలేడు. అభ్యర్థులిద్దరూ, పార్టీనాయకులూ, ప్రముఖులూ అమెరికాలోని 48 రాష్ట్రాలలో అటునుంచి ఇటూ, ఇటూ నించి అటూ విమానాల్లో, రైళ్ళలో సంచారం చేస్తారు. రేడియోలో, టెలివిజన్‌లో, సినిమాల్లో ఎక్కడ చూసినా వాళ్ళే కనబడతారు. వాళ్ళే వినబడతారు. దీనికి ఎన్నికోట్లు ఖర్చవుతాయో చెప్పలేము. పెద్దపెద్ద పారిశ్రామికులు, వ్యాపారస్థులు ఈ ప్రచారానికి పెట్టుబడి పెట్టి ఆదుకుంటారు. నవంబరు మొదట్లో ఎన్నికలు జరుగుతాయి. అధ్యక్షుణ్ణి, ఉపాధ్యక్షుణ్ణి, దిగువ శాసనసభ సభ్యుల్ని, సెనేట్ లో మూడోవంతు సభ్యుల్ని ఆరోజున ఎన్నుకుంటారు. పోలింగ్ అయిపోయిన కొన్ని గంటల్లో ఏ అభ్యర్థి అధ్యక్షుడయ్యేదీ, కాంగ్రెసులోపార్టీ బలాబలాలు ఎలా ఉండేది తెలిసిపోతుంది.

అయితే అధ్యక్షుని ఎన్నిక పరోక్షపు ఎన్నిక గనుక ప్రజలచేత ఎన్నుకోబడిన ఎలెక్టర్లు మళ్ళీ వోటుచేసి అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటారు. ఈ ఎలెక్టర్ల సంఖ్య మొత్తం కాంగ్రెసు సభ్యుల సంఖ్యకు సమానం.

ఈ ఎలెక్టర్లలో అధికసంఖ్యాకులు డెమొక్రాట్ అభ్యర్థికి వోటిస్తే డెమొక్రాట్ అభ్యర్థి అధ్యక్షుడవుతాడు. రిపబ్లికన్ అభ్యర్థికి వోటుచేస్తే రిపబ్లికన్ అభ్యర్థి అధ్యక్షుడవుతాడు. గెలిచిన అభ్యర్థికి ప్రజలలో అధికసంఖ్యాకులు వోటుచేసి ఉండాలన్న నియమం లేదు. ఎలెక్టర్లలో అధికసంఖ్యాకులు వోటుచేస్తే, గెలుస్తాడు. ★

★ న్యాయ పరిశీలనం ★

(24-వ పేజీ తరువాయి)

గాయి. శ్రేష్ఠికి నాలుక పిడచకట్టుకుపోయింది. అప్పటికీ మహారాజంత కవ్వించి ప్రశ్నించడానికిగల కారణమేమీ అతనికి తెలియలేదు.

"ఇదిగో! మీరు చేయించిన కూటకరణానికి ప్రబలసాక్ష్యం!"

మహారాజు తన పక్కనే దంతపేటికలో అతిభద్రంగా దాచిన భూర్జపత్రగ్రంథం ఆపక్కనే కూర్చున్న ప్రధాన ప్రాడ్వివాకుని ముందుంచాడు.

దానిలో ఆ వ్యవహారపత్రం వ్రాసినందుకు ప్రతిఫలంగా నూరు సువర్ణదీనారాలిచ్చినట్లు స్పష్టంగా వ్రాసిఉంది. ప్రాడ్వివాకుడది పదిమందికీ వినబడేటట్టు గట్టిగా పైకి చదివాడు.

శ్రేష్ఠి ఆలెక్కలపుస్తకం అతిభద్రంగా తన శయ్యాగారంలో జాగ్రత్త చేసుకుంటాడు. దానిఉనికి శ్రేష్ఠికీ, అతని ప్రధాన కాయస్థునికీతప్ప ఇక రెండోకంటివాడెవ్వడికీ తెలియదు. ఆపుస్తకం మహారాజెలాగ సంపాదించారో అతనికంత వరకు తెలియనేలేదు! ఆకంగారులో అతని పైప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. మహారాజు తిరిగీ ఇంకోకమారు గర్జించాడు;

"ఇదిగో! మీరుచేయించినకూటకరణం!"

అని మహారాజింకోక భూర్జపత్రగ్రంథం హఠాత్తుగా తన దంతపేటికలోనించి పైకి తీశాడు. పక్కనే ఉన్న ప్రాడ్వివాకునికందించి కూటకరణం జరిగినభాగం ప్రత్యేకంగా అతనికి నిర్దేశించి చూపించాడు.

అదిచూచి ప్రధాన ప్రాడ్వివాకుడికవంచినతల పైకెత్తలేకపోయాడు. లేచి నిలబడి ముందుగా తన ప్రమాదం మన్నించవలసిందని మహారాజును ప్రార్థించుకొన్నాడు.

పిమ్మట ఆ కూటకరణ స్వరూపం సదస్యులకందరికీ వెల్లడించాడు:

"మేమీ వ్యవహారపత్రం ఇంతకుపూర్వం పరిశీలించాము కాని మా కీవిషయం స్ఫురించనేలేదు! ధర్మమూర్తులు, విద్వద్వరేణ్యులు అయిన మహారాజు కనకనే వారికిది సులభంగా స్ఫురించింది. ఈ వ్యవహారపత్రంలో—

"సోపాన కూపరహితం" అని వ్రాసిన చోట రహితానికి బదులుగా 'సహితం' అని శ్రేష్ఠిప్రధాన కాయస్థుడు కూటకరణం చేశాడు. ఇదిగోమీరంతా చిత్తగించండి!"

అని ఆ భాగం ప్రత్యేకంగానిర్దేశించి వారికందరికీ చూపించాడు. "సోపాన కూపరహితం విక్రీతం గృహం" అంటే "దిగుడుబావి మినహాయించి మిగిలిన భవంతి అంతా అమ్మివేయడమైనది." అని అర్థం.

కాని కర్పూరశ్రేష్ఠి వ్రాయసకాడు 'రహితం' అనే పదంలో 'ర' కారానికి బదులుగా 'స' కారం వ్రాసి 'సహితం' అని మార్చివేసి దారుణమైన కూటకరణ పాపానికి పాల్పడ్డాడు. 'సహితం' అని మార్చగానే 'దిగుడుబావితోసహా భవంతి అంతా అమ్మివెయ్యడమైనది.' అనే అర్థం ఏర్పడింది.

నాగరలిపిలో 'ర' కారం సులభంగా 'స' కారంగా మార్చివెయ్యవచ్చును. శ్రేష్ఠి దగ్గిర నూరు బంగారు దీనారాలు స్వాహాచేసి అతని ప్రధాన కాయస్థుడు ఆ అక్షరం ఆవిధంగా మార్చివేశాడు. సదస్యులదంతా ఒక క్షణంలో అవగాహన చేసుకుని హాహాకారాలు చేశారు.

అంతలో మహారాజింకోక మారు గట్టిగా గర్జించాడు:

"మీరీ అంగుళీయకం నేనేమైనా అపహరిస్తానని భయపడుతున్నారేమో! ఇదిగో మీవజ్రాంగుళీయకం! తీసికోండి!" అని తిరిగీ అది శ్రేష్ఠికిప్పించాడు.

అప్పటికి శ్రేష్ఠికి జరిగినదంతా మంచు విడిపోయినట్లు విడిపోయింది.

మధ్యాహ్నవేళ మహారాజా ఉంగరం తన పేరుమీదుగానే తన ప్రధానకాయస్థునికి దగ్గిరికి పంపించాడనీ, తిరిగి తన పేరుమీదుగానే తాను రహస్యంగా దాచిఉంచుకొన్న కలిలెకట్ల కొలువుకూటానికి తెప్పించుకొన్నాడనీ, ఆవిధంగా తన మోసం అంతా బట్టబయలయి పోయిందనీ శ్రేష్ఠి గ్రహించుకొన్నాడు.


ఇక గత్యంతరంలేక తన తప్పిదం ఒప్పుకున్నాడు. ప్రథమ తప్పిదంగా మన్నించి కొంచెంకనికరించవలిసిందని ప్రాధేయపడ్డాడు.

ఆ దారుణ కూటకరణానికి శిరశ్ఛేదశిక్ష విధించవలిసిందే! కాని మహారాజతనిమీద కొంచెం కనికరించాడు. ముందుగా ఆ భవంతి అంతా దిగుడుబావితోసహా దేవశర్మకు స్వాధీనచెయ్యవలసిందని ఆజ్ఞాపించాడు. కర్పూరశ్రేష్ఠిని సకుటుంబంగా కాశ్మీరదేశాన్నించి వెడలగొట్టించాడు. శ్రేష్ఠి ఆస్తిపాస్తులన్నీ దేవశర్మకు చెందవలెనని ఆజ్ఞాపించాడు.

ఆ తీర్పు విన్న కర్పూర శ్రేష్ఠి ప్రాణాలతోనైనా బతికి బయటపడ్డానని ఒక్క వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు.

కర్ణాకర్ణిగా ఆ న్యాయపరిశీలనగాథ విన్న శ్రీనగరపౌరులు యశస్కరదేవునికి చేయెత్తి నమస్కరించి జయజయధ్వానాలు చేశారు. ★


Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



ఆరోగ్యవంతులైన పిల్లలు ప్రతిరోజూ లైఫ్‌బాయ్ సబ్బుతో స్నానము చేయుదురు

—అది ప్రతిదిన*మలినములోని క్రిములను కడిగివేయును!

* మనకు ప్రతిదినం తార్కపడే మామూలు మురికిలో క్రిములున్నాయి. మనలో ప్రతివారికీ యీ క్రిములవల్ల రోగాల ప్రమాదం వుంది. అందుచేతనే చాలామంది ఆరోగ్యవంతులగు జనులు లైఫ్‌బాయ్ సబ్బుతో మురికిని మరియు క్రిములను రోజూ కడిగివేసుకొనుట వల్ల తమ ఆరోగ్యమును కాపాడుకొనుచున్నారు — అది ఆరోగ్యవంతమైన హాయిని గలిగించును.



L. 257-X62 TL

భారతదేశంలో తయారుచేయబడినది